ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
తాడేపల్లిగూడెం
epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
24-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 113 పేజీలు: 8+4 వెల: 8.00

ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడి! 5లో
నల్లకోటు న్యాయవాదుల్లో 40% నకిలీలే!

# గొడ్డలి పార్టీ డ్రామాలు చెల్లవు

## కోడికత్తి, గులకరాయితో ప్రజలను మోసం చేయలేరు..
## వివేకా హత్యలో లబ్ధిదారు ఎవరో ప్రజలకు తెలుసు
## దళిత డ్రైవర్‌ను హత్య చేసిన నిందితునికి వైకాపా రక్షణ
## మాజీ సీఎం జగన్‌పై సీఎం చంద్రబాబు నిశిత వ్యాఖ్యలు


శనివారం 14 కండ్రిగ సభలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**చిత్తూరు, మే 23 ప్రభాతవార్త:** రాష్ట్రంను అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు తీసుకెళ్తుండటంతో గొడ్డలి పార్టీ ఫ్రస్టేషన్‌తో తట్టుకోలేక పోతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్వజమెత్తారు. చిత్తూరు జిల్లా యాదమరి మండలం 14 కండ్రిగ గ్రామ సమీపంలో శనివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని గొడ్డలి పార్టీనే అని వాఖ్యలు చేశారు. రాష్ట్రంను ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా పార్టీ అకృత్యాలను వివరిస్తూ అదే గొడ్డలి పార్టీ నైజం అని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నోరు తెరిస్తే అపద్దాలు చెప్తున్నాడని, రెండు రోజుల క్రితం మీడియా ముందు వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాయ నాటకాలు వేసి వెళ్ళారని ఆరోపించారు. తాను 48 సంవత్సరాలుగా రాజకీయాల్లో వున్నానని, తనపై నక్సలైట్లు తిరుపతి వద్ద 23 క్లైమోర్ మైన్స్ పెట్టి దాడి చేశారని, వెంకటేశ్వరస్వామి తనకు పునర్జన్మ ఇచ్చారన్నారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీలకు చోటు లేదని, సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం అన్నారు. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అంటూ సిఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జరిగిన వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు సంబంధించి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారని, ఈ హత్యకు సంబంధించి అంతిమ లబ్దిదారులు ఎవరనే విషయం అందరికి తెలుసునన్నారు. వైఎస్ వివేకానందరెడ్డిని తాను హత్య చేసినట్లు ఇప్పుడు వచ్చి వైఎస్ జగన్ నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అలాగే కోడికత్తి, గులకరాయి డ్రామాలు ఆడుతూ ప్రజలను మోసం చేసే ఎత్తుగడను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అవలంభించారన్నారు. రాష్ట్రంలో వైకాపా అధికారంలో వున్న సమయంలో దళిత డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి డోర్ డెలవరీ చేశారని, డ్రైవర్‌ను హత్య చేసిన నిందిడుడికి వైకాపా అండగా నిలిచిందన్నారు. అలాగే కరోనా సమయంలో మాస్క్ అడిగిన పాపానికి ఓ దళిత డాక్టర్‌పై దాడి చేసి ఆపై వైకాపా ప్రభుత్వం ఆ డాక్టర్‌ను వేధించి ప్రాణాలు తీసిందని ధ్వజమెత్తారు. మరోవైపు కుటుంబ బంధాలపై సైతం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గొడ్డలి వేటు వేశారని, తల్లికి, చెల్లికి ఆస్తి ఇవ్వకుండా వేధిస్తున్నారని, తల్లికి తిండి పెట్టని వాడు పిన్నమ్మకు బంగారు గాజులు ఇస్తాడంట! అని ఎద్దేవా చేశారు. తల్లి, చెల్లిని చూడని వారు ప్రజలను ఎలా చూస్తారో చెప్పాలని ఆయన ప్రజలను ప్రశ్నించారు. అలాగే హిందూ దేవాలయాలపై దాడులు, అపవిత్ర కార్యక్రమాలు చేపట్టి ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. మరోవైపు పోలవరం, అమరావతి, పెట్టుబడులు, అభివృద్ధిపై గొడ్డలి పార్టీ అసత్య ప్రచారాలు చేస్తోందని ధ్వజమెత్తారు. వైకాపా అధికారంలో వున్న సమయంలో రాష్ట్రంలో నడి రోడ్డుపై పలువురి పీకలు కోసి వైకాపా నాయకులు వారి రక్తదాహం తీర్చుకున్నారని ఆరోపించారు. మరోవైపు రాష్ట్రంలో గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహించి రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా లభ్యం అయ్యేలా చేశారని, జంతు రక్తంతో కటౌట్‌లకు అభిషేకాలు చేసి రప్పా.. రప్పా.. అంటూ రంకెలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే వైకాపా నాయకులు కారు కింద సొంత పార్టీ కార్యకర్త సింగయ్యను తొక్కించారని, కడపలో వైఎస్ వివేకానందరెడ్డి హత్య వ్యవహారంలో కీలకమైన పెద్ద దస్తగిరిని హత్య చేశారని ఆరోపించారు. మరోవైపు కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి వైకాపా >>2

# బిజెపికి రాజ్యసభ టిక్కెట్టు ఇవ్వలేం

## తేల్చిచెప్పిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో త్వరలో జరుగనున్న రాజ్యసభ స్థానాల ఎన్నికల్లో తమకు ఒక సీటు కేటాయించాలన్న బిజెపి అభ్యర్థనకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నో చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే బిజెపికి రాజ్యసభ సీటు కేటాయించిన క్రమంలో మళ్లీ సీటు ఆశించడం సరికాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారంటున్నారు. గత వైఎస్సార్సీపీ హయాంలో ఆ పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీతో పాటు, కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ తరఫున రాజ్యసభకు వెళ్లిన సానా సతీశ్ పదవీ కాలం వచ్చే నెలలో ముగుస్తోంది.దాంతో శాసన సభలో మెజారిటీ దృష్ట్యా ఈ నాలుగు స్థానాలూ కూటమికే దక్కేఅవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. సీఎం చంద్రబాబు రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై ఇంకా పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. మహానాడు పూర్తయ్యాక, >>2



# మూడోసారి పెట్రో షాక్

## పెట్రోలు 87 పైసలు, డీజిల్ 91 పైసలు పెంపు

### పది రోజుల్లో దాదాపు రూ. 5 పెరిగిన ధర

**ముంబయి,మే 23:** సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మరోసారి ఇంధన ధరల భారం పడింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇవాళ పెట్రోల్, డీజిల్ ధరలను మళ్లీ పెంచాయి. తాజా పెంపుతో పెట్రోల్‌పై లీటర్‌కు 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరిగాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ. 99.51కి చేరగా, డీజిల్ ధర రూ. 92.49కి చేరుకుంది. గత 10 రోజుల వ్యవధిలో ఇంధన ధరలను పెంచడం ఇది మూడోసారి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడిచమురు ధరల భారాన్ని చమురు కంపెనీలు దశలవారీగా వినియోగదారులకు బదిలీ చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 15న లీటరుకు ఏకంగా రూ. >>2


శనివారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

# కీలక చర్చలు

## ప్రధాని మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో భేటీ

### ఇరాన్ సంక్షోభం ప్రత్యేక ప్రస్తావన

**న్యూఢిల్లీ, మే 23:** నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో శనివారం ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోడీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్‌అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం >>2

# గాలివాన బీభత్సం

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం సాయంత్రం తరువాత భారీ గాలివాన బీభత్సం సృష్టించింది. ఏపీలోని అనకాపల్లి, కాకినాడ, తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లాల్లో గాలితో కూడిన వర్షం అల్లకల్లోలం సృష్టించింది. గాలివాన బీభత్సం కారణంగా ఏపీలో ఇద్దరు, తెలంగాణలో ఒకరు మృత్యువాత పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో దాదాపు అరగంట పాటు గాలి, వాన రావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రమణయ్యపేట, ముకుందరాజుపేట, దోసల పాడు, చీడిక, జి.జగన్నాథపురం, గొడిచర్ల, డొంకాడ, చినదొడ్డిగల్లు, కాగిత జాతీయ, రహదారి వంటి >>2


వీచిన ఈదురు గాలులకు నారువ గ్రామంలో నేలకొరిగిన అరటి పంట

# ఈదురు గాలులకు భారీగా పంటనష్టం

## అరటి రైతులకు కోలుకోలేని దెబ్బ

**రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), మే 23 ప్రభాతవార్త:** అది నిన్నటి దాకా ఆ పచ్చని తోటలను చూసి మురిసి పోయిన కళ్లు.. చేతికందే పంటతో అప్పులు తీరిపోతాయని, ఇల్లు గడుస్తుందని ఆశపడ్డ గుండెలు. కానీ, ఆ ఆశలన్నీ ఒక్క రాత్రిలోనే గాల్లో కలిసిపోయాయి. ప్రకృతి కన్నెర్ర జేయడంతో రణస్థలం మండలం నారువ గ్రామంలోని అరటి రైతులు కోలుకోలేని ఆవేదనలో మునిగిపోయారు. శుక్రవారం రాత్రి ఒక్కసారిగా వీచిన ఈదురు గాలులు నారువ గ్రామ రైతుల పాలిట శాపంగా మారాయి. ఎంతో కష్టపడి, కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచిన సుమారు 60 ఎకరాల అరటి తోటలు ఈ గాలుల ధాటికి పూర్తిగా నేలకొరిగాయి. పచ్చగా కళకళలాడాల్సిన తోటలన్నీ ఇప్పుడు విరిగిపడి స్మశానాన్ని తలపిస్తుంటే, ఆ దృశ్యాన్ని చూసి రైతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. **ఒక్క రాత్రిలో అపార నష్టం:** ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా గ్రామానికి చెందిన నిద్రబంగి సూరిరెడ్డి, బోయి >>2



# ప్రభుత్వ విప్‌కు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాజీనామా

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్ఆర్ కడప జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి అందజేశారు. జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో శనివారం రైల్వే కోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనపై వచ్చిన పలు ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై వివరణ ఇచ్చారు. అనంతరం వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు పవన్‌కు తెలిపారు.అవన్ని పరిష్కరించుకున్న తరువాత బాధ్యతాయుతమైన పదవులను ఇస్తే నిర్వహిస్తానని శ్రీధర్ తమ పార్టీ >>2

# డబులింజన్ సర్కార్ వల్లే ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగాలు

## ఎపికి ఎక్కువ నిధులు తేవడంలో సిఎం చంద్రబాబు సక్సెస్

## రోజ్‌గార్ మేళాలో పాల్గొన్న కేంద్రమంత్రి బండి సంజయ్

### ఇప్పటి దాకా 12లక్షల మంది నియామకాలు పూర్తి


శనివారం గుంతకల్లులో నూతనంగా ఎంపికైన ఉద్యోగులకు నియామక పత్రాలు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**అనంతపురం, మే 23, ప్రభాతవార్త బ్యూరో :** దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెంతుతోందని, డబుల్ ఇంజన్ సర్కార్‌లో కేంద్రం నుంచి నిధులు ఎక్కువ తీసుకురావడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సఫలీకృతులయ్యాడని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు మించి ఉద్యోగ కల్పనలో ముందుందని, వైరవిలకు, అవినీతికి ఆస్కారం కల్పించకుండా ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ దేశ సేవకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా 47 ప్రాంతాల్లో ఒకేసారి రోజ్ గార్ మేళా కార్యక్రమం నిర్వహణతో 51,000 మందికి పైగా యువతకు నియమక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహణలో భాగంగా శనివారం గుంతకల్లు రైల్వే ప్రభాత్ క్లబ్‌లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన యువతకు నియామక పత్రాల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన రోజ్ గార్ మేళా కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఎడిఆర్ఎం బి.ఎస్.శివప్రసాద్, డివిజనల్ పర్సనల్ అధికారి హెచ్.ఎల్.ఎన్ ప్రసాద్, తదితర రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోజ్‌గార్ మేళాలో ఉద్యోగ నియామక పత్రాలు పొందుతున్న పలువురు అభ్యర్థులను ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్, అధికారులు వర్చువల్‌గా వీక్షించారు..ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కల్పన మరియు రోజ్‌గార్ మేళా భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ చేపట్టిన అతిపెద్ద కార్యక్రమం 'రోజ్‌గార్ >>2



# మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో అగ్నిప్రమాదం

## కోట్లల్లో ఆస్తి నష్టం

**ముంచంగిపుట్టు మే 23 ప్రభాతవార్త:** మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో ప్రాజెక్టుకు కోట్లల్లో ఆస్తి నష్టం సంభవించింది. అందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వ హిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగా >>2

# ఐక్య ఉద్యమాలతో ఫాసిస్ట్ శక్తుల కట్టడి

## అభ్యుదయ రచనలతో ప్రజల్లో చైతన్యం

## అరసం 23వ రాష్ట్ర మహాసభల్లో వక్తలు



**తిరుపతి,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ప్రగతిశీల శక్తులు, వామపక్ష వాదులు తమ ఎజెండాలను పక్కనపెట్టి ఐక్య ఉద్యమాలు నిర్మిస్తేనే దేశంలో ఫాసిస్ట్ శక్తులను కట్టడి చేయవచ్చునని ప్రజాస్వామ్య రచయితల వేదిక జాతీయ సమన్వయకర్త ఆచార్య కాత్యాయని విద్మహే పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర 23వ మహాసభలు తిరుపతిలో శనివారం ప్రారంభమయ్యాయి. గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్ లో ఉదయం అరసం జెండాను రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ పి సంజీవమ్మ ఆవిష్కరించారు.అనంతరం జరిగిన ప్రారంభ సభలో డాక్టర్ కాత్యాయని విద్మహే మాట్లాడుతూ ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూనిజం ను సుస్థిర పరచేందుకు అరసం ఏర్పడింది అన్నారు. నాటి నుండి రచయితలు చేసిన అనేక రచనలు సమాజం లో చైతన్యం తీసుకు వచ్చాయని అన్నారు. నేడు ప్రగతి శీల శక్తులు అనైక్యంగా ఉన్నాయని, ఫాసిస్టు శక్తులు మాత్రమే ఐక్యంగా ఉన్నాయని తెలిపారు. ఈ ధోరణి దేశానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రగతి శీల శక్తులకు ఎవరి ఎజెండాలు వారికి ఉన్నా, ఐక్య కార్యాచరణను బలంగా ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. అభ్యుదయ ఉద్యమాల్లో అస్తిత్వం ఉండడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని,

ఐక్య వామపక్ష ఉద్యమాలు బలపడితే దేశాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. ప్రశ్నించే వారిపై అర్బన్ నక్సలైట్లు అని ముద్రవేసి, కేసులు పెట్టడాన్ని తప్పుపట్టారు. ఈ నేపథ్యంలో లౌకిక, ప్రజాస్వామ్య, వామ పక్ష వాదులు ఏక తాటి పైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయమైన భారతదేశం ఏర్పడుతుందని సంఘసంస్కరణ ఉద్యమం నిరూపించిందని అన్నారు. విచ్చలవిడి తనంతో అసమానతలు పెరిగి , దోపిడి దారులు ఎక్కువ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు ప్రజాస్వామ్యం అని, అధికారం లోకి వచ్చాక తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మతాలు,పరంగా రచనలు చేసి సోషల్ మీడియాలో రెచ్చ గొడుతున్నారని విమర్శించారు. నేడు అరసం మహాసభల్లో కూడా రచయితల ఐక్యత అనివార్యం అని తీర్మానాలుచేయడం శుభ పరిణామమన్నారు. సమాజం >>2



# ఎండ మంటలు

## కృష్ణా జిల్లా కానుమోలు: 45.8$^{\circ}$

## అనకాపల్లి జిల్లా మాకవరపాలెం: 45.5$^{\circ}$

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.రోజు,రోజుకు ఎండలు ముదురుతున్నాయి.ఇంచుమించు రాష్ట్రమంతటా ఒకే వాతావరణం కన్పడుతుంది.ఎండకు ప్రజలు బయటకు రాలేని పరిస్దితి.నిత్యజీవనం భాగంగా చిరు వ్యాపారాలు నిర్వహించే వారు ఎండలో అల్లాడుతున్నారు.ముఖాలకు ముసుగులు వేసుకుని, ఎండ వేడిమి తట్టుకునే చలువ కళ్ళాద్దాలు పెట్టుకుని బయటకు వస్తున్నారు.వడదెబ్బకు అనారోగ్యంతో ఉన్న వృద్దులు మృత్యువాత పడుతున్నారు. ఒకటి రెండు చోట్ల భవన నిర్మాణ,కార్మికులు,వాహనచోదకులు వడదెబ్బతో మరణించారు.నుడు ఒక్క రోజూ వివిధ జిల్లాల్లో ఆరుగురువడదెబ్బతో మృత్యువాత పడ్డారు.వడదెబ్బ మరణాలను అధికారికంగా ఎటువంటి నిర్ధారణ జరుగలేదు,ఇప్పటి గత నెల రోజులుగా వడదెబ్బకు సుమారు 400ల మంది మరణించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.ఇక శనివారం కృష్ణా జిల్లా కానుమోలు 45.8 డిగ్రీలు, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5 డిగ్రీలు నమోదైందనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 45.5,ఏలూరుజిల్లా కుక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, పల్నాడుజిల్లా శ్రీనగర్ 45,ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.6,తూర్పుగోదావరిజిల్లా చిట్యాలలో 44.3,విశాఖ జిల్లా రూరల్లో 42.8, అల్లూరిజిల్లా రామరాజుపాలెం, కాకినాడజిల్లా >>2

# ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగా మారనుందా?

**రాచమల్ల భోగేశ్వర్ రెడ్డి**

వాతావరణ ఉష్ణోగ్రతల్లో ఏర్పడుతున్న పరిస్థితులు ఆధారంగా ఎల్‌నినో ప్రభావం ఎక్కువ వర్షాభావ ప్రాంతంగా గుర్తింపు ఉన్న రాయలసీమ జిల్లాలపై తీవ్రంగా పడుతుందా అన్నది రైతుల్లో ఆందోళన నెలకొంది. ఎల్‌నినో రాబోయే రోజుల్లో సూపర్ ఎలిమినోగా మారే అవకాశం లేకపోలేదని కొందరు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాయలసీమ జిల్లాలపై ఆ ప్రభావం ఏ మేరకుఉంటుంది. నిజంగానే ఎల్‌నినో ప్రభావం ఉంటుందని అనుకుంటే ఎలాంటి పంటలు సాగు వేసుకోవాలి? అందుకు ముందస్తుగా చర్యలేం తీసుకోవాలన్నది సీమరైతుల్లో బలంగా చర్చ సాగుతోంది. ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలపై ఏదో విధంగా ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ వర్షాభావ ప్రాంతమైన రాయలసీమ జిల్లాలపై ఇంకా ఎక్కువ చూపే అవకాశం ఉందని రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు 34 లక్షల హెక్టార్ల సాగు భూమి 85 లక్షల ఎకరాల భూమి ఉంది. ఇందులో అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాల్లో దాదాపు పది లక్షల హెక్టార్ల సాగు భూమి, కర్నూలు నంద్యాల జిల్లాల్లో ఆరు నుంచి ఏడు లక్షలు ఎట్టాల సాగు భూమి, వైయస్సార్ కడప జిల్లాలో నాలుగు లక్షల హెక్టార్ల సాగు భూమి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో దాదాపు 3.9 లక్షలు హెక్టార్ల సాగు భూమి ఉంది. రాయలసీమ జిల్లాల్లో 15 నుంచి 20 శాతం భూములకు మాత్రమే చెరువులు, కాలువల ద్వారా శాశ్వత సాగునీరు అందుతుంది. దీంతో 80 శాతం సాగు భూములకు వర్షాధారంగా మెట్ట పంటలపైనే రైతులు ఆధారపడతారు. ఈ పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల వచ్చే ఖరీఫ్‌సీజన్లో వర్షపాత పరిస్థితులు ఎలా ఉంటాయో అన్నది సీమ రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే అనంతపురం శ్రీ సత్యసాయి లాంటి జిల్లాల్లో పలు మండలాల్లో భూగర్భ జలాలు పలు మండలాల్లో ఆందోళనకర పరిస్థితిలో ఉన్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల గతంలో ఎన్నో కరవు కాటకాలను సీమ ప్రజలు ఎదుర్కొన్నారు. గత రెండు దశాబ్దాల కాలాన్ని పరిశీలిస్తే రాయలసీమ జిల్లాలో 2002–2003, 2004–2005, 2009–2010, 2011–2012, 2014–2015, 2018–2019 సంవత్సరాల్లో కరవులు వచ్చినట్లు గత పాలక ప్రభుత్వాలు కూడా గుర్తించాయి. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు వల్ల ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగా మారుతూ వస్తే సీమ ప్రజల ముఖ్యంగా రైతుల పరిస్థితి ఏంటి అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న చర్చ వల్ల



రానున్న వర్షకాలంలో మన ప్రాంతంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందా? ఆమె రైతులు ఎక్కడ చూసినా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే ఫసిఫిక్ మహా సముద్రంలో నెలకొంటున్న వాతావరణ మార్పులను బట్టి ప్రపంచ వ్యాప్తంగా ఎల్‌నినో విస్తరించే ప్రభావం ఉంటుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు హెచ్చరించాయి. మన భారత వాతావరణ సంస్థ ఐఎండి ప్రకటించిన వర్షపాత వివరాలు ప్రకారం దేశంలో తక్కువ వర్షాలు లేదా సాధారణం కన్నా తక్కువగా పడే అవకాశం ఉందని ఇటీవల ప్రకటించింది. ఐఎండి తన అంచనాలను శాస్త్రీయంగా ప్రకటిస్తుంది. ఉపగ్రహ అధ్యాయనం ద్వారా వాతావరణ మార్పులను రాడార్ గుర్తిస్తుంది. దాని ఆధారంగా అధ్యయనాలు వెల్లడిస్తారు. గతం కన్నా ఇప్పుడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా అందుబాటులోకి రావడం, వాతావరణ పరిస్థితులను ముందుగానే పసిగడుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో ఏప్రిల్, మే నెలలో జరిగే మార్పులు ప్రపంచవాతావరణాన్ని ఏవిధంగా ఉండాలనేది నిర్దేశిస్తాయి. ఈసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రత తక్కుగా ఉంటే లానినో అంటారు. దీనివల్ల అధిక వర్షాలు, వరదలు సంభవిస్తాయి. దాదాపు గత కొన్నేళ్లుగా మనం లానినోనే ఎదుర్కొంటున్నాము. అక్కడి సముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రత పెరిగితే ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో ఎల్‌నినో ఏర్పడుతుంది. దీనివల్ల రుతుపవనాలు దిశ, దశ మార్చుకొని గందరగోళంగా మారిపోయి సకాలంలో వర్షాలు పడకపోవడం, లేదాతక్కువగా కురవడం లాంటిది సంభవిస్తుంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999, 2003 సంవత్సరాల మధ్య ఎల్‌నినో ప్రభావం తీవ్రమై భయంకరమైన కరవులను రైతులు, ప్రజలు చవిచూశారు అని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈఏడాది కూడా ఎల్‌నినో సంభవిస్తుందని అంచనా వేయగా తాజాగా ప్రముఖ మెట్రాలజీస్ట్ క్రిష్ డోల్వే తన అధ్యాయనం ప్రకారం ఎల్‌నినో వేగంగా బలపడుతూ విస్తరిస్తోందని అంచనాలకన్నా తీవ్ర స్థాయిలో ఉందని నివేదించారు. ఇంతవరకు ఎప్పుడు లేని విధంగా సూపర్ ఎల్‌నినో కావొచ్చని డోల్వే అంచనా వేశారు. ఆయన కథనాన్ని అంతర్జాతీయ సీఎన్ఎన్ వెథర్ చానెల్ ఈ నెల 15వ తేదీన ప్రముఖంగా టెలికాస్ట్ వేసింది అని తెలియవచ్చింది. ఎల్‌నినోలో రెండు మూడు మార్పులను గమనించడమే కాకుండా పసిఫిక్ సముద్రంపై బాగా బలంగా విస్తరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు, దీనివల్ల గాలులు దిశ, దశ పూర్తిగా మారిపోయి వాతావరణం పొడిగా అవుతోంది. తద్వారా రుతుపవనాలు బలపడే అవకాశాలు తగ్గిపోయాయి. మనకు పసిఫిక్ సముద్రం నుంచి ఇండియన్ ఓషియన్ మీదుగాశ్రీలంక, మాల్దీవుల నుంచి అరేబియా సముద్రానికి రుతుపవానాలు విస్తరిస్తాయి. అక్కడి నుంచి కేరళ తీరానికి తాకి తద్వారా దేశం అంతా విస్తరిస్తాయి. కాస్తా అటు ఇటుగా మేనెలాఖరుకు కేరళ తీరానికి రెండు తెలుగురాష్ట్రాలకు ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు చేరడానికి వారం, పదిరోజులు పడుతుంది. ఈ ఏడాది మే 29నాటికి కేరళ తీరానికి తాక వచ్చని ఐఎండి ప్రకటించింది. ఎల్‌నినో బలపడి విస్తరిస్తే రుతుపవనాలు తీరాన్ని సకాలంలో తాకినప్పటికీ వర్షాలు పడే అవకాశాలు తగ్గిపోతాయి. వర్షాలు పడినప్పటికీ తక్కువగా కురవడం లేదా తక్కువ రోజులు పడడం సహజంగా మారిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగి, గాలిలో తేమశాతం తగ్గిపోవడం లాంటి కారణాలవల్ల పొడివాతావరణం విస్తరించి కరవు పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇదే జరిగితే మన దేశంలో వర్షాధారంగా పంటలు పండించే ప్రాంతాలు ఎడారులుగా మారిపోతాయి. నదుల్లో నీటి లభ్యత తగ్గి జలాశయాలు వెలవెలపోతాయి. తద్వారా ఆయకట్టుకునీరు లభించదు. పంటలు పండవు. ఆఖరికి తాగు నీటి సమస్య సైతం ఎదురవుతుంది. దీని ప్రభావం వ్యవసాయ ఉత్పత్తిపైనే ఎక్కువ పడుతుందని మేధావులు అభిప్రాయపడు తున్నారు. ఈపరిస్థితుల్లో ఎల్‌నినోఎదురైతే రైతులు ఇబ్బందిపడతారు. ●

క్లైమేట్ ప్రిడెక్షన్ సెంటర్ తెలిపిన వివరాల ప్రకారం పసిఫిక్ మహాసముద్రంలో 0.5 డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగింది. ఈ నెలఖరునాటికి ఇదిఒకటి నుంచి రెండు డిగ్రీలు వరకు పెరిగే అవకా శాలు 96శాతం వరకు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే ఎల్‌నినో సూపర్ ఎల్‌నినోగామారి నవంబర్, జనవరిల మధ్యపరిస్థితులు ఘోరంగా తయారవుతాయని భయపడుతున్నారు. దీని ప్రకారం ఏయే ప్రాంతాలు తడిబారిన పడతాయి, ఏయే ప్రాంతాలు పొడిగా మారి కరవుతో ఎడారిల పరిస్థితులను తలపిస్తాయనేదిఅంచనా కూడా వేసినట్లు తెలుస్తోంది. ఆ అంచనాలను ఉదహరిస్తూ ప్రముఖ మెట్రలజీస్ట్ జాన్ బరానిక్ ప్రపంచవ్యాప్తంగా ఖండాలు, ప్రాంతాల వారీగా నివేదికను వెల్లడించారు. ఆయన నివేదిక ప్రకారం ఆసియాఖండంలో పొడివాతావరణం తీవ్ర మవుతుంది. సూపర్ ఎలినినో పసిఫిక్ సముద్రంలో బలపడుతుందని ఆయన ధ్రువీకరించారు. సాధారణంగా పశ్చిమాసియా, తూర్పు ఆసియాలతోపాటు భారతదేశంలోనూ సాధారణ పరిస్థితుల్లో జూన్ నుంచిజనవరిల మధ్య మంచివర్షాలు కురవాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఉష్ణోగ్రతలు పెరుగుతూ, రుతుపవానాలు దాదాపు అంతరించిపోయేవాతావరణం నెలకొంటోంది. దీని వలన భారీ వర్షాలు పడే ప్రాంతాలు సైతం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని జాన్ తననివేదికలో పేర్కొన్నారు. ఫలితంగా రాయలసీమ జిల్లాల్లో వాతావరణం అనుకూలించక కరవు పరిస్థితులతో నీటిప్రభావం ఫలితంగా కరవులుఏర్పడి వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. ఈ ప్రభావం వర్షాకాలం అనంతరం వచ్చే శీతాకాలం పైన కూడా ప్రభావం చూపుతుందని అంచనా వేశారు. అంటే శీతాకాలంలో చలి తక్కువగా ఉంటుందని మనం అనుకోవచ్చు. మొత్తానికి ఈ అంచనాలే వాస్తవం అయితే తీవ్ర కరవు పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలు, ప్రభుత్వం ముఖ్యంగా రాయలసీమ రైతులు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉంది.

# కొత్త 'గేమ్' మొదలు!

**ఎ.వి.వి ప్రసాద్**

తమిళనాడు

మెరిసేదంతా బంగారం కానట్లే.. ముఖ్యమంత్రిపదవి కూడా అందరికీ పూల కిరీటం కాదు. కొందరికి ఆ పూల మధ్య ముళ్లు కూడా తగులుతూంటాయి, గుచ్చుకొని బాధ పెడుతూంటాయి. రెండు వారాల క్రితం తమిళ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన జోసెఫ్ విజయ్‌కి ఈ విషయం కొంచెం కొంచెం అర్థమవుతున్నట్లే కనిపిస్తోంది. ఇటీవల ఐదు అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో మిగిలిన నాలుగు చోట్ల సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడగా, ఒక్క తమిళనాట మాత్రమే 'అతుకుల బొంత' తయారయింది. ఎన్టీఆర్, ఎమ్జీఆర్ తర్వాత నిజంగానే విజయ్‌కి ప్రజలు అద్భుతమైన అవకాశం ఇచ్చారు. పెట్టిన పార్టీని రెండేళ్ల లోపునే అధికారంలోకి తెచ్చారు. గతంలో శివాజీ గణేశన్, విజయ్ కాంత్, రజనీకాంత్, కమల్ హాసన్ వంటి అగ్ర సినీ నటులు కూడా ఇలాంటి ప్రయత్నమే చేసినా, వారికి ఇవ్వని సువర్ణావకాశం ప్రజలు విజయ్‌కి పువ్వుల్లో పెట్టి అందించారు. కానీ ఆ పూల మధ్య మిగిలిన కొన్ని ముళ్లే ఇప్పుడు విజయ్‌ని ఎక్కువగా బాధిస్తున్నట్లనిపిస్తుంది. కొన్ని నిర్ణయాలు తీసుకోవడం, అంతలోనే వాటిని ఉపసంహరించుకోవడం అనుభవ రాహిత్యం వల్లనే. ముఖ్యమంత్రి హోదాలో తీసుకునే నిర్ణయాలకు తగిన మద్దతు లభించనప్పుడు ఆ సీటులో కూర్చున్నవారెవరికైనా ఎంత కష్టంగా ఉంటుందో విజయ్‌కి ఇప్పుడిప్పుడే అనుభవంలోకి వస్తోంది. ముఖ్యమంత్రి సింహాసనంపై కూర్చున్న వారికి ఎప్పుడైతే తగిన 'సొంత బలం' లేదో, అప్పుడు చుట్టూ ఉండే 'మిత్రులు' ఆడే ఆట కూడా భిన్నంగానే ఉంటుంది. ఇప్పుడదే కనిపిస్తోంది. 'మిత్రుల' పేరుతో విజయ్ చుట్టూ చాలామందే చేరారు. వారంతా ప్రత్యర్థి పార్టీ మిత్రులు. ఎవరి వద్దకు వెళ్లకూడదనుకున్నారో చివరికి వారి మద్దతునే విజయ్ కోరారు. 35 శాతం ఓట్లిచ్చిన ప్రజలు మరో పది సీట్లు ఇవ్వకపోవడంతో వాటి కోసం విజయ్ పడరాని పాట్లు పడ్డారు. పది రోజుల పాటు కంటిపై కునుకు లేకుండా ప్రయత్నించారు. ఆ 'పది' కనిపిస్తే గాని తాను ఆహ్వానించబోనని గవర్నర్ భీష్మించడంతో విజయ్ తొక్కని గడప లేదనే చెప్పాలి. కరుణానిధి పార్టీతో కొన్ని దశాబ్దాల పాటు కలిసి నడిచిన కాంగ్రెస్ ఆ 'గొడుగు' బయటకు వచ్చి టివికె గూటికి చేరడంతో విజయ్‌కి నిజంగానే తొలుత పెద్ద బలం చేకూరినట్లయింది. ఆ పార్టీకి ఉన్నవి ఐదు సీట్లే అయినా, ఓ జాతీయ పార్టీ తమ వెంట ఉందనే అభిప్రాయం విజయ్‌కి బలం పెంచింది. అయినా 'నంబర్' చాలక డిఎంకె లోని మరికొన్ని మిత్రపక్షాల మద్దతు కోసం విజయ్ ఎడతెగని ప్రయత్నాలు చేశారు. చివరికి ఐయుఎంఎల్, సిపిఎం మద్దతు ఇచ్చినా ఇంకా రెండు సీట్ల దూరంలో విజయ్ నిలబడ్డారు. ముప్పుతిప్పలు పెట్టి చివరికి ఆ రెండు సీట్లను విసికె ఇవ్వాక విజయ్ పీఠం అధిష్ఠించి బల పరీక్షకు సిద్ధమయ్యారు. ఆ దశలో ఆయనకు అనూహ్యంగా 144 మంది సభ్యుల మద్దతు లభించడంతో తన 'బలం' పై ఆయన భారీగానే ఆశలు పెంచుకున్నారు. అయితే అసలు 'ఆట' కూడా అప్పుడే మొదలయింది. అన్నాడిఎంకె లోని రెబెల్ వర్గం 26 మంది విజయ్‌కి మద్దతు ఇవ్వడంతో గేమ్ మారింది. అదొక పెద్ద ఆట అని తర్వాత పరిణామాలను బట్టి తెలుస్తోంది. డిఎంకె అధినేత స్టాలిన్ గతవారం ఒక ప్రకటన చేస్తూ విజయ్ ప్రభుత్వం ఏ క్షణంలోనైనా కూలిపోతుందనీ, మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలనీ పార్టీ కార్యకర్తలకు పిలుపునివ్వడం కూడా పెద్ద సంచలనమే సృష్టించింది. ఆట మరో మలుపు తిరుగుతోందని అప్పుడే అనిపించింది. ఎందుకంటే, విజయ్ చుట్టూ ఉన్న మిత్రులందరూ డిఎంకె వర్గమే. విజయ్ ప్రభుత్వం డిఎంకె మిత్రులపై ఆధారపడి నడుస్తోందనీ, అందువల్ల అతడు జాగ్రత్తగా వ్యవహరించాలనీ స్టాలిన్ చేసిన హెచ్చరిక ప్రకంపనలు సృష్టించింది. ఆ వెంటనే విజయ్ గత బుధవారం మంత్రి వర్గాన్ని విస్తరించి కొత్తగా 23 మందిని చేర్చుకున్నారు. వారిలో ఇద్దరు కాంగ్రెస్ వారు కావడం విశేషం. అక్కడితో ఆగకుండా, 48 గంటలు తిరగకుండానే శుక్రవారం మరో ఇద్దరిని కేబినెట్‌లోకి తీసుకున్నారు. దానితో మొత్తం మంత్రులసంఖ్య35కు పెరిగింది. ఐయుఎంఎల్, విసికె పార్టీల నుంచి కూడా కేబినెట్‌లోకి రావడంతో అన్నాడిఎంకె రెబెల్స్ కూడా మంత్రి పదవుల కోసం ఆశపడ్డారు. విజయ్ అందుకు కూడా సిద్ధమైనా, సిపిఎం, విసికె వ్యతిరేకించడంతో మళ్లీ వెనక్కి తగ్గారు. ఇప్పుడిది కొత్త సమస్యగా మారింది. ఇక తమకు మంత్రి పదవులు రావని భావించిన అన్నాడిఎంకె రెబెల్స్ మళ్లీ ప్లేటు మార్చి తాము తమ పార్టీ లోనే ఉన్నామనీ, జయలలిత ప్రభుత్వాన్ని మళ్లీ చూస్తామనీ ప్రకటించడం ఆట ఎటు తిరుగుతోందో తెలుపుతోంది. ఈ కథ నడవడానికి ముందు, రజనీకాంత్ స్టాలిన్‌తో సమావేశం కావడం ఒకసారి గుర్తుచేసుకోవలసి ఉంది. బిజెపి ఆలోచన మేరకు అన్నాడిఎంకె, డిఎంకె మధ్య సయోధ్య కోసం ఆ భేటీ జరిగినట్లు అనుకొన్నారు. దానిలో వాస్తవం లేకపోలేదు. స్టాలిన్ తాజాగా చేసిన హెచ్చరిక, అంతకు ముందు జరిగిన ఆ భేటీ, అన్నాడిఎంకె రెబెల్స్ ప్లేటు మార్చడం తేలికగా తీసివేసే విషయాలు కావు. డిఎంకె సిగ్నల్ ఇస్తే 'మిత్రుల' అభిప్రాయాలు మారిపోవచ్చు. వైరి వర్గాలైన డిఎంకె, అన్నాడిఎంకె మధ్య సయోధ్య కుదురుతుందా, లేదా అన్నది ఇప్పుడే చెప్పలేం. అది విజయ్‌పాలన తీరుపై ఆధారపడి ఉంటుంది. అప్పుడు 'గేమ్' మళ్లీ మొదటికి రావచ్చు. చెప్పలేం. రాజకీయాల్లో ఎవరూ ఎవరికీ 'నిత్య మిత్రులు'కారు. అదే విధంగా శత్రువులూ కారు. ఎవరి ఆట వారిది. ఎన్నికల్లో కంటే ఈ ఆటలో గెలవడమే విజయ్ వ్యూహ నిపుణతకు అసలైన పరీక్ష. అభిమాన సంఘాలు ఎన్నికల్లో ఓట్లు తెచ్చాయి కానీ పాలనలో పదవి చేజారకుండా నిలబెట్టగలవా! ఆట ఎలా మారుతుందో చూడాలి. ●



ముఖ్యమంత్రి విజయ్

# సంస్కరణల దిశగా కొత్తపాలన!

**గన్ని మోహన్**

హంగేరి

మధ్యయూరోప్‌లో ఏడుదేశాల సరిహద్దులు కలిగి ఉన్న అతి చిన్నదేశం హంగేరిలో కమ్యూనిస్టుల పాలన తర్వాత మొదటిసారి స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాయి. పీటర్ మాగ్యార్ దేశ నూతనప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దీనితో అప్పటి వరకూ ఉన్న నియతృత్వ పాలన శకానికి తెర పడింది. 16 ఏళ్లపాటు తన నిరంకుశ పాలనతో దేశాన్ని శాసించిన విక్టర్ ఓర్బాన్ గత నెలలో జరిగిన ఎన్నికలలో, మాగ్యార్‌కు చెందిన టిస్జా పార్టీ, ఓర్బాన్ జాతీయవాద పార్టీ అయిన ఫిడెజ్‌ను అనూహ్యంగా ఓడించింది. హంగేరీ కమ్యూనిజం అనంతర చరిత్రలో పార్లమెంటులో మరే ఇతర పార్టీ కంటే కూడా ఎక్కువ ఓట్లు సాధించింది. టిస్జా పార్టీకి పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ లభించడంతో ఓర్బాన్‌కు ఓటమిని అంగీకరించక తప్పలేదు దీనికితోడు ప్రపంచ దేశాలు కూడా ఎన్నికలను స్వాగతించాయి. అలాగే మాగ్యార్ ప్రధాని ఎన్నికపైనా శుభాకాంక్షలు తెలియజేస్తుండటంతో ఇప్పుడు ఓర్బాన్ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతోంది. ప్రపంచంలోని ప్రతి స్వేచ్ఛాభిమాని హంగేరియన్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. అత్యంత క్రూరమైన నిరంకుశత్వాన్ని కూడా అత్యంత సామాన్య, రక్తమాంసాలు గల ప్రజలే ఓడించగలరని మీరు దేశానికి, ప్రపంచానికి స్పష్టం చేసారని మాగ్యార్ తొలి ప్రసంగంలో పేర్కొనడం చూస్తుంటే ఇకదేశంలో నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందన్న హెచ్చరికలు చేసినట్లనిపించింది. హంగేరీ నూతన నాయకుడిగా, ఓర్బాన్ పాలనలో తీవ్రంగా దెబ్బతిన్న ప్రజాస్వామ్య సంస్థలను,ప్రభుత్వ అధికారాల సమతుల్యతను పునరుద్ధరిస్తానని, అవినీతిపై ఉక్కుపాదం మోపాల్సిందేనని మాగ్యార్ ప్రతిజ్ఞ చేశారు. ఆయన పరిపాలన యూరోపియన్ యూనియన్‌లోని రాజకీయ గతిని మార్చివేస్తుందని భావిస్తున్నారు. అక్కడ మాజీప్రధానమంత్రి కీలక నిర్ణయాలను,పొరుగు దేశమైన ఉక్రెయిన్‌కు మద్దతుకు సంబంధించిన నిర్ణయాన్ని, తరచు వీటో చేస్తూ రష్యాకు చేరువ అయిన ఓర్బాన్ విధానాలు పునఃసమీక్షిస్తానని ప్రకటించిన మాగ్యార్ ఆ దిశగా దూసుకుపోతున్నారు. కేవలం రెండేళ్లక్రితమే టిస్జా పార్టీని స్థాపించి అధికారంలోకి తెచ్చిన మాగ్యార్ టిస్జాకు అపూర్వ విజయం తెచ్చారు. హంగేరీలోని 199 స్థానాలు గల పార్లమెంట్‌లో, టిస్జా ఇప్పుడు 141 స్థానాలను సాధించింది. ఓర్బాన్ ఫిడెజ్‌కేడీఎన్‌పీ కూటమి 135 నుండి 52 స్థానాలకు పడిపోయి అధికారం కోల్పోయింది. తన ప్రమాణస్వీకారాన్ని, ఓర్బాన్ శకం ముగింపును పురస్కరించుకుని, కొస్సూత్ స్క్వేర్‌లో జరిగే 'పాలన మార్పు' వేడుకకు హాజరు కావాలని మాగ్యార్ హంగేరియన్లకు పిలుపునిచ్చారు. సామాజిక సమీకరణల ప్రకారం విభజించి పాలించే తీరును తాను అనుసరించబోనన్న వాగ్దానం చేయడంతో ప్రజలు మాగ్యార్‌కు ఓట్లవర్షం కురిపించారు. ఇప్పటివరకూ మహిళలకు ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉండేది. కానీ మాగ్యార్ హయాంలో హంగేరి పార్లమెంటులో 54మంది మహిళా చట్టసభ్యులున్నారు. వీరిలో ఎక్కువ మంది టిస్జా పార్టీకి చెందినవారే కావడం గమనార్హం. ఈప్రాతినిధ్యం హంగేరి చరిత్రలోనే అత్యధికమని నిపుణులు సైతం అంగీకరించారు. ప్రత్యేకించి ఉక్రెయిన్‌పై అనుసరించే వైఖరుల్లో గతంలోని ఓర్బాన్‌రష్యావైపునకు వెళ్లడం హంగేరి ప్రజలకు ఎంతమాత్రం రుచించలేదు. ఉక్రెయిన్‌లో గడచిన మూడున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధకాండపై హంగేరీ వాసుల్లోను ఉక్రోషం పెరుగుతోంది. అందువల్లనే నియంతృత్వ వాదిగా ముద్రపడిన ఓర్బాన్‌ను ఈసారి ఖచ్చితంగా ఓడించి తీరాలన్న పట్టుదలతోనే మాగ్యార్‌కు పట్టం కట్టారు. ఓర్బాన్ పాలనలో, యూరోపియన్ యూనియన్‌లోని దాదాపు అన్ని ఇతర 26దేశాలతో పోలిస్తే ప్రభుత్వంలో మహిళల సంఖ్య తక్కువగాఉండేది. మహిళలు ఈ కొత్త, అందమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అందుకేవారి ప్రాతినిధ్యం పెంచినట్లు మాగ్యార్ స్వయంగా ప్రకటించారు. యూరోపియన్ యూనియన్‌తో సంబంధాలను పునరుద్ధరించడం ఓర్బాన్ తెగిపోయేంత వరకు నెట్టిన యూరోపియన్ యూనియన్‌తో తన దేశ సంబంధాలను పునరుద్ధరిస్తానని, ఓర్బాన్ రష్యాకు మరింత దగ్గరవ్వడంతో పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశాల సరసన హంగేరి స్థానం ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో దానికి పూర్వ వైభవాన్ని తెస్తానని మాగ్యార్ హామీ ఇచ్చారు. అంతేకాదు పార్లమెంటు భవనంపై తొలిసారి ఈయు జెండాను ఎగురవేసారు. హంగేరికి స్వేచ్ఛా ప్రజాస్వామ్య వాతావరణం కల్పిస్తానని హామీలు కుమ్మరించిన మాగ్యార్‌కు ముందున్న ముళ్లబాటలో సవాళ్లు కూడాఅధికమే. శాంతిభద్రతలు, అవినీతి ఆందోళనల కారణంగా ఓర్బాన్ హయాంలో స్తంభింపజేసిన హంగేరికి చెందిన సుమారు 20 బిలియన్ డాలర్ల ఈయూ నిధులను ముందు విడుదలచేయించాలి. గత నాలుగేళ్లుగా సంక్షోభంలో చిక్కుకున్న హంగేరి ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి నిధులు చాలా అవసరం. అంతేకాకుండా వీలైనంత త్వరగా రష్యాప్రభావాన్ని దేశంపై పడకుండా చూసుకోవాలని కూడా ఆయనకు ప్రజలనుంచి వత్తిడి వస్తోంది. టిస్జాకు ఓటు వేసిన దాదాపు 34 లక్షల మంది హంగేరియన్లలో చాలామంది, పదవీ విరమణ చేస్తున్న ప్రభుత్వం దుష్ప్రవర్తనగా భావిస్తున్న దానికి ఫిడెజ్ అధికారులు వారి వ్యాపార మిత్రులను జవాబుదారీగా చేయాలని మాగ్యార్‌ను డిమాండ్‌చేస్తున్నారు. ఓర్బాన్ పదవీ కాలంలో దుర్వినియోగం చేయబడిన ప్రజా నిధులను దర్యాప్తుచేసి, తిరిగి రాబట్టే బాధ్యతతో కూడిన జాతీయ ఆస్తుల రికవరీ,పరిరక్షణ సంస్థ ఏర్పాటుచేసి దేశ ఆర్థికపరిస్థితిని గాడిలోకి తెస్తానని చెపుతున్న ప్రధానికి దేశ ప్రజల నుంచి ఆయనకు సంపూర్ణ మద్దతు లభిస్తున్నా ఈయూ నుంచి ఎదురయ్యే సహకారమే ఇప్పుడు ఆయనకు అత్యంత కీలకం అవుతోంది. ●



పీటర్ మాగ్యార్

# నీట్ రద్దుతో విద్యార్థుల కలలకు విఘాతం!

**తండ సదానందం**

సమాజంలో అత్యంత గౌరవం,హోదా, ప్రతిష్టలు కలిగిన వృత్తి అంటే వైద్యవృత్తి. ప్రాణాలను రక్షించే వారు వైద్యులు. అటువంటి వృత్తిని చేపట్టడానికి విద్యార్థులు బాల్యం నుండే కలలు కంటారు. కలలు కనడమే కాదు వానిని సహకారం చేసుకోవడానికి ఎంతో కష్టపడతారు. విద్యార్థులు మాత్రమే కాదు, వారి తల్లిదండ్రులు కూడా ఎంతో త్యాగం చేయవలసి ఉంటుంది. వైద్య వృత్తిలోకి ప్రవేశించడానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షను రాయవలసి ఉంటుంది. అందుకుగాను లక్షలాది రూపాయలు కుమ్మరించి కార్పొరేట్ కళాశాలలో ఇంటర్‌తో పాటు నీట్ కోచింగ్ తీసుకుంటేనే సీటుసాధించడం సాధ్యమవుతుంది. కాలచక్రంతో పరిగెత్తుతూ లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి నిరంతరం శ్రమించి నీట్‌పరీక్ష బాగానే రాశాము,డాక్టర్ అవుతామని కలలు కంటుంటే ,వారి నెత్తిన పిడుగు పడ్డట్టు నీట్ రద్దు వార్తవచ్చింది. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయిందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులకు లాభం జరగకూడదని సదుద్దేశంతో నీట్ రద్దు చేస్తున్నామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వాహకులు, సంబంధిత విద్యా మంత్రి చావు కబురు చల్లగా అది కూడా విద్యార్థుల ప్రయోజనం కొరకు పాటుపడుతున్నట్లు ప్రకటించడం మొసలి కన్నీరు కార్చడమే. పరీక్ష రద్దు చేయడం వల్ల విద్యార్థులకు మేలు కలుగుతుందా? అహోరాత్రులు కార్పొరేట్ కళాశాలలో తిని తినక చిక్కిశల్యమై, అమ్మానాన్నలు నగలు, ఆస్తులు అమ్మి ఫీజుకడితే ఆ గుండె భారాన్ని తమలోనే దిగమింగుకొని, వారి కష్టాన్ని గుర్తుచేసుకొని, వారి కలలను నెరవేర్చడానికి పరీక్ష బాగా రాసి సీటు వస్తుందని ఆశిస్తున్న విద్యార్థులకు ఆశనిపాతం. ఈ నెల మూడున దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షకు 23 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 96.92 హాజరైనారు. తాజాగా నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అయిందని రద్దు చేస్తే అది తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విద్యార్థుల బలిదానం కొత్తేమీకాదు, ప్రతి ఏటా ఎంతోమంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడుతూనే ఉన్నారు. నీట్ పరీక్ష లీక్ అనేది ప్రతి ఏటా ఉత్తరాది రాష్ట్రాలలో జరుగుతుందని నిపుణుల అభిప్రాయం. ఈసారి చేత్తో రాసిన ప్రాక్టీస్ క్యాస్షన్ బ్యాంకులో 281 ప్రశ్నలుంటే 138 ప్రశ్నలు పరీక్షలు వచ్చాయి ఈ పేపరు పరీక్షకు ముందే రాజస్థాన్లో బాగా సర్కులేట్ అయింది. నీట్‌పరీక్ష దేశవ్యాప్తంగా 2017 నుండి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. కానీ ఆది నుండి అక్రమాలు జరుగుతున్నాయి. 2024లో భారీ కుంభకోణం, 2025లోను లీక్ అయిందనే వార్త ఇప్పుడు వెలుగులోకి వస్తుంది. 2026 లో మళ్లీ పూనే కేంద్రంగా లీకై రాజస్థాన్ గుండా దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన బడా బాబులకు, కార్పొరేట్ కోచింగ్ సెంటర్లకు అందినట్లు తెలుస్తుంది. నీట్ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పూర్తిగా వైఫల్యం చెందింది. ప్రతి ఏటా లీక్ అవ్వడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడడమే. ప్రతిష్టాత్మకంగా పకడ్బందీగా పారదర్శకంగా దేశవ్యాప్తంగా నిర్వహించాల్సిన పరీక్ష, పేలవంగా ప్రతిసారి లీక్ అవ్వడం అంటే విద్యార్థుల భవిష్యత్తు పట్ల,విద్యా వ్యవస్థ పట్ల నిర్వాహకులకు ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవుతుంది. ఎన్ టి ఏ నుండి పేపర్ లీక్ అయితే పరీక్షను పారదర్శకంగా నిర్వహించేది ఎవరు? పేపర్ తయారీ కమిటీ మెంబర్లు పేపర్‌అమ్ముకుంటే పరీక్ష గోప్యతను కాపాడేదెవరు? దీని వెనుక పెద్ద ఎత్తున కోట్లాది రూపాయలు చేతులు మారడం, పెద్ద తలకాయల జోక్యం కూడా ఉండి ఉంటుంది. నీట్ పరీక్ష జరిగిన వెంటనే ప్రతి ఏటా ఆరోపణలు వెలువెత్తుతున్న దొరికితే దొంగ లేకపోతే దొర అన్న రీతిలో పరీక్ష కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా విద్యార్థులు వారితల్లిదండ్రులు మొత్తంవ్యవస్థ ప్రభావితమైందని,పరీక్ష వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉండేందుకు మళ్లీ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని, తప్పు జరిగిందని దానికి తాము బాధ్యత వహిస్తామని ఎన్‌టిఏ డైరెక్టర్ చెప్పడం విడ్డూరంగా ఉంది. విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే తప్పు జరిగింది అంటే సరిపోతుందా? బాధ్యత వహించడం అంటే వారి ప్రాణాలను వెనక్కి తేగలరా? ఉజ్వల భవిష్యత్తు కలిగిన మానవ వనరులుగా దేశానికి సేవ చేద్దామనుకున్నా వారి ప్రాణాలను హరించడం బాధ్యత వహిస్తామని వట్టి మాటలతో చెప్పడం, ప్రతి సంవత్సరం ఇలాగే పునరావృతం అవుతున్నను,మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామనడం హాస్యాస్పదం. ఎన్టిఏ ఏర్పడిన నాటి నుండి ఏనాడు ఈ నీట్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రతిసారి ఏవో కొన్నిఆరోపణలు అక్రమాలతో నెట్టుకొస్తుంది. సాక్షాత్తు ఎన్ టి ఏ ఆధ్వర్యంలోని నీట్ కమిటీ మెంబర్ల ద్వారా లీక్ అవ్వడం, ఆ తయారీదారులు సొంతంగా కోచింగ్ సెంటర్లు నిర్వహించడాన్ని బట్టి పరీక్షా పారదర్శకతను అర్థం చేసుకోవచ్చు. ఒక హాస్టల్ నిర్వాహకుడు ఎన్ టి ఏ కు సమాచారమిచ్చేదాకా ఈ లీక్ వ్యవహారం వెలుగులోకి రాలేదంటే మన నిఘా వ్యవస్థలు ఎంత నిద్రపోతున్నాయో, లేదా తెలిసి కూడా కావాలని ఉపేక్షించినాయో వారికే తెలియాలి. పరీక్ష పేపర్ లీక్ వార్త రాగానే మొదట్లో ఎన్టిఏ తేలికగా తీసుకొని కొట్టిపారేయడం,తర్వాత ఒత్తిళ్లకు తలొగ్గి దర్యాప్తు మొదలుపెట్టడం, గతంలో జరిగిన ఘటనల నుండి నేటి వరకు అదే కథ. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించలేకపోయాం అన్నది చెప్పకుండా ప్రతిసారి రద్దు అవసరాన్ని చెప్పుకురావడం శోచనీయం. పరీక్ష ఫీజు వాపస్‌తో విద్యార్థులకు జరిగిన అన్యాయం తీరుతుందా? ఈ అన్యాయానికి ఎవరు బాధ్యత వహిస్తారు?ఎలాన్యాయం చేస్తారు? మళ్లీ పరీక్ష నిర్వహించడం న్యాయం ఎట్లా అవుతుంది? కొద్దిమంది అక్రమార్కులు ఉంటే లక్షలాదిమంది విద్యార్థులకు శిక్ష వేయడం ఏన్యాయ సూత్రం? వందమంది దోషులు తప్పించుకున్న ఒక నిర్దోషికి శిక్ష పడవద్దు అనేది సామాజిక న్యాయ సూత్రం. దానికి విరుద్ధంగా రాజ్యం చేసిన తప్పుకుచిన్నారుల భవిష్యత్తు తలకిందులు కావడం అన్యాయమా? న్యాయమా? ఏలికలకే తెలియాలి. మళ్లీ చదవడం, పరీక్ష రాయడం, ఉత్తమ ఫలితం రావడం అనేది విద్యార్థుల మానసిక స్థాయి పై ఆధారపడి ఉంటుంది. విద్యార్థులు అధైర్యపడి డిప్రెషన్స్‌లోనై అసలు పరీక్ష రాయకుండా ఉండే అవకాశం కూడా ఉంటుంది. గతంలో చాలామంది డిప్రెషన్‌కి లోనై వదిలేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ పసి మనసులకు ఏర్పడినగాయం వారి భవిష్యత్తుకు విఘాతం. ఒకవేళ ధైర్యంగా రాసినా గతంలో కనబరిచిన ప్రతిభ కనబరచకపోవచ్చు. దీంతో డాక్టర్ కావలసిన విద్యార్థులు, ఆ విద్యార్థుల తల్లిదండ్రులు భరించరాని మానసిక వేదనను అనుభవిస్తూమానసిక రోగులుగా మారే ప్రమాదం ఉందని, అలా గత అనుభవాలు చెబుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైద్యవృత్తిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా రాష్ట్రాల పరిధిలో జరిగేవి. ఆయా రాష్ట్రాలు తమ పరిధిలో పకడ్బందీగా పారదర్శకంగా కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించి ప్రవేశాలు జరిపాయి. 2017తర్వాత కేంద్రీకృతం చేసి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసి నీట్ పరీక్షను నిర్వహిస్తుండడంతో ఈ అనర్థాలు వెలుగులోకి వస్తున్నాయి. దీనిలో స్థానిక భాషలలో ప్రశ్నాపత్రం లేకపోవడం వల్ల వెనుకబడిన రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. నీట్ పరీక్షను పాస్ కాలేక, వైద్యవృత్తిని అందుకోలేక ఎంతోమంది విద్యార్థులు ప్రాణాలను తీసుకుంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు, ఆది నుండి తమిళనాడు రాష్ట్రం ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నది. అయినను దీనిపై సమీక్ష చేయకుండా, ఈ అనర్థాలను తొలగించకుండా ప్రజాస్వామ్య విరుద్ధంగా, సమాఖ్య విధానానికి తూట్లు పొడిచి కేంద్రీకృత విధానంతో కొనసాగించడం, ఈ అక్రమాలకు తావు ఏర్పడేలా చేయడం అప్రజస్వామికమే. ప్రతి ఏటా విద్యార్థులు పిట్టల రాలిపోతున్న కనికరం లేకుండా ఈ విధానంలో మార్పులు చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఇకనైనా చిన్నారుల భవిష్యత్తును త్రుంచి వేయకుండా విశ్వాసనీయంగా పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించి తద్వారా వ్యవస్థ పై ఉన్న నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ●



# ఇరాన్‌పై మళ్లీ అమెరికా దాడి!




## దౌత్యయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు ట్రంప్ ప్రణాళిక

**వాషింగ్టన్, మే 23:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించి ఏ క్షణంలోనైనా ప్రకటన రావొచ్చని వార్తలు వస్తుండగా మరోవైపు ఇరాన్‌పై మరోసారి దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందనే నివేదికలు వెలువడుతున్నాయి. చివరి నిమిషంలో దౌత్య ప్రయత్నాలు విఫలమైతే సైనిక చర్యకు దిగే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా అధికారులను ఉటంకిస్తూ అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌తోపాటు కీలక అధికారులతో ట్రంప్ శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఇరాన్‌పై తదుపరి తీసుకోవాల్సిన చర్యల గురించి అధ్యక్షుడు వారితో చర్చించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో చర్చలు విఫలమైతే వెంటనే సైన్యాన్ని రంగంలోకి దించే విషయం గురించి వారు మాట్లాడుకున్నారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, దాడులకు సంబంధించి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించాయి. ఈ సమావేశం తర్వాత వైట్‌హౌస్ అధ్యక్షుడి కార్యక్రమాలకు సంబంధించిన కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది. మెమోరియల్ డే సందర్భంగా న్యూజెర్సీకి వెళ్లాలని ట్రంప్ తొలుత నిర్ణయించుకున్నారు. అయితే, దాన్ని రద్దు చేసుకున్న ఆయన వైట్‌హౌస్‌లోనే ఉండనున్నారు. ఇక, అమెరికాకు చెందిన పలువురు సైనిక, నిఘా అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకున్నారు.

**నా కుమారుడి పెళ్లి వెళ్లడం లేదు : ట్రంప్**

ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందనే వార్తల నేపథ్యంలో ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి హాజరుకావడం లేదన్నారు. ట్రంప్ జూనియర్, బెట్టినా ఆండర్సన్‌ల పెళ్లి చూడాలని తనకు ఎంతో ఆశగా ఉందంటూ అధ్యక్షుడు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. అయితే, ప్రభుత్వ కార్యక్రమాల వల్ల తాను అక్కడికి వెళ్లలేక పోతున్నానని తెలిపారు. ఈ కీలక సమయంలో తాను వైట్‌హౌస్‌లోనే ఉండటం అత్యంత ముఖ్యమని భావిస్తున్నట్లు వెల్లడించారు.




# అమెరికా 'గ్రీన్‌కార్డ్'కు స్వదేశం నుంచి దరఖాస్తు!

## నిబంధనల్లో మార్పులు చేసిన ట్రంప్ ప్రభుత్వం

### కొందరిని మినహాయిస్తున్నట్లు వెల్లడి

**వాషింగ్టన్, మే 23:** అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డ్) కోరే తాత్కాలిక వలసదారులు ఇకపై దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ (యుఎస్‌సిఐఎస్) స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.అయితే ఈ రూల్ అందరికీ కాదని తెలుస్తోంది. తాజాగా ఆగ్రహంగా ఇందులో కొన్ని మినహాయింపులు ప్రకటించింది. 'అమెరికా జాతీయ ప్రయోజనాలు లేక ఆర్థిక ప్రయోజనాలు ముఖ్యం అనుకునే వలసదారులకు ఈ రూల్స్ నుంచి మినహాయింపులు ఇస్తాం. గ్రీన్‌కార్డు ఆశావహులు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా మా దేశానికి ప్రయోజనం ఉందని భావిస్తే.. వాటిని మేం పరిగణనలోకి తీసుకుంటాం. దాంతో వారు ప్రస్తుతం నిబంధనల ప్రకారమే కొనసాగే అవకాశం ఉంటుంది. మిగతా వారిని వారి మాతృదేశానికి వెళ్లి దరఖాస్తు చేసుకోమని సూచిస్తాం' అని యుఎస్‌సిఐఎస్ ప్రతినిధి జాక్ కష్నర్ వెల్లడించారు. అవి తమ దేశానికి ప్రయోజనం కలిగించే వ్యక్తుల నుంచి వచ్చిన దరఖాస్తులు అని ఎలా నిర్ణయిస్తారో మాత్రం వెల్లడించలేదు. ముందుగా వెలువరించిన గ్రీన్‌కార్డు నిబంధనల ప్రకారం అసాధారణ పరిస్థితుల్లోనే ఇందుకు మినహాయింపు ఉంటుందని జాక్ కష్నర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అలాంటి మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకునే వారి విషయంలో అధికారులు అన్ని పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కొత్త నిబంధనలతో చట్టంలోని లోపాలను ఉపయోగించుకుంటూ ఈ వ్యవస్థను దుర్వినియోగం చేసే అవకాశాలు తగ్గిపోతాయని పేర్కొన్నారు.



# సింధుజలాల వినియోగానికి రూ.22వేల కోట్లతో రెండు భారీప్రాజెక్టులు

**శ్రీనగర్, మే 23:** పహల్గాంవ్ ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్‌సింధూర్‌చేపట్టిన భారత్ సింధుజలాల నిలిపివేతను కూడా అమలుచేసి పాక్‌ను చిక్కుల్లోకి నెట్టినసంగతి తెలిసిందే. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ పాకిస్థాన్ తో ఉన్న 1960 నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. పాకిస్థాన్ లో ఉగ్రవాదం పూర్తిగా అణిచివేసేంత వరకూ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించలేమని భారత్ స్పష్టం చేసింది. పశ్చిమ నదులపై ముఖ్యంగా చీనాబ్ నదిపై హక్కులను పూర్తిగా వినియోగించుకోవడానికి భారత్ భారీ ప్రాజెక్టలను వేగవంతం చేసింది. కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్ లోని చీనాబ్ నదిపై సుమారు రూ. 3,200 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన దుల్హస్తీ స్టేజ్2 జలవిద్యుత్ ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతులు లభించాయి. ఇది గతంలో ఉన్న 390 మెగావాట్ల దుల్హస్తీ స్టేజ్ 1 ప్రాజెక్ట్ కు పొడిగింపుగాఉంది. చీనాబ్ నదిపై అత్యంత కీలకమైన, దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న 1,856మెగావాట్ల సవాల్ కోట్ ప్రాజెక్ట్ పనులకు కేంద్రం వేగవంతం చేసింది. ఈ మేరకు నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఈ డ్యామ్, టన్నెల్స్ నిర్మాణానికి అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఈమొత్తం ప్రాజెక్ట్ వ్యయం సుమారు రూ.22,700 కోట్లు ఉంటుందని అంచనా. ఇక ప్రస్తుతం సింధూ నది జలాలా ఒప్పందం నిలిపివేత నేపథ్యంలో దశాబ్దాలుగా పాకిస్థాన్ అభ్యంతరాల వల్ల ఆగిపోయిన సవాల్ కోట్, పాకల్ దుల్, రాతల్, కిరు వంటి మెగా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి జమ్మూ కాశ్మీర్ ఇంధన అవసరాలను తీర్చాలని భారత్ నిర్ణయం తీసుకుంది.

# పశ్చిమాసియాలో ముసిరిన యుద్ధమేఘాలు

## గగనతలం మూసివేసిన ఇరాన్



**టెహ్రాన్, మే 23:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరాయి. ఇరాన్‌పై కొత్త దాడులు చేసేందుకు అమెరికా సన్నద్ధమవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఇరాన్ తమ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారింది. రాబోయే 24 గంటల్లో దౌత్యపరంగా కీలక పురోగతి లేకపోతే ఇరాన్‌పై భారీ సైనిక చర్యలకు ఆమోదం తెలిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొగ్గు చూపుతున్నారు. దాడులపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని కూడా తెలుస్తోంది. ఈ ఉద్రిక్తతల కారణంగా అమెరికా సైనిక, నిఘా వర్గాలకు చెందిన పలువురు అధికారులు తమ మెమోరియల్ డే వారాంతపు ప్రణాళికలను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. శనివారం పరిస్థితులు తీవ్రరూపం దాల్చడంతో న్యూజెర్సీలో తన వారాంతపు పర్యటనను రద్దు చేసుకున్న ట్రంప్ హుటాహుటిన వాషింగ్టన్‌కు తిరిగి వచ్చారు. ఈ సంక్షోభం తీవ్రతకు అద్దం పట్టేలా తన కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి కూడా తాను హాజరుకాలేనని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ప్రభుత్వానికి సంబంధించిన పరిస్థితుల దృష్ట్యా నేను వాషింగ్టన్‌లోనే ఉండటం ముఖ్యమని ఆయన తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇది ప్రస్తుతం నెలకొన్న గంభీర స్థితిని తెలియజేస్తోంది. గత ఏప్రిల్‌లో ట్రంప్ ప్రకటించిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఇప్పటివరకు కొనసాగినప్పటికీ, ఇరు దేశాల మధ్య చర్చలు ముందుకు సాగడం లేదు. ఇరాన్ శుద్ధి చేసిన యురేనియం నిల్వలపై నెలకొన్న ప్రతిష్టంభనే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇరాన్‌ను అణ్వాయుధం కలిగి ఉండటానికి అనుమతించబోమని, శుద్ధి చేసిన యురేనియం నిల్వలను దేశం విడిచి తరలించాలని అమెరికా పట్టుబడుతోంది. మరోవైపు తమ యురేనియం నిల్వలను విదేశాలకు తరలించే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ నేప థ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

# మేజర్ అభిలాషబార్‌కు ఐక్యరాజ్యసమితి అరుదైన గౌరవం

## మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డుకు ఎంపిక



**న్యూయార్కు, మే 23:** భారత రక్షణరంగంలో పనిచేసి యుఎన్ పీస్ కీపింగ్ ఫోర్స్ లో పనిచేసిన మేజర్ అభిలాష బరాక్‌కు అరుదైన గౌరవం దక్కింది. లెబనాన్‌లో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక మిషన్‌లో పాల్గొన్న మేజర్ అభిలాషను ప్రతిష్టాత్మక మిలిటరీ జెండర్ అడ్వకేట్ అవార్డుకు సమితి ఎంపిక చేసింది. 2025 యునైటెడ్ నేషనల్ మిలిటరీ జెండర్ అడ్వకేడ్ ఆఫ్ ద ఇయర్ అవార్డును గెలుచుకున్నట్లు యూఎన్ భారత విభాగం తెలిపింది. పశ్చిమ ఆసియా దేశా ల్లోని మహిళలు, టీనేజీ అమ్మాయిల్లో జెండర్ అంశాల్లో చైతన్యం కలిగించిన నేపథ్యంలో అభిలాషకు ఆ గుర్తింపు వచ్చినట్లు యూఎన్‌లోని ఇండియన్ పర్మినెంట్ మిషన్ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నది. లెబనాన్‌లో ఉన్న భారత బెటాలియన్‌లోని ఫిమేల్ ఎంగేజ్మెంట్ టీమ్‌కు ఆమె కమాండర్‌గా ఉన్నారు. లెబనాన్‌లోని యూఎన్ ఇంటీరియం ఫోర్స్‌లో ఆమె సేవలు అందిస్తోంది. భారతీయ ఆర్మీకి చెందిన మహిళా యుద్ధ హెలికాప్టర్ పైలట్‌గా ఆమెకు రికార్డు ఉన్నది. యూఎన్ పీస్‌కీపర్స్ అంతర్జాయతీ దినోత్సవం సందర్భంగా ఈనెల 29వ తేదీన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో జరిగే ఈవెంట్‌లో అభిలాషను అవార్డుతో సత్కరించనున్నారు. యూఎన్ పీస్‌కీపర్స్ అవార్డు అందుకున్న మూడవ భారతీయ మహిళగా ఆమె గుర్తింపు పొందారు. గతంలో మేజర్ సుమన్ గవాని, మేజర్ రాధికా సేన్ కూడా యూఎన్ పీస్‌కీపర్స్ అవార్డు గెలుచుకున్నారు.



# భారత్ పర్యాటకులకు థాయిలాండ్ వీసా ఆన్ అరైవల్

**బ్యాంకాక్, మే 23:** భారతీయ పర్యాటకులకు అత్యంత ఇష్టమైన విహారయాత్ర గమ్యస్థానాల్లో ఒకటైన థాయ్‌లాండ్, తన వీసా నిబంధనల్లో సంచలన మార్పులు చేసింది. పర్యాటకాన్ని ప్రోత్స హించేందుకు గతంలో ప్రవేశపెట్టిన 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని భారత్ సహా 93 దేశాలకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. వీసా కేటగిరీలను క్రమబద్ధీకరించి, సులభతరం చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు థాయ్‌లాండ్ ప్రభుత్వం స్పష్టం చేసింది. థాయ్‌లాండ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కాన్సులర్ అఫైర్స్ ప్రకారం ఈ నెల 19న జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ కొత్త వీసా విధానాలకు ఆమోదం లభించింది. ఒక దేశం, ఒక వీసా మినహాయింపు హక్కుఅనే కొత్త మార్గదర్శక సూత్రం ఆధారంగా ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కొత్త నిబంధనలు రాయల్ గెజిట్‌లో ప్రచురించిన 15 రోజుల తర్వాత అమల్లోకి వస్తాయి. ఈ మార్పులతో భారత పర్యాటకులకు ఇప్పటివరకు లభించిన వీసా రహిత ప్రవేశ సౌకర్యం దూరమవుతుంది. జులై 2024లో భారత్‌కు 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని థాయ్‌లాండ్ వర్తింపజేసింది. దీని ద్వారా ఎక్కువ రోజులు విహారయాత్రకు ప్లాన్ చేసుకునే వారికి థాయ్‌లాండ్ మరింత ఆకర్షణీయంగా మారింది. తాజా నిబంధనల ప్రకారం, భారతదేశాన్ని వీసా ఆన్ అరైవల్ (వీఓఏ) కేటగిరీకి మార్చారు. ఇకపై భారత పర్యాటకులు థాయ్‌లాండ్ చేరుకున్నాక అక్కడి ఇమ్మిగ్రేషన్ చెక్‌పాయింట్ల వద్ద అవసరమైన పత్రాలు సమర్పించి వీసా పొందాల్సి ఉంటుంది. ఈ కేటగిరీ కింద కేవలం 15 రోజులు మాత్రమే దేశంలో ఉండేందుకు అనుమతి లభిస్తుంది. సుదీర్ఘ సెలవులకు బదులుగా చిన్న పర్యటనలకు మాత్రమే ఇది అనుకూలంగా ఉంటుంది. మొదట పర్యాటకాన్ని, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు 60 రోజుల ఉచిత వీసా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానం వల్ల భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయని థాయ్‌లాండ్ ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యంగా అక్రమ ఉపాధి, బినామీ వ్యాపారాలు, అంత ర్జాతీయ నేరాలు పెరిగాయనే ఆరోపణలు వెల్లు వెత్తాయి. పర్యాటకుల సంఖ్య కంటే నాణ్యమైన పర్యాటకులను ఆకర్షించడంపైనే ఇప్పుడు దృష్టి సారిస్తున్నామని, ఆర్థిక ప్రయోజనాలు, దేశ భద్ర తను సమన్వయం చేయడమే తమ లక్ష్యమని థాయ్‌లాండ్ పర్యాటక, క్రీడల శాఖ మంత్రి సురసక్ ఫంచరోయెన్‌వొరాకుల్ గతంలోనే సూచనప్రాయంగా తెలిపారు. వీసా ఆన్ అరైవల్ (వీఓఏ) కేవలం 4 దేశాలకు అజర్‌బైజాన్, బెలారస్, సెర్బియా, భారత్‌లకే పరిమితం. వీరికి 15 రోజుల బసకు అనుమతి ఉంటుంది.



# లడక్‌లో కుప్పకూలిన హెలికాప్టర్

**లేహ్, మే 23:** లడఖ్ లోని లేహ్ ప్రాంతంలో శనివారం భారత ఆర్మీకి చెందిన ఒక చీతా హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక లోపం కారణంగా అది కూలిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రమాదంలో ఆర్మీ అధికారులు ముగ్గురు త్రుటిలో ప్రాణాలతో బయటపడడం విశేషం. హెలికాప్టర్ పూర్తిగా ధ్వంసమైనప్పటికీ అధికారులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృత్యుంజయుల సెల్ఫీ తీసుకుని విడుదలచేసిన వైనం అన్ని వర్గాలను ఆకర్షించింది. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ తర్వాత కూలిపోయిన హెలికాప్టర్ శిథిలాల ముందు నిలబడి అధికారులు చిరునవ్వుతో సెల్ఫీ క్లిక్‌మనిపించారు.

# తమిళనాడులో పదేళ్ల బాలిక కిడ్నాప్, హత్య

## నేరాలు పెరిగాయంటూ డిఎంకె ధ్వజం

### నిందితులను అరెస్టు చేశాం, కఠిన చర్యలు తప్పవు: సిఎం విజయ్



**కోయంబత్తూరు, మే 23:** తమిళనాడులోని కోయంబత్తూరు నగరంలోని సూలూరు ఏరియాలో కిరాణా సామాన్లు తేవడానికి వెళ్లిన పదేళ్ల బాలిక కిడ్నాప్‌కు గురైంది. ఆపై ఆ చిన్నారిని దుండగులు దారుణంగా హత్య చేశారు. చెరువు సమీపంలో మృతదేహం దొరికింది. ఈ ఘటనపై తమిళనాడు కొత్త సీఎం విజయ్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అమానవీయ చర్యలను అస్సలు సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఘోర ఘటన దిగ్భ్రాంతిని, వేదనను కలిగించింది. ఇలాంటి అమానవీయ నేరాలను సహించబోం. కుటుంబ సభ్యులకు నా సానుభూతి. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేశారు. సమగ్రంగా విచారణ జరిపి తక్షణమే చార్జ్‌షీట్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించాం. మహిళలు, పిల్లలపై ఇలాంటి ఘోరాలకు ఒడిగట్టే వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా తమిళనాడు ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుందని విజయ్ స్పందించారు. ఈ హత్య రాష్ట్రంలో పెద్ద రాజకీయ దుమారం రేపింది. కొత్త ప్రభుత్వంపై ప్రతిపక్ష డీఎంకే తీవ్ర విమర్శలు చేసింది. సీఎం విజయ్ పదవి చేపట్టిన 12 రోజుల్లోనే నేరాలు పెరిగాయని ఉదయనిధి స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. మరోవైపు గత డీఎంకే ప్రభుత్వమే వ్యవస్థను నాశనం చేసిందని బీజేపీ విమర్శించింది. ఈ కేసులో కార్తీక్, మోహన్ రాజ్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణను వేగవంతం చేయడానికి తమిళనాడు డీజీపీ స్వయంగా కోయంబత్తూర్ వెళ్లారు. సీఎం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు మృతదేహాన్ని తీసుకోబోమని కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆసుపత్రికి వెళ్లి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.



# నల్లకోటు న్యాయవాదుల్లో 40% మంది నకిలీలే!

## బార్ కౌన్సిల్ చైర్మన్ సిజెఐకి నివేదిక

**న్యూఢిల్లీ, మే 23:** దేశంలో నల్ల కోట్లు వేసుకుని కోర్టుల్లో తిరుగుతున్న న్యాయవాదుల్లో దాదాపు 35 నుంచి 40 శాతం మంది నకిలీలేనని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా సంచలన నివేదిక ఇచ్చారు. వీరంతా నకిలీ సర్టిఫికెట్లు కొనుగోలు చేసి లేదా సృష్టించి కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ నకిలీ డిగ్రీల వ్యవహారాన్ని అడ్డుకోవడానికి బీసీఐ కసరత్తు ప్రారంభించింది. అడ్వొకేట్ల డిగ్రీ సర్టిఫికెట్లను పరిశీలించే ప్రక్రియను బీసీఐ మొదలుపెట్టగా దాదాపు 40 శాతం మంది తమ వెరిఫికేషన్ ఫారాలను పూరించలేదు. ఫారాలు నింపని వీరంతా నకిలీ న్యాయవాదులేనని బీసీఐ అనుమానిస్తోంది. ఈ విషయాన్ని ఇప్పటికే భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లినట్లు మనన్ మిశ్రా వెల్లడించారు. సోషల్ మీడియాలో సంచలనంగా మారిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం వెనుక ఉన్న నేపథ్యాన్ని కూడా బీసీఐ మనన్ కుమార్ వివరించారు. గత వారం ఒక పిటిషన్‌ను విచారిస్తున్న సమయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ లాయర్ల డిగ్రీలపై అనుమానం వ్యక్తం చేశారు. నకిలీ డిగ్రీలతో కోర్టుల్లోకి వస్తున్న యువతను ఉద్దేశించే ఆయన కాక్రోచ్ వ్యాఖ్యలు చేశారని, దీనిపై సీబీఐ విచారణ కోరాలని భావిస్తున్నట్లు సీజేఐ చెప్పారని మిశ్రా స్పష్టం చేశారు.

# సంక్షిప్తంగా..

## ఇవాంకా ట్రంప్ హత్యకు కుట్ర?



**వాషింగ్టన్, మే 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెద్ద కుమార్తె ఇవాంకా ట్రంప్ హత్యకు కుట్ర జరిగినట్లు తెలుస్తోంది. ఐఆర్‌జిసితో సంబంధాలున్న ఓ ఉగ్రవాది ఈ కుట్ర పన్నినట్లు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. 2020లో ఇరాన్ అగ్రశ్రేణి కమాండర్ ఖాసీం సులేమాని హత్యకు ప్రతీ కారంగా ఆమెను హతమార్చేందుకు ఈ పథక రచన చేశాడని పేర్కొంది. కానీ, అతడు ప్లాన్ అమలు చేసేలోపే అరెస్టు అయ్యాడని తెలియజేసింది. 32 యేళ్ల మహమ్మద్ బాఖర్ సాద్ దావూద్ అల్ సాదీ కొంతకాలం క్రితం తుర్కియేలో అరెస్టు అయ్యాడు. ఆ తర్వాత అతడిని అమెరికాకు తరలించారు. అతడిని విచారించిన దర్యాప్తు అధికారులు కీలక విషయాలను గుర్తించారు. మహమ్మద్ వద్ద ఇవాంక కుటుంబం నివసిస్తోన్న ఇంటి బ్లూప్రింట్ ఉందని వెల్లడించారు. ఫ్లోరిడాలోని ఆమె నివాసం ఫొటోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లు తెలుస్తోంది.

## రోడ్లపై నమాజ్ నిషేధానికి కేంద్ర మంత్రి మద్దతు



**లక్నో, మే 23:** బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై నమాజ్ చేయడాన్ని నిషేధిస్తూ ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ శనివారం పూర్తి మద్దతు ప్రకటించారు. మత పరమైన పండుగల సమయంలో శాంతిభద్రతలను కాపాడటానికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొ న్నారు. ఈ మేరకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని ఆయన ప్రత్యేకంగా అభినం దించారు. కొందరు వ్యక్తులు కావాలనే దేశంలో వాతావరణాన్ని పాడు చేయడానికి ప్రయత్నిస్తున్నారని గిరిరాజ్ సింగ్ మండిపడ్డారు. శాంతిభద్రతల దృష్ట్యా ఇటువంటి నిబంధనలు తెచ్చిన ముఖ్య మంత్రులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## బొగ్గుగనిలో గ్యాస్ పేలుడు: 82 మంది కార్మికులు మృతి



**బీజింగ్, మే 23:** చైనాలోని ఓ బొగ్గు గనిలో గ్యాస్ పేలుడు సంభవించడంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లింది. ఉత్తర చైనా ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 82 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మంది ఆచూకీ ఇంకా లభించలేదని అక్కడి ప్రభుత్వ అధికారిక మీడియా శనివారం వెల్లడించింది. షాంక్సీ ప్రావిన్స్‌లోని లూషెన్యు బొగ్గు గనిలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. గనిలో ఒక్కసారిగా ప్రమాదకరమైన కార్బన్ మోనాక్సైడ్ గ్యాస్ లీకైంది. ఆ విషవాయువు పరిమితికి మించి వేగంగా వ్యాపించడంతో పేలుడు సంభవించింది. ప్రమాదం జరిగిన సమయంలో గని లోపల వందల సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం.

## గ్యాంగ్‌స్టర్ ఉజైర్‌బలోచ్ విందులో క్రికెటర్ ఆఫ్రిది



**కరాచి, మే 23:** పాకిస్థాన్ మాజీ క్రికెట్ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. కరాచీకి చెందిన కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్ రహమాన్‌డకైట్ సోదరుడు ఉజైర్ బలోచ్‌తో కలిసి ఆయన విందులో పాల్గొన్న పాత ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగు తోంది. ఈ ఫొటోపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఫొటో 2013లో కరాచీలో తీసినట్లు తెలుస్తోంది. ఇందులో అఫ్రిదీ, ఉజైర్ బలోచ్ మరికొందరితో కలిసి డిన్నర్ చేస్తూ కన్పిస్తున్నారు. ఉజైర్ బలోచ్ కరాచీలోని లియారీ గ్యాంగ్‌కు నాయకుడిగా పేరుగాంచాడు. హత్యలు, దోపి డీలు, బెదిరింపులు వంటి అనేక నేరారోపణలు ఎదుర్కొంటున్న అతడిని 2016లో పాక్ అధికారులు అరెస్ట్ చేశారు.

## తులసి గబ్బర్డ్ రాజీనామాకు ట్రంప్ ఆమోదం



**వాషింగ్టన్, మే 23:** అమెరికా జాతీయ నిఘా సంస్థ (డిఎన్ఐ) డైరెక్టర్, భారత సంతతి మహిళ తులసి గబార్డ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. తులసి రాజీనామాను ఆమోదించిన అధ్యక్షుడు ట్రంప్, ఆమె సేవలను ప్రశంసించారు. తులసి అద్భుతంగా పనిచేశారు, ఆమె లేని లోటు మాకు తెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రిన్సిపల్ డిప్యూటీ డైరెక్టర్ ఆరోన్ లూకాస్ తాత్కాలిక డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని వైట్‌హౌస్ ప్రకటించింది. తన భర్త అబ్రహం విలియమ్స్‌కు అరుదైన బోన్ క్యాన్సర్ సోకినందున, ఆయనకు తోడుగా ఉండేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పంపిన తన రాజీనామా లేఖను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

# ఉగ్రవాది అంత్యక్రియలకు టాప్ ఉగ్రవాదనేతలు హాజరు..

**ఇస్లామాబాద్, మే 23:** ఉగ్రవాదానికి తమ దేశం కేంద్రం కాదని పాకిస్థాన్ చెప్పే మాటలు మరో సారి నీటిమూటలయ్యాయి. ప్రపంచంలోనే మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులకు పాకిస్థాన్ సురక్షితమైన అడ్డాగా మారిందన్న ఆరోపణలకు బలం చేకూరుస్తూ, ఇస్లామాబాద్‌లోనే ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్యకు గురయిన ఓ ఉగ్రవాది అంత్యక్రియలకు అనేక మంది టాప్ టెర్రరిస్టులు బహిరంగంగా హాజరై, పాకిస్థాన్ అసలు స్వరూపాన్ని ప్రపంచానికి చూపించారు. నిషేధిత అల్‌బద్ర్ ఉగ్రవాద సంస్థకు చెందిన టాప్ కమాండర్, డాక్టర్ అనే కోడ్‌నేమ్‌తో పనిచేసిన అర్జుమంద్ గుల్జార్ దార్ అలియాస్ హంజా బుర్హాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల కాల్పుల్లో మరణించాడు. శుక్రవారం అతని మృతదేహానికి ఇస్లామాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమెరికాచే ఉగ్రవాదిగా ప్రకటించబడిన హిజ్బుల్ ముజాహిదీన్ చీఫ్ సయ్యద్ సలావుద్దీన్‌తో పాటు అల్ బద్ర్ చీఫ్ బఖ్త్ జమీన్ ఖాన్ వంటి కీలక ఉగ్రవాదులు హాజరయ్యారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా బఖ్త్ జమీన్ ఖాన్ చుట్టూ ఏకే47 వంటి ఆధునిక ఆయుధాలతో ఉగ్రవాదులు కట్టుదిట్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లా రత్నిపొరకు చెందిన బుర్హాన్, చట్టబద్ధమైన పత్రాలతో పాకిస్థాన్‌కు ప్రయాణించి అల్‌బద్ర్ సంస్థలో చేరాడు.

2019లో 40 మంది సీఆర్ పీఎఫ్ జవాన్లను పొట్టనపెట్టుకున్న పుల్వామా దాడిలో ఇతని పేరు తొలిసారిగా తెరపైకి వచ్చింది. కశ్మీర్‌లోని యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం, నియామకాలు చేపట్టడం, పాకిస్థాన్ నుంచి నిధులు సమకూర్చడంలో బుర్హాన్ కీలక పాత్ర పోషించాడని భారత భద్రతా ఏజెన్సీలు చెబుతున్నాయి. 2022లో భారత్ ఇతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది.

# త్రిసూరులో ఏనుగు భీబత్సం: అనేక వాహనాలు ధ్వంసం



**త్రిస్సూర్, మే 23:** కేరళలోని త్రిస్సూర్‌లో ఒక దేవాలయంలో జరిగే ఉత్సవం కోసం తీసుకువచ్చిన ఏనుగు కట్టడినుంచి తప్పించుకుని రెండు కిలోమీటర్లు పెరుగెత్తింది. అంతేకాకుండా అడ్డుగా ఉన్న అన్నింటిని కూల్చివేస్తూ విధ్వంసం సృష్టించింది. రెండుకిలోమీటర్లమేర పరుగులుపెట్టిన ఈ ఏనుగు వాహనాలు, ప్రహరీగోడలు, వాటి గేట్లు నివాసిత ప్రాంతాల్లో ఆస్తులను కూడా ధ్వంసంచేసింది. ఆలయవేడుకల కోసం శివమ్ లక్ష్మీ అయ్యప్పన్ అనే ఏనుగును కొల్లంనుంచి తీసుకునివచ్చారు. ఉదయం వేడుకలకు ముందే 9.15 గంటలకు చెంబుక్కావు టౌన్‌హాల్‌ప్రాంతంలో ఏనుగు భీభత్సం సృష్టించింది. ప్రతిరోజులాగా ఉదయం ఏనుగును స్నానంచేసేందుకు ఉపక్రమిస్తుండగా మావటిలనుంచి తప్పించుకుని ఒక్కసారిగా ఆవేశపూరితంగా మారింది. అక్కడినుంచి పరారవుతూ పార్కింగ్‌చేసి ఉన్న కార్లు, ఆటోరిక్షాలు, మోటారు సైకిళ్లను ధ్వంసంచేసి వాటిని తిరగబెడుతూ వెళ్లింది. చెంబుక్కావు పోస్టాఫీసు ఆవరణలో కూడా విధ్వంసం సృష్టించింది. చేవూరు గాంధీనగర్ హౌసింగ్ కాలనీలో కూడా ప్రవేశించి నివాసితులను భయభ్రాంతులకు గురిచేసింది. ఎవ్వరికీ ప్రాణాపాయం లేనప్పటికీ ఏనుగు భారీ విధ్వంసం సృష్టించిందని, ఆస్తినష్టం రిగిందని అధికారులు చెపుతున్నారు. సంగీత అనే ఒక మహిళతోపాటు కారులోప్రయాణిస్తున్న ఒక బాలికకు కూడా ఏనుగుదాడిలో గాయాలయ్యాయి. పోలీసులు, అటవీ అధికారులు, ఏనుగును కట్టడిచేసే స్క్వాడ్ బృందసభ్యులు, స్థానిక అధికారులు స్పాట్‌కువెళ్లి సుదీర్ఘ కసరత్తులు తర్వాత ఏనుగును తమ అధీనంలోకి తీసుకున్నారు. కాళ్లకు చైన్లు వేయడంద్వారా ఏనుగు ఆవేశాన్ని కట్టడిచేసారు.

# 27 కాదు,, 28న బక్రీద్

## తెలుగు రాష్ట్రాల్లో మారిన పండుగ తేదీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే23:** తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు. తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28(గురువారం) నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్‌హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్లు మతపెద్దలు ప్రకటించారు. మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ 1881 ప్రకారం మే 28న సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు.. మే 28న సెలవు ఉంటుందని ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది.

## డల్లాస్ టెక్నాలజీ సెంటర్‌కు అదనపు స్థలం కేటాయింపు

**విజయవాడ 23 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నం జిల్లా మధురవాడ హిల్ నం-2 లోని నాన్ ఐటీ సెజ్ పరిధిలో డల్లాస్ టెక్నాలజీ సెంటర్‌కు అదనంగా కేటాయించిన 227088 చదరపు మీటర్ల స్థలాన్ని స్వాధీనం చేయడానికి ఏపీఐఐసీకి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ వీసీఎండీ, విశాఖజిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా విశాఖపట్నం ఐటీ హిల్ నం-2 లో నిర్మించిన సుమారు 2.15 లక్షల చదరపు అడుగుల ఐటీ స్పేస్ వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలో రూ.74.79 కోట్ల పెట్టుబడితో రోజుకు 60000 లీటర్ల సామర్థ్యం గల ఐస్ క్రీమ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు హాంగ్యో ఐస్‌క్రీమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎర్లీబర్డ్ నిబంధన కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా యడ్లపాడు మండలంలో రూ.51.65 కోట్లతో ఐటీసీ లిమిటెడ్ ఏర్పాటు చేస్తున్న స్పైసెస్ ప్రాసెసింగ్ ప్లాంటుకు ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది. కాకినాడలో రూ.171.52 కోట్లతో ఏఏకే సౌత్ ఈస్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తోన్న ఎడిబుల్ ఆయిల్స్, ఫ్యాట్స్ తయారీ యూనిట్‌కు ప్రోత్సహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదించింది. ఎర్లీబర్డ్ స్కీం కింద స్థాపనకు అనుమతి పొందే కాలపరిమితిని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఏపీ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 ను ప్రభుత్వం సవరించింది.



# టిటిడికి రూ.30 లక్షలు విరాళం

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు శనివారం 30 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన కోరా సౌమ్య 10,00,116, బిరుదాల సతీష్ కుమార్ రెడ్డి 10,00,116, పూరాబ్ సాయి 10 లక్షలు రూపాయలు ట్రస్టుకు అందజేశారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరికి విరాళం డీడీ, చెక్కులను అందజేశారు.

## కోర్టుల్లో ఎలక్ట్రానిక్ ప్రాసెస్ వినియోగానికి నిబంధనలు ఖరారు

**విజయవాడ మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో 2024 జులైలో అమల్లోకి వచ్చిన మూడు నూతన చట్టాలకు అనుగుణంగా న్యాయస్థానాల విచారణ ప్రక్రయలో సాంకేతికతను వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఎలక్ట్రానిక్ ప్రాసెస్సెస్ రూల్స్-2025ని నోటిఫై చేసింది . హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం దీనిపై జీవో జారీచేశారు.తద్వారా సమన్లు, వారంట్లు, వాటి అమలుకు సాంకేతికతను వినియోగించి ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఆదేశాలు జారీచేయొచ్చు. కోర్టు ద్వారా సమన్లు అందజేయడం సాధ్యంకాని పక్షంలో పోలీసులు సిబ్బందితో సదరు వ్యక్తి అధికారిక మెయిల్‌కు, ఇతర విధానాల ద్వారా డిజిటల్ సమన్లు పంపొచ్చు.

# విజయవాడలో 25న ఎంఎస్ఎంఇ గ్రోత్ సమ్మిట్ - 2026

### - రాష్ట్రంలో 38 ఎంఎస్ఎంఇ పార్కులకు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ,మే 23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో ఈ నెల 25 తేదీనఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026 నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు హాజరై రాష్ట్రంలో 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎంఎస్ఎంఈల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ సహా పలువురు మంత్రులు పారిశ్రామిక వేత్తలు సదస్సు లో పాల్గొననున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఎంఎస్ఎంఈ రంగానికి చెందిన పారిశ్రామికవేత్తలు, పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు, విధానకర్తలు, ఆర్థిక సంస్థలు సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ నియోజక వర్గంలో 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసే లక్ష్యం లో భాగంగా మూడో విడతలో ఈ 38 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్ గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే మొదటి రెండు దశల్లో 100 పారిశ్రామిక పార్కులకు శంకు స్థాపన తో పాటు కొన్ని ప్రారంభం అయ్యాయి. వీటిలో 761 యూనిట్లకు కేటాయింపులు జరిగాయి. ఈ పారిశ్రామిక యూనిట్ల ద్వారా రూ.1479 కోట్ల మేర పెట్టుబడులు వచ్చాయి. దాదాపు 24 వేల మంది కి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో గ్రామీణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను సీఎం ప్రారంభించనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు నిధులను కూడా ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమ్మిట్ లో యువతకు, మహిళలకు అవగాహన కల్పించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చేలా, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ప్రణాళిక చేసిన ఈ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026ఖి రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో గ్రామీణ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా రూట్యాగ్ స్మార్ట్ విలేజ్ సెంటర్ ఎక్స్‌టెన్షన్ కేంద్రాలను సీఎం ప్రారంభించనున్నారు. రూ.200 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 45 పారిశ్రామిక క్లస్టర్లలో ఉమ్మడి సౌకర్యాల కేంద్రాల ఏర్పాటుకు నిధులను కూడా ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు. ఈ సమ్మిట్ లో యువతకు, మహిళలకు అవగాహన కల్పించే అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చేలా, అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ప్రణాళిక చేసిన ఈ ఎంఎస్ఎంఈ గ్రోత్ సమిట్ 2026ఖి రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ఒక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది.ప్రతి ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి లక్ష్యం మేరకు ఎంఎస్ఎంఈ పని చేస్తుందని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన విజయవాడ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళావేదికల ఓజరిగే ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ కార్యక్రమ ఏర్పాట్లను శనివారం మంత్రి పలు శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ ద్వారా ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలోనే సోమవారం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రోత్ సమ్మిట్‌ను అన్ని శాఖల అధికారులు విజయవంతం చేయాలని మంత్రి సూచించారు. ఎంఎస్ఎంఈ ఔత్సాహికులకు ఈ కార్యక్రమంలో ఎలా సమీకృతం చేస్తూ ముందుకు తీసుకువెళ్లాలనే అంశంపై మంత్రి చర్చించారు. గ్రోత్ సమ్మిట్ విషయంలో తీసుకోవాల్సి పలు జాగ్రత్తలను మంత్రి అధికారులకు సూచించారు. ట్రాఫిక్, పార్కింగ్, సీఎం షెడ్యూల్ గురించి సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ పరిశ్రమల శాఖ సెక్రటరీ డాక్టర్ యువరాజ్, వీసీ ఎండీ ఏపీఐఐసీ దినేష్‌కుమార్, ఏపీఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ, విజయవాడ ఆర్డీవో, ఐ పీఆర్ శాఖ, పోలీస్ శాఖ నుంచి ఏడీసీపీ మురళీకృష్ణ , డీఎస్పీ మానస, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# భగ్గుమన్న రాజకీయ కక్షలు

**సూర్యాపేట మండలం యర్కారంలో బిఆర్ఎస్ నేత మధు దారుణ హత్య**

**గోనెసంచిలో కట్టి కల్వర్టు వద్ద పడేసిన మృతదేహం**

**ఓ హత్య కేసులో కీలక సాక్షిగా మధు**



చింతలపాటి మధు (ఫైల్)

**సూర్యాపేట బ్యూరో, ప్రభాతవార్త :** సూర్యాపేట మండలం యర్కారంలో మరోసారి రాజకీయ కక్షలు భగ్గుమన్నాయి. బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, యర్కారం మాజీ సర్పంచ్ మోనిక భర్త చింతలపాటి మధు (42) దారుణ హత్యకు గురికావడం జిల్లాలో సంచలనంగా మారింది. పాత ఫ్యాక్షన్ విభేదాలు, రాజకీయ కక్షలే ఈ హత్యకు కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో మధు సూర్యాపేటలోని తన నివాసం నుంచి పని నిమిత్తం బయటకు వెళ్లాడు. అనంతరం అతను ఫోన్ ఎత్తకపోవడంతో భార్య మోనిక పలుమార్లు సంప్రదించే ప్రయత్నం చేసింది. ఫోన్ అందుబాటులో లేకపోవడంతో ఆమె రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా, ఘటన పట్టణ పరిధికి సంబంధించినదిగా భావించిన పోలీసులు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.మోనిక టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో వారు వెంటనే రంగంలోకి దిగి ఫోన్ సిగ్నల్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ఇదిలా ఉండగా మధు శుక్రవారం సాయంత్రం వరకు పార్టీ కార్యాలయం వద్ద ఉన్నట్లు సమాచారం. అనంతరం సాయంత్రం 6:00 గంటల సమయంలో అతని స్నేహితుడు చింతా సైదులు ఫోన్‌చేసి తాళ్లగడ్డలో తాటిపాముల జానయ్య ఇంటికి రావాలని, కలిసి మద్యం సేవిద్దామని పిలిచినట్లు తెలిసింది. దీంతో మధు అక్కడికి వెళ్లగా, ఇద్దరూ కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. కొద్దిసేపటి తర్వాత అక్కడికి చేరుకున్న ప్రత్యర్థులు పదునైన ఆయుధాలతో మధుపై కిరాతకంగా దాడిచేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య అనంతరం మృతదేహాన్ని గోనె సంచిలో కట్టి సూర్యాపేట-జనగాం రోడ్డులో యర్కారం గ్రామ శివారులోని కల్వర్ట్ వద్ద పడేసినట్లు గుర్తించారు. శనివారం అర్ధరాత్రి తర్వాత పోలీసులు గాలింపు చర్యల్లో భాగంగా కల్వర్ట్ సమీపంలో గోనె సంచిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. శనివారం రాత్రి రెండు గంటల సమయంలో పోలీసులు మధు భార్య మోనికకు సమాచారం అందించి సంఘటనా స్థలానికి తీసుకెళ్లారు. అక్కడ మృతదేహాన్ని చూసిన మోనిక అది తన భర్త మధుదేనని గుర్తించింది. అనంతరం పోలీసులు మృతదేహాన్ని సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. మార్చురీలో ఉన్న మధు మృతదేహాన్ని జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహ, మాజీమంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకల్ల జగదీశ్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున సందర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. మృతుడు మధు గతంలో చనిపోయిన ఒంటెద్దు వెంకన్న హత్య కేసులో ప్రధాన సాక్షిగా ఉన్నాడు.

### మధు హత్య కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం

### మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

చింతలపాటి మధు హత్య ఘటనపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మధు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లా డారు. మధు హత్య పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమని, ఈ ఘటనలో పోలీసుల పాత్రపై కూడా అనుమానాలు ఉన్నాయని ఆరో పించారు.

### మధు హత్య కేసును సీరియస్‌గా తీసుకున్నాం : జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట మండలం ఎర్కారం గ్రామానికి చెందిన చింతలపాటి మధు మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో జిల్లా ఎస్పీ కె. నరసింహ సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మధు కనిపించడం లేదని ఆయన భార్య మోనిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెంటనే కేసు నమోదు చేసి డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామని తెలిపారు.యల్కారం స్టేజి సమీపంలోని కల్వర్టు కింద గోనెసంచిలో మృతదేహాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులతో ధృవీకరించిన అనంతరం హత్య కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు. ఈ కేసును అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఇప్పటికే ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

# తెలంగాణ యాదగిరిగుట్ట అభివృద్ధికి రూ. 100 కోట్లు

### వేద పాఠశాల, దీక్షాపాల మండపం నిర్మాణాలకు శ్రీకారం

### కంచి కామకోటి పీఠాధిపతి సమక్షంలో వైభవంగా పూజలు

### హైఅలర్ట్, భారీ పోలీస్ బందోబస్తు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, యాదగిరిగుట్ట, మే 23 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో అట్టహాసంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వేద పాఠశాల, దీక్షాపాల మండపం, వాయువ్య దిశలో షెడ్లు, మెట్ల మార్గం పైకప్పు నిర్మాణం తదితర పనులకు సంబంధించి జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వైభవం, అధికారిక హంగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సిఎం రాక నేపథ్యంలో యాదగిరిగుట్ట మొత్తం ఉదయం నుంచే పోలీస్ ఆధీనంలోకి వెళ్లింది. ఉదయం 6.30 గంటల నుంచే భారీ సంఖ్యలో భద్రతా సిబ్బంది వైకుంఠద్వారం, పాత బస్టాండ్, తులసి కాటేజీ, కొండపైన టెంపుల్‌సిటీ, కొత్త బస్టాండ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాలను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే యాదగిరి గుట్టలో హైఅలర్ట్ ప్రకటించి ప్రతి వాహనం, ప్రతివ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఎం హెలి కాప్టర్ కొండపై హెలిప్యాడ్ వద్ద దిగుతారని భావించిన అధికారులు, భద్రతా సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి నేరుగా టెంపుల్‌సిటీకి చేరుకోవడంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. కొండపై ఉన్న అధికారులు హుటాహుటిన టెంపుల్ సిటీకి చేరుకుని సిఎంకు ఘనస్వాగతం పలికారు. కొద్దిసేపు హెలిపాడ్ వద్దనే నిరీక్షించిన సిఎం అనంతరం భూమిపూజ జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. భూమిపూజ కార్యక్రమం కోసం దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. 200 మంది కూర్చునేలా భారీ షెడ్డును నిర్మించి, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయ కులు, భక్తులు, సామాన్య ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, కూర్చునే సదుపాయాలు, వైద్యసహాయం తదితర ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచే వేదపండితులు చతుర్వేద పారాయణాలతో ఆధ్యాత్మిక వాతా వరణాన్ని సృష్టించారు. వేదఘోషల మధ్య సిఎం రేవంత్‌రెడ్డి కార్య క్రమ ప్రాంగణానికి చేరుకోగా భక్తులు, ప్రజాప్రతినిధులు హర్షధ్వా నాలతో స్వాగతం పలికారు. ఉదయం 9 గంటల 37 నిమిషాలకు కర్కాటక లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపిలు వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిఎంఒ కార్యదర్శి శ్రీనివాసరాజు, దేవదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ కమిషనర్ ఎం.హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్‌యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఉన్నతాధి కారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. భూమిపూజ కార్యక్రమానికి విజయేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యేకంగా హాజరై వేదమంత్రో చ్ఛారణల నడుమ పూజలు నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన 200 మంది విద్యార్థులు వేదపారా యణాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను తీసుకు వచ్చారు. గణపతి పూజ, కలశ స్థాపన, శంకుస్థాపన, నవగ్రహ పూజలు మంగళవాయిద్యాల నడుమ గంటన్నరపాటు వైభవం గా సాగాయి. సిఎం రాకకు ముందుగానే భూమిపూజ జరిగే ప్రాంతంలో రెండు అడుగుల లోతువరకు తవ్వకాలు పూర్తిచేసి పూజాకార్యక్రమాలకు సిద్ధం చేశారు. అనంతరం చేపట్టనున్న నాలుగు ప్రధాన నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక శిలాఫలకాలను ఏర్పాటుచేశారు.



శనివారం యాదగిరిగుట్టలో వేదపాఠశాలకు శంకుస్థాపన దృశ్యం, చిత్రంలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతీస్వామి, తెలంగాణ సిఎం రేవంత్, మంత్రులు కోమటిరెడ్డి, కొండా సురేఖ

వాటికి విజయేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా తిలకందిద్ది ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సిఎం రేవంత్‌రెడ్డి ఆలయ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు సమాచారం. యాదగిరిగుట్టను దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని అధికారులు పేర్కొన్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలుచేయడంతో కొంతసేపు భక్తులకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, పోలీస్ శాఖ సమన్వయంతో పరిస్థితిని అదుపులో ఉంచింది.

మొత్తం కార్యక్రమం ఆధ్యాత్మిక, రాజకీయ, అధికారిక హంగులతో ఘనంగా ముగిసింది.

# యాదాద్రిలో హెలిపాడ్ గందరగోళంతో అధికార యంత్రాంగం పరుగులు

### కొండ కింద వేచిచూసిన అధికారులు

### గుట్టపై దిగిన సిఎం హెలికాప్టర్

**యాదాద్రి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న సమన్వయలోపం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటన కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినప్పటికీ, హెలిపాడ్ విషయంలో స్పష్టమైన సమాచారం అధికారులకు అందకపోవడంతో యాదాద్రిలో కొంతసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఎక్కడ దిగుతుందనే విషయంలో చివరి నిమిషంలో ఏర్పడిన గందరగోళం అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిం చింది. ముందస్తు ఏర్పాట్లు భారీగా.. సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం రెండు రోజుల ముందుగానే విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కొండ కింద ఉన్న హెలిపాడ్ వద్ద భద్రతా తనిఖీలు నిర్వహించి, సీఎం కాన్వాయ్ కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో వందలాది మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఆర్టీసీ, విద్యుత్, వైద్య శాఖల అధికారులు అప్రమత్తంగా విధుల్లో నిమగ్నమయ్యారు. సీఎం రాక సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికార పార్టీ నాయకులు కూడా కొండ కింద హెలిపాడ్ వద్దకు చేరుకుని స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం సీఎం హెలికాప్టర్ అక్కడ దిగుతుందని అందరికీ సమాచారం అందడంతో అన్ని ఏర్పాట్లు అదే కేంద్రంగా జరిగాయి.

**ఒక్కసారిగా మారిన పరిస్థితి..**

అయితే నిర్ణీత సమయానికి యాదాద్రికి చేరుకున్న సీఎం హెలికాప్టర్ కొండ కింద కాకుండా టెంపుల్ సిటీపై ఉన్న హెలిపాడ్ వైపు మళ్లింది. కొద్దిసేపటికే అక్కడ ల్యాండ్ కావడంతో అధికారులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సీఎం హెలికాప్టర్ దిశ మారిందనే సమాచారం మొదట భద్రతా సిబ్బందికి కూడా స్పష్టంగా అందలేదని తెలిసింది. హెలికాప్టర్ పైభాగంలో దిగిందన్న విషయం తెలిసిన వెంటనే కొండ కింద ఉన్న అధికారులు పరస్పరం ఫోన్లు చేసుకుంటూ అసలు పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశారు. కొంతసేపు సీఎం ఎక్కడ దిగారు..? అన్న సందిగ్ధ పరిస్థితి నెలకొంది. కొందరు అధికారులు హెలికాప్టర్ తిరిగి కిందకు వస్తుందని భావించగా, మరికొందరు పైభాగానికి వెళ్లేందుకు హుటాహుటిన ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

**హెలికాప్టర్‌లోనే సిఎం వేచి..**

టెంపుల్ సిటీ హెలిపాడ్ వద్ద సీఎంకు స్వాగతం పలికేందుకు ఎవరూ సిద్ధంగా లేకపోవడం పరిస్థితిని మరింత ఇబ్బందికరంగా మార్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన వెంట వచ్చిన మంత్రులు, ఉన్నతాధికారులు దాదాపు పది నిమిషాలకు పైగా హెలికాప్టర్‌లోనే వేచి ఉండాల్సి వచ్చినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న వెంటనే అధికారులు టెంపుల్ సిటీ వైపు పరుగులు తీశారు. కొండ కింద ఉన్న కాన్వాయ్ వాహనాలు, భద్రతా బలగాలు వేగంగా పైభాగానికి చేరుకున్నాయి. తర్వాత సీఎంకు అధికారిక స్వాగతం పలికి ఆలయ కార్యక్రమాలను ప్రారంభించారు.

# ఓటర్లను అక్రమంగా తొలగిస్తే అడ్డుకొంటాం

### కేబినెట్ విస్తరణలో నా జోక్యం ఉండదు

### సిఎంతో నేను కలిసి పనిచేయడం కొందరికి ఇష్టం లేదు

### మీడియాతో 'ఇష్టాగోష్టి'లో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో ఓటర్లను అక్రమంగా తొల గించడానికి ఏదైనా కుట్రలు చేస్తే అడ్డు కొంటామని ప్రతి వయోజనుడికి ఓటు హక్కును కలిగి ఉండేలా చూసేందుకు కాంగ్రెస్ కార్యకర్తను క్షేత్రస్థాయిలో అప్రమత్తతో ఉంటారని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ అన్నారు.

గాంధీభవన్‌లో శని వారం విలేఖరులతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లా డుతూ పశ్చిమ బెంగాల్‌లో 31లక్షల ఓట్లు చేర్చి 93 లక్షల ఓట్లు తొలగించారనీ ఇటీవల ఆ రాష్ట్రంలో 30లక్షల ఓట్ల తేడాతో మమతబెనర్జీ పార్టీ ఓడిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికే దిక్సూచిగా మారుతుందనీ బిఆర్ఎస్‌కు దూరదృష్టి లేదనీ ఆరోపించారు.

హైదరాబాద్ పరిధిని పెంచ లేదు సీటీ విస్తరిస్తే అభివృద్ధి జరుగుతుందనీ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి అవసరం లేదని హరీశ్‌రావు అంటున్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణపై కేంద్రం సవితితల్లి ప్రేమ చూపి స్తోందనీ స్టాలిన్ లాగే మేము గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ల పేర్లను ఎఐసిసికి పంపించాం త్వరలోనే వర్కింగ్ ప్రెసిడెంట్లను ప్రకటిస్తామని తెలిపారు. కేబినెట్ విస్తరణ సీఎం చూసుకుం టారని విస్తరణలో నా జోక్యం ఏముండదనీ తెలిపారు. పిసిసి అధ్యక్షుడి మార్పు విషయంలో అధిష్ఠానానిదే తుది నిర్ణయం నేను సరైన వ్యక్తిని అనే నాకు పదవి ఇచ్చారనీ తెలి పారు. ఎఐసిసి దృష్టిలో నేను బెస్ట్, కెసి వేణుగోపాల్ నన్ను అనేకసార్లు అభినందిం చారని గుర్తించారు. నేను, సిఎం కలిసి పనిచేయడం కొందరికి మింగు డుపడడం లేదనీ ఆయన ఆవేదన చెందారు. నా పనితీరుని బేరీజు వేయాల్సింది మా ముఖ్య మంత్రి, నా కార్యకర్తలు అని అన్నారు.

## చంచల్‌గూడ జైలుకు డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబికి పట్టుబడ్డ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (అర్బన్ లాండ్ సీలింగ్) మర్రి వంశీమోహన్‌ను శనివారం ఉదయం రిమాండుకు తరలించారు. శుక్రవారం నాడు వంశీమోహన్ ను అక్రమాస్తుల కేసులో ఎసిబి అరెస్టు చేయడం తెలిసిందే. రాత్రి బాగా పొద్దుపోయే వరకు కొనసాగిన సోదాల్లో ఆరు కోట్ల 22 లక్షల రూపా యలకు పైగా ఆస్తులు వెలుగు చూడడం విదితమే. బహిరంగ మార్కెట్లో దీని విలువ 200 కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో శనివారం ఉదయం వంశీమోహన్‌ను ఎసిబి అధికారులు నాంపల్లి ఎసిబి కోర్టుల న్యాయమూర్తి ఇంట్లో హాజరు పర చగా నిందితుడికి రెండు వారాల రిమాండు విధించారు.

# 28 నుండి చర్లపల్లి-తిరుపతి మధ్య కొత్త ఎక్స్‌ప్రెస్ రైలు

### రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన దక్షిణ మధ్యరైల్వే

**హైదరాబాద్ మే 23, ప్రభాతవార్త :** హైదరాబాద్ నుంచి తిరుమల శ్రీవెంకటేశ్వ రస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. చర్లపల్లి-తిరుపతి మధ్య రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును కొత్తగా ప్రారంభిస్తున్నట్లు దక్షి ణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కొత్త రైలు నల్గొండ-కడప మార్గంలో ప్రయాణిస్తుందని తెలిపింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారికి తిరుపతి చేరుకోవడం సులభమ వుతుంది. ఇప్పటివరకు హైదరాబాద్ నుంచి తిరుపతికి పద్మావతి ఎక్స్‌ప్రెస్ వరంగల్-విజయవాడ మార్గంలో, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మహబూబ్‌నగర్-గుత్తి మార్గంలో, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, వందే భారత్ రైళ్లు నల్గొండ-గుంటూరు మార్గంలో నడుస్తున్నాయి. ఇప్పుడు ప్రవేశపెట్టిన కొత్తరైలు ప్రత్యామ్నాయ మార్గంలో అందుబాటులోకి రానుండటం గమనార్హం. ఈ సర్వీస్ ఈ నెల 28న ప్రారంభం కా నుంది. ఇప్పటివరకు చర్లపల్లి-తిరుపతి మార్గంలో ప్రత్యేక రైలుగా నడిచిన సర్వీసును ఇకనుంచి రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా కొన సాగిస్తారు. తిరుపతి నుంచి గురువారం సాయంత్రం నాలుగున్నర గంటలకు బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, నంద్యాల, గిద్ద లూరు, మార్కాపురం రోడ్, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా మరుసటిరోజు ఉదయం 8.25 గంటలకు చర్లపల్లికి చేరుకుం టుంది.

# వినేశ్ కుస్తీకి గ్రీన్ సిగ్నల్

## ఢిల్లీ హైకోర్టులో ఊరట



**న్యూఢిల్లీ:** భారత రెజ్లింగ్ సమాఖ్యతో కుస్తీపట్లలో వినేశ్ ఫోగట్ విజయం సాధించింది. ఢిల్లీ హైకోర్టులో ఆమెకు ఊరట లభించింది. ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు న్యాయస్థానం రూట్ క్లియర్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్.. వినేశ్‌ను ఆసియా క్రీడల ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించింది. కుస్తీ గోదాలోకి తిరిగి రీఎంట్రీ ఇవ్వాలనుకున్న వినేశ్ ఫోగట్... యూపీలోని గోండాలో జరిగిన జాతీయ ఓపెన్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు రెడీ అయింది. పోటీల కోసం యూపీకి సైతం వెళ్లింది. అయితే రెజ్లింగ్ సమాఖ్య వినేష్‌ను అడ్డుకుంది. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్లో డిస్‌క్వాలిఫై అయిన వినేష్... రెజ్లింగ్ సమాఖ్య విధివిధానాలను పాటించలేదని నేపాన్ని నెగ్గి ఆమెపై వేటు వేసింది. దీని వెనక రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్ ఉన్నాడని ఆరోపించిన వినేశ్‌కు మద్దతుగా పలువురు మాజీ రెజ్లర్లు నిలిచారు.

**రెజ్లింగ్ సమాఖ్యకు చెంపదెబ్బ**

రెజ్లింగ్ సమాఖ్య తీరుపై ఢిల్లీ హైకోర్టును వినేశ్ ఫోగట్ ఆశ్రయించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాలతో కూడిన ద్విసభ్య బెంచ్ ముందు వాదనలు జరిగాయి. తల్లైన రెజ్లర్ల విషయంలో డబ్ల్యూఎఫ్ఐ నిబంధనలు అనుచితంగా ఉన్నాయని పేర్కొన్న ధర్మాసనం వినేశ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ తీర్పునిచ్చింది. ఎంపిక ప్రక్రియను వీడియో రికార్డు చేయాలని రెజ్లింగ్ సమాఖ్యను కోర్టు ఆదేశించింది. భారత స్పోర్ట్స్ అథారిటీ, భారత ఒలంపిక్ సంఘానికి చెందిన స్వతంత్ర ప్రతినిధులు ట్రయల్స్‌ను పర్యవేక్షించాలని పేర్కొంది. మే 30, 31 తేదీల్లో ఆసియా క్రీడల సెలెక్షన్ ట్రయల్స్ జరుగనున్నాయి. ఆసియా క్రీడలతో పునరాగమనం చేయాలనుకున్న వినేశ్ ఫోగాట్ కల నిజమవ్వనుంది.

**ఫోగట్ కుస్తీమే సవాల్**

మహిళా రెజ్లింగ్‌కు పేరు తెచ్చిన వినేశ్ ఫోగట్...రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ మెడలిస్ట్. ఆసియా క్రీడల్లో స్వర్ణం, సిల్వర్ మెడల్స్.. కామన్‌వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు, ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో మెడల్స్‌తో మెరిశారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఏకంగా ఫైనల్ చేరింది. అయితే ఫైనల్‌కు ముందు నిర్వహించిన వెయిట్‌లో వంద గ్రాములు ఎక్కువగా ఉందని వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. దీన్ని ఛాలెంజ్ చేసిన ఫోగట్... అదే ఏడాది అగస్టులో రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి 2024లో హర్యానాలోని జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో డబ్ల్యూఎఫ్ఐ అప్పటి అధ్యక్షుడు భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళారెజర్లకు మద్దతుగా ఫోగట్ నిలిచింది.

# పంజాబ్ నెగ్గింది.. రాయల్స్ ఓడితేనే ఛాన్స్?

లక్నో: తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జోరు చూపింది. లక్నో సూపర్ జెయింట్స్‌ను దాని సొంతగడ్డపై ఏడు వికెట్ల తేడాతో ఓడించింది. ఈ విజయంతో పంజాబ్ పాయింట్ల సంఖ్య 15కు చేరింది. అయినా ప్లే ఆఫ్ బెర్త్ కోసం రాజస్థాన్-ముంబై మ్యాచ్ ఫలితం కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి. రాజస్థాన్ రాయల్స్ గెలిస్తే మాత్రం పంజాబ్ ప్లే ఆఫ్‌కు ముందే నిష్క్రమిస్తుంది.

197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్‌ను ఆరంభంలోనే షమీ బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే ప్రియాన్ష్ ఆర్యను డకౌట్‌గా, రెండో ఓవర్లో కూపర్ కొన్నోలీ(18)ని క్లీన బౌల్డ్‌గా అవుట్‌చేశాడు. 22 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన పంజాబ్‌ను మరో ఓపెనర్ ప్రభ్ సిమ్రాన్ సింగ్(39 బంతుల్లో 69; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(51 బంతుల్లో 101 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్స్‌లు) గెలుపు దిశగా నడిపించాడు. ఇద్దరూ లక్నో బౌలర్లపై విరుచుకు పడుతూ మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు. ప్రభు సిమ్రాన్‌ను అర్జున్ అవుట్ చేయగా, శ్రేయాస్ చివరి వరకు క్రీజ్ లో నిలిచాడు. దీంతో పంజాబ్ 18 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి గెలుపందుకుంది.



అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన లక్నోకు పవర్‌ప్లేలోనే పంజాబ్ బౌలర్లు గట్టి షాక్ ఇచ్చారు. తొలి మ్యాచ్ ఆడుతున్న అర్షిన్ కులకర్ణి డకౌట్ కాగా, నికోలస్ పూరన్(2) మరోసారి నిరాశపరిచాడు. దీంతో 20 రన్స్‌కే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. కష్టాల్లో ఉన్న జట్టును ఆయుష్ బదోనీ తన మెరుపు బ్యాటింగ్‌తో ఆదుకున్నాడు. ముఖ్యంగా మార్కో జాన్సెన్ వేసిన పవర్‌ప్లే ఆఖరి ఓవర్లో 4, 6, 6, 2, 4 లతో ఏకంగా 24 పరుగులు సాధించాడు. కేవలం 18 బంతుల్లోనే 43 రన్స్ చేసిన బదోనీని చాహల్ కంగుతినిపించాడు. మరో ఎండ్‌లో ఓపెనర్ జోస్ ఇంగ్లిస్ పంజాబ్ బౌలర్లను వణికించాడు. నలు మూలలా షాట్లు ఆడుతూ కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మొత్తంగా 44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులతో 72 పరుగులు చేశాడు. చివర్లో వచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ అబ్దుల్ సమద్ బౌండరీలతో విరుచుకుపడటంతో లక్నో 20 ఓవర్లలో 196 రన్స్ చేసింది.

# వైభవ్‌పైనే ఫోకస్

## నాలుగో బెర్త్ కోసం ముంబైతో రాజస్థాన్ కీలక పోరు



*ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నేడు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. వాంఖడే స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ తలపడనుండగా.. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే రెండో మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ పోటీ పడతాయి. ప్లే ఆఫ్‌లోని నాలుగో బెర్త్ ఎవరిదిన్నది ఈ మ్యాచ్‌లు తేల్చనున్నాయి. రాజస్థాన్, ముంబై మ్యాచ్‌తో ఇది తేలనుంది. దీంతో ఈ మ్యాచ్ తీవ్ర ఆసక్తి రేపుతున్నా... అందరి చూపు 15 ఏళ్ల కుర్రాడి పైనే.*

**ముంబై:** రాజస్థాన్ రాయల్స్ నాలుగో బెర్త్ అందుకుంటుందా? లేదా? అన్నది ముంబై ఇండియన్స్ తేల్చనుంది. ఇప్పటికే టోర్నీ నుంచి నిష్క్రమించిన ముంబై... సొంతగడ్డపై రాజస్థాన్‌రాయల్స్‌తో తలపడనుంది. ఈమ్యాచ్ గెలుపు ఓటములు ముంబైకు నామమాత్రమే. అదే రాజస్థాన్‌కు వస్తే ఈ మ్యాచ్‌లో గెలిస్తే 16 పాయింట్లతో నాలుగో జట్టుగా ముందంజ వేస్తుంది. లేదంటే కోల్‌కతా నైట్‌రైడర్స్-ఢిల్లీ మ్యాచ్ డిసైడ్ చేస్తుంది.

ఐపీఎల్ మొదటి దశ లీగ్ స్టేజ్‌లో చక్కని విజయాలు అందుకున్న రాజస్థాన్ రాయల్స్ వరుసగా హ్యాట్రిక్ ఓటములతో ప్లే ఆఫ్ అవకాశాలను క్లిష్టం చేసుకుంది. తప్పక గెలవాల్సిన లక్నోను ఓడించి రేసులో నిలిచింది. లక్నో ఉంచిన 220 పరుగుల భారీ లక్ష్యాన్ని కూడా రాజస్థాన్ అలవోకగా ఛేధించింది. ఈ క్రెడిట్ వైభవ్ సూర్యవంశీకే దక్కుతుంది. దీంతో మరోసారి వైభవ్ గెలిపిస్తాడన్న ధీమా రాజస్థాన్ ఫ్యాన్స్‌లో ఉంది.

రాజస్థాన్ బ్యాటింగ్‌కు ప్రధాన బలం ఓపెనర్లు యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీలే. వీరు క్రీజ్‌లో ఓ పది ఓవర్లు ఉన్నా రాయల్స్‌కు తిరుగుండదు. గత మ్యాచ్‌లో స్వభావానికి భిన్నంగా వైభవ్ క్రీజ్‌లో నిలిచేందుకు ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ ఆలోచన దొరణే బిగ్ ఇన్నింగ్స్ ఆడేందుకు ఉపయోగపడింది. ముంబైపై మ్యాచ్‌లోనూ వైభవ్ క్రీజ్‌లో నిలబడితే ముంబై బౌలర్లకు చక్కలే. ఇక యశస్వీ జైస్వాల్, ధృవ్ జురెల్ మరోసారి బ్యాటింగ్‌లో మెరవాల్సి ఉంటుంది. రియాన్ పరాగ్ చక్కని ఫామ్‌లో ఉండడం, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అనుభవం ప్లస్ కానుంది. ఇక అర్చర్ రూపంలో ఆరంభంలోనే వికెట్లు తీయగల బౌలర్ ఉన్నాడు. అతనికి తోడు పెరేరా, సందీప్, యష్ రాజ్...ప్రత్యర్థి జట్టును కట్టడిచేయాల్సి ఉంటుంది. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 27 పరుగుల తేడాతో నెగ్గిన రాజస్థాన్ రాయల్స్.. దాన్ని రిపీట్ చేసి ప్లే ఆఫ్‌లో ప్రవేశించడంపై ఫోకస్ పెట్టింది.

**హెడ్ టు హెడ్**

ఇరు జట్లలో ముంబై ఇండియన్స్‌దే కాస్తంత పైచేయి. 32 మ్యాచ్‌ల్లో తలపడగా ముంబై 16 మ్యాచ్‌ల్లో, రాజస్థాన్ 15 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. అయితే వాంఖడేలో తలపడ్డ గత 9 మ్యాచ్‌ల్లో అయిదింటిలో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించింది.

**రాజస్థాన్ రాయల్స్:** యశస్వీ జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, ధృవ్ జురెల్, రియాగ్ పరాగ్(కెప్టెన్), ఫెరీరా, రవీంద్ర జడేజా, రవి సింగ్, జోఫ్రా అర్చర్, యష్ రాజ్, మఫాకా, సందీప్ శర్మ, నండ్రే బర్గర్

**ముంబై ఇండియన్స్:** ర్యాన్ రికల్టన్, రోహిత్ శర్మ, నమన్ ధీర్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, కార్బిన్ బాష్, దీపక్ చాహర్, జస్‌ప్రీత్ బుమ్రా, ఘజన్‌ఫర్, షార్దుల్ ఠాకూర్



# ఎట్టకేలకు అర్జున్ తెండూల్కర్ షో

**లక్నో:** క్రికెట్ దిగ్గజం సచిన్ తెండ్యూలర్ తనయుడు అర్జున్ తెండూల్కర్‌కు ఎట్టకేలకు ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడడమే కాక అదరగొట్టాడు. లెఫ్టార్మ్ పేసర్ అయిన అర్జున్ పూర్తి కోటా 4 ఓవర్లు వేశాడు. 9 ఎకానమీతో 36 పరుగులిచ్చి ఓ వికెట్ పడగొట్టాడు. చివరి మ్యాచ్‌లో లక్నో తుది జట్టులోకి వచ్చిన అర్జున్ బ్యాటింగ్ లో 5 బంతులు ఎదుర్కొని 5 పరుగులు చేశాడు. ఆతర్వాత బౌలింగ్‌లో సత్తా చాటాడు. తొలి ఓవర్ మొదటి రెండు బంతులను డాట్స్ చేసిన అర్జున్... ఆ ఓవర్లో నాలుగు సింగిల్స్ మాత్రమే ఇచ్చి ఆకట్టుకున్నాడు. రెండో ఓవర్‌లో లయ తప్పి మాత్రం 15 పరుగులిచ్చినా.. మూడో ఓవర్లో జోరు మీదున్న ప్రభుసిమ్రాన్‌ను అద్భుత బంతితో ఎల్బీగా అవుట్ చేశాడు.

అర్జున్ తెండూల్కర్‌కు ఈ సీజన్‌లో ఇదే తొలి మ్యాచ్. కాగా ఇప్పటివరకు 6 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. మొత్తంగా 4 వికెట్లు తీశాడు. 2021 ఐపీఎల్ వేలంలో అర్జున్‌ను ముంబై ఇండియన్స్ 20 లక్షల బేస్ ధరకు దక్కించుకుంది. 2022లో 30 లక్షలకు ముంబై రిటేన్ చేసుకుంది. 2023 సీజన్‌లో కోల్‌కతాపై తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కింది. సన్‌రైజర్స్‌పై తొలివికెట్ సాధించి జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. 2024 సీజన్‌లో ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. 2025లో లక్నో సూపర్ జెయింట్స్‌కు మారినా ఈ సీజన్‌లో కానీ అర్జున్‌కు ఆడే అవకాశం రాలేదు.

## 75వేల మద్దతు స్థాయిని

# బ్రేక్ చేసిన బిట్‌కాయిన్



**న్యూఢిల్లీ, మే 23:** క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో బిట్‌కాయిన్ అత్యంత కీలకమైన 75వేల మద్దతు స్థాయిని శనివారం బ్రేక్ చేసింది. అంతర్జాతీయ క్రిప్టో మార్కెట్ మానిటరింగ్ సంస్థ ట్రేడింగ్ వ్యూ లైవ్ చార్ట్ ఆధారాల ప్రకారం బిట్‌కాయిన్ ప్రస్తుతం 74,678 వద్ద ట్రేడవుతోంది. ఇటీవలి కాలంలో సాధించిన గరిష్ఠ స్థాయిల నుంచి ఇది ఒక గమనించదగ్గ పతనంగా అంచనావేస్తున్నారు. గడచిన రోజులుగా బిట్‌కాయిన్ 77,000 నుంచి 78,000 రేంజ్‌లో గట్టి పట్టు సాధించడానికి ప్రయత్నించింది. మార్కెట్లో కొనుగోళ్ల మద్దతు గట్టిగానే కనిపించింది. శనివారం మాత్రం భారీ పతనం చవిచూసింది. ఈ మధ్యాహ్నం తర్వాత మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. 76,500 స్థాయిల వద్ద ఉన్న సపోర్ట్‌ను బ్రేక్ చేస్తూ ధర నేరుగా 74,250 వరకు పడిపోయింది. ప్రస్తుతం అక్కడ నుంచి స్వల్పంగా కోలుకుని 74,678 వద్ద కొనసాగుతోంది. గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి మధ్య బిట్‌కాయిన్ ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. ఈ తాజా పతనానికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి.

అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు. పెద్ద పెద్ద సంస్థలు, ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల వ్యూహాలను మార్చుకోవడం. ఇటీవలి కాలంలో బిట్‌కాయిన్ దిగువ స్థాయిల నుంచి భారీగా పుంజుకోవడంతో, ట్రేడర్లు ఈ స్థాయిలో లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటి కారణాలను చెప్పుకొస్తున్నారు. సాధారణంగా బిట్‌కాయిన్ పతనమైతే దాని ప్రభావం మొత్తం క్రిప్టో మార్కెట్‌పై పడుతుంది. లైవ్ వాచ్‌లిస్ట్ డేటా ప్రకారం బిట్‌కాయిన్ పతనం కారణంగా ఇథీరియం మైనస్ రేంజ్‌లోకి వెళ్లగా, మిగిలిన ప్రధాన ఆల్ట్‌కాయిన్స్ కూడా తీవ్ర విక్రయాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల గ్లోబల్ క్రిప్టో మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా కొంత మేర కుంచించుకుపోయింది.

ప్రస్తుత మార్కెట్ సెంటిమెంట్ కాస్త ప్రతికూలంగా ఉన్నప్పటికీ, సుదీర్ఘ కాలంలో డిజిటల్ అసెట్ గా బిట్‌కాయిన్‌కు ఉన్న క్రేజ్ కొనసాగుతుందని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. స్వల్పకాలిక ట్రేడర్లు మార్కెట్ స్థిరీకరణ కోసం వేచి చూడాలని, ఇటువంటి సమయంలో ఎలాంటి భావోద్వేగ లేదా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా, రిస్క్ మేనేజ్‌మెంట్‌ను కఠినంగా పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.




## సెంట్రల్ బ్యాంకులో ఆఫర్ ఫర్ సేల్

# 8శాతం వాటా విక్రయం

**న్యూఢిల్లీ, మే 23:** లాభదాయకతలేని ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల్లో వాటాలను తగ్గించుకునేప్రక్రియను కేంద్రం వేగవంతంచేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కూడా ఆఫర్ ఫర్‌సేల్ పద్ధతిలో వాటాల్ని అమ్మేస్తుంది. శుక్రవారం రోజే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ఇక్కడ ఇన్వెస్టర్ల నుంచి ఊహించని స్థాయిలో అదిరిపోయే రెస్పాన్స్ వస్తుండటంతో అదనంగా వాటా విక్రయించేందుకు సిద్ధమైంది. ముందుగా 4శాతం వాటానే విక్రయించాలని నిర్ణయించి మరో 4శాతం గ్రీన్ షూ ఆప్షన్ లేదా ఓవర్ సబ్‌స్క్రిప్షన్ ఆప్షన్ కింద ఉంచింది. ఇప్పుడు మంచిరెస్పాన్స్ లభించగా మిగతా 4శాతం వాటాను కూడా ఓఎఫ్ఎస్ కింద అంటే మొత్తం 8శాతం వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌కింద విక్రయిస్తోంది. నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించేందుకు ఓఎఫ్ఎస్ ప్రక్రియ చేపట్టింది. ఇక్కడ మొత్తంగా 32.58 కోట్ల షేర్లను రిజర్వ్ చేయగా ఇలా అందుబాటులో ఉన్న షేర్లు 2 రెట్లకు మించి రెస్పాన్స్ వచ్చింది. మొత్తం 76.86 కోట్ల షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి. ముందురోజు క్లోజింగ్ ధర రూ. 33.92 తో చూస్తే చాలా తక్కువ ధరకే రూ. 31 నే ఫ్లోర్ ధరగా నిర్ణయించింది. మార్కెట్లో ఉన్న ధర కంటే కాస్త తక్కువకే షేర్లను కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. వారాంతంలో మాత్రం షేరు ధర దాదాపు 8 శాతం తగ్గి రూ. 31.22 వద్ద స్థిరపడింది. ఈనెల 25 రెగ్యులర్ ఇన్వెస్టర్లు లేదా రిటైల్ ఇన్వెస్టర్లకు ఓఎఫ్ఎస్ అందుబాటులో ఉంటుంది. సోమవారం రోజు షేర్లకు బిడ్స్ దాఖలు చేసేందుకు వీలుంటుంది. ముందుగా 4 శాతం వాటా 36.20 కోట్ల షేర్లు అందుబాటులో ఉంచగా, ఇప్పుడు మరో 4శాతం అంటే మొత్తంగా 72.41కోట్ల షేర్లను అందుబాటులోకి తెచ్చింది.

# పెట్టుబడులకు లాంగ్‌టర్మ్ ఫండ్స్ మేలు

**ముంబయి, మే 23:** పెట్టుబడులకోసం స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రియల్ ఎస్టేట్, గోల్డ్, ఆర్బీఐ సేవింగ్స్ బాండ్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉంటాయి. బ్యాంక్ ఎఫ్‌డీలు, పోస్టాఫీస్ పథకాలు వంటివి రిస్క్ లేకుండానే మంచి రిటర్న్స్ ఇస్తాయి. గోల్డ్, రియల్ ఎస్టేట్ వంటివి అనిశ్చితిలో ఉంటాయి. రిటర్న్స్ నిలకడగా ఉండవు. వీటికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లు ఉన్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. రిస్క్ ఫ్యాక్టర్ ఎక్కువగానే ఉంటుంది. దానికి తగ్గట్లుగానే రాబడి కూడా ఆకర్షణీయంగా ఉంటుంది. ఇక్కడ చాలా వరకు లాంగ్ రన్ పెట్టుబడుల కోసమైతేనే ఇన్వెస్ట్ చేయడం మంచిది. స్వల్ప కాలంలో రిస్క్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇప్పుడు మే నెలలో పెట్టుబడులు పెట్టేందుకు టాప్ మ్యూచువల్ ఫండ్స్ కొన్ని మార్కెట్‌కు వచ్చాయి. వీటి పెర్ఫామెన్స్ తెలుసుకునేందుకు ఇన్వెస్టర్లు మూడేళ్ల రాబడుల్ని ప్రాతిపదికగా తీసుకుంటారు.

యాక్సిస్ స్మాల్ క్యాప్ ఫండ్ 2013 నవంబరులో లాంఛ్ అయింది. గత మూడేళ్ల వ్యవధిలో ఇక్కడ సగటున వార్షిక ప్రాతిపదికన 24.5 శాతం రిటర్న్స్ అందించింది. 2009 డిసెంబరులో లాంఛ్ అయిన ఎస్బీఐ స్మాల్ క్యాప్ ఫండ్ సగటున వార్షిక ప్రాతిపదికన 23.4 శాతం రాబడి అందించింది. కోటక్ స్మాల్ క్యాప్ ఫండ్ చూస్తే సగటున గత మూడేళ్లలో వార్షికంగా 25.1 శాతం రాబడి ఇచ్చింది. నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ వార్షిక ప్రాతిపదికన సగటున 31.6 శాతం రాబడి అందించింది.







# టిసిఎస్ కొత్త విధానంపై ఉద్యోగుల్లో ఆందోళన

**ముంబయి, మే 23:** వరస లేఆఫ్స్‌తో టెక్ రంగంలో తీవ్రస్థాయి అనిశ్చితి నెలకొంది. ప్రస్తుతం దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీల్లో ఒకటైన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్ణయం ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతోంది. వేరియబెల్ పే విధానాన్ని మార్చి, ఆఫీస్ హాజరుతో లింక్ చేయడంపై ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 6లక్షల మంది ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటి వరకు వేరియబుల్ పే రూపంలో నెలవారీగా లేదా క్వార్టర్లీ వారీగా అందుతున్న మొత్తాన్ని ఇప్పటి నుంచి మంత్లీ పర్ఫామెన్స్ పేగా మార్చారు. దీంతో ఉద్యోగులు ఆఫీస్ హాజరు, ప్రాజెక్ట్ డిప్లాయ్‌మెంట్ ఆధారంగా నిర్ణయించనున్నారు. దీని కారణంగా ఆఫీస్ తక్కువగా వచ్చే ఉద్యోగులకు టేక్‌హోమ్ సాలరీ తగ్గే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు, ఈ ఏడాది టీసీఎస్ సాధారణంగా 5 శాతం నుంచి 8 శాతం వరకు జీతాలను పెంచినట్లు సమాచారం. మంచి పనితీరు కనబరిచిన ఉద్యోగులకు ఎప్లస్ కేటగిరీలో చేర్చి, 10 శాతం నుంచి 13 శాతం వరకు పెంచినట్లు తెలుస్తోంది. తక్కువ రేటింగ్ పొందిన వారికి కేవలం 2 శాతం నుంచి 3 శాతం వరకు మాత్రమే పెరిగినట్లు తెలుస్తోంది.




## రూ.2 వాటా రూ.250కి కొనుగోలు

# విప్రో బైబాక్ తేదీ ఖరారు

**బెంగళూరు, మే 23:** దేశంలోని అతిపెద్ద ఐటీ సంస్థ విప్రో ఇటీవల ఏప్రిల్‌లో 2025-26 ఆర్థిక సంవత్సరం క్యూ4 ఫలితాల్ని ప్రకటన సందర్భంలోనే షేర్ హోల్డర్లకు ఒక బంపర్ ఆఫర్ ప్రకటించింది. రూ.15 వేల కోట్ల విలువైన షేర్ బైబ్యాక్ ఆఫర్ చేయగా ఇప్పుడు దీనికి రికార్డ్ డేట్ ప్రకటించింది. 2026, జూన్ 5 ను రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. ఆతేదీ లోపు విప్రో షేర్లను కలిగి ఉంటే షేర్ బైబ్యాక్‌కు అర్హత సాధిస్తారు. విప్రో షేర్లను ఆ తేదీ లోపు కొనుగోలు చేసి డీమ్యాట్ ఖాతాలో ఉంచుకుంటే బైబ్యాక్‌కు అర్హత సాధిస్తారు. అర్హులైన షేర్ హోల్డర్లు ఇందులో టెండర్ ఆఫర్ ద్వారా పాల్గొనే అవకాశం లభిస్తుంది. ఈ మేరకు రికార్డు తేదీ గురించి స్టాక్ ఎక్స్ఛేంజీలకు విప్రో సమాచారం అందించింది. రూ. 2 ఫేస్ వాల్యూ (ముఖ విలువ) కలిగిన ఒక్కో షేరును రూ. 250 చొప్పున తిరిగి కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. మొత్తం 60 కోట్ల షేర్లను టెండర్ ఆఫర్ ప్రాసెస్ ద్వారా విప్రోనే తిరిగి షేర్ హోల్డర్ల దగ్గరి నుంచి కొనుగోలు చేస్తుంది.

విప్రో షేరు ధర వారాంతపు సెషన్‌లో రూ. 203 వద్ద ముగియగా.. దాని కంటే సుమారు 25 శాతం వరకు అధిక ధర చెల్లించి తిరిగి షేర్లను కొనుగోలు చేస్తుండటం విశేషం. ఈ లెక్కన షేర్ హోల్డర్లకు స్వల్ప కాలంలో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. జనవరి మార్చి త్రైమాసికంలో విప్రో లాభం కూడా 2 శాతం తగ్గింది. మరోవైపు ఐటీ స్టాక్స్‌లో ఒకవైపు తీవ్ర అమ్మకాల ఒత్తిడి పెరిగిన సమయంలో విప్రో ఇలా బైబ్యాక్ ప్రకటించడం గొప్ప విషయంగా మార్కెట్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కంపెనీ తన సొంత వాటాలను బహిరంగ మార్కెట్ నుంచి లేదా ప్రస్తుత వాటాదారుల నుంచి నేరుగా తిరిగి కొనుగోలు చేసే ప్రక్రియనే షేర్ బైబ్యాక్ అంటారు. షేర్ బైబ్యాక్ ద్వారా కంపెనీ తన వద్ద ఉన్న మొత్తం షేర్ల సంఖ్యను తగ్గిస్తుందని చెప్పొచ్చు. ఇలా మార్కెట్లో షేర్ల సంఖ్య తగ్గడం వల్ల ఒక్కో షేరుపై వచ్చే ఆదాయం పెరుగుతుంది. ఇంకా కంపెనీనే అధిక ధర చెల్లించి తిరిగి కొనుగోలు చేయడం వల్ల వాటికి డిమాండ్ పెరిగి.. షేరు ధర మళ్లీ పెరిగే అవకాశం ఉంటుంది. డివిడెండ్ ద్వారా కంపెనీ తన లాభాల్ని షేర్ హోల్డర్లతో పంచుకునేందుకు ప్రత్యామ్నాయంగా షేర్ బైబ్యాక్ ఆప్షన్ ఎంచుకుంటుంది.

# మైక్రోసాఫ్ట్‌ను వీడుతున్న మెహదీ



**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 23:** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో 35 ఏళ్లుగా పనిచేస్తున్న కీలక నిపుణుడు, కన్స్యూమర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ యూసఫ్ మెహదీ తన పదవి నుంచి వైదొలుగుతున్నారు. ఉద్యోగులకు పంపిన ఒక అంతర్గత మెమోలో ఆయన తన నిర్ణయం వెల్లడించారు. మైక్రోసాఫ్ట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం పని చేసిన వారిలో మెహదీ ఒకరు. వచ్చే ఏడాది జూన్ వరకు, మైక్రోసాఫ్ట్ తదుపరి ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఆయన కంపెనీలో కొనసాగుతారు. ఈ సమయంలో ఏఐ ఆధారిత ఏజెంట్ల కోసం విండోస్‌ను పునర్ నిర్వచించడం, మైక్రోసాఫ్ట్ 365 వృద్ధి, వన్ కోపైలట్ విజన్‌ను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి సారిస్తానని తెలిపారు. సున్నితమైన మార్పు ప్రక్రియ కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇంటర్న్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన మెహదీ మైక్రోసాఫ్ట్ చరిత్రలో అనేక కీలక భాగమయ్యారు. విండోస్ 95, సెర్చ్ ఇంజిన్ బింగ్, ఎక్స్‌బాక్స్ వన్, విండోస్ 10, ఇటీవలి కోపైలట్ ప్లస్ పీసీల ఆవిష్కరణలలో ఆయన కీలకపాత్ర పోషించారు. మైక్రోసాఫ్ట్‌లో 35 ఏళ్ల అసాధరణ ప్రయాణం తర్వాత నా తదుపరి సాహసయాత్రను ప్రారంభించడానికి ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నట్లు మెహదీ తన మెమోలో పేర్కొన్నారు. సీఈఓ సత్య నాదెళ్ల నేతృత్వంలో మైక్రోసాఫ్ట్ ఏఐపై భారీగా దృష్టి సారిస్తున్న తరుణంలో జరుగుతున్న నాయకత్వ మార్పులలో భాగంగానే యూసఫ్ మెహదీ నిష్క్రమణను విశ్లేషకులు చూస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## ఆర్యవైశ్య, వాసవి క్లబ్ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ



**బుట్టాయగూడెం.మే 23 : (ప్రభాత వార్త )** స్థానిక ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ బుట్టాయగూడెంలో శనివారం వారపు సంత సందర్భంగా పరిసర గ్రామాల నుండి వచ్చే ప్రజలు, మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వారికి, ప్రయాణికులకు, ప్రజలకు వేసవి దాహార్తిని తీర్చేందుకు సుమారు 350 లీటర్ల మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు. గత నాలుగు రోజులుగా పశ్చిమ ఏజెన్సీలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు వడగాడ్పులకు గురవుతున్నారు. వాతావరణ పరిస్థితిని గమనించి ప్రజల దాహార్తిని తీర్చి, వేసవి వేడి గాలుల నుండి ఉపశమనం కలిగే విధంగా మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ చేపట్టిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు గట్టు సాయి సందీప్, పరకోటి బ్రహ్మయ్య, వెత్సా ఈశ్వర మణికంఠ, నల్లజర్ల సంతోష్ కుమార్, తట్టవర్తి వరప్రసాద్, నున్న ప్రేమ్ కుమార్, నున్న శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### జంగారెడ్డిగూడెంలో
## 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రారంభం
### జూన్ 20 వరకు ప్రత్యేక పరిశుభ్రత డ్రైవ్



**జంగారెడ్డిగూడెం మే 23 ప్రభాత వార్త** ?ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛతలో నెంబర్ 1గా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంలో శనివారం 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ప్రత్యేక పరిశుభ్రత డ్రైవ్ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలను పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శనివారం ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జంగారెడ్డిగూడెం మసీద్ సెంటర్ నుండి ఆర్.టి.సి. బస్టాండ్ వరకు పురపాలక సిబ్బంది, నాయకులు శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ?మే 23 నుండి జూన్ 20 వరకు మొత్తం 36 రోజుల పాటు, 4 వారాల ప్రత్యేక ప్రణాళికతో ఈ డ్రైవ్ కొనసాగనుంది. 'మన ఊరు - మన పరిశుభ్రత' అనే నినాదంతో పట్టణంలోని ప్రధాన రోడ్లు, డ్రైన్లు, మార్కెట్లు, ప్రజా మరుగుదొడ్లను పూర్తిస్థాయిలో శుభ్రం చేసి, సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పురపాలక సంఘం యంత్రాంగం సిద్ధమైంది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్, పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, మునిసిపల్ శానిటేషన్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలని పురపాలక అధికారి కోరారు.

## శ్రీ మద్ది ఆంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ
### ప్రమాణ స్వీకార ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**జంగారెడ్డిగూడెం రూరల్ మే 23 ప్రభాతవార్త** జంగారెడ్డిగూడెం మండలం లో వేంచేసి ఉన్న శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవ ఆహ్వాన కరపత్రాన్ని చింతలపూడి శాసనసభ్యుడు సొంగా రోషన్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన చైర్మన్ రాజాన సత్యనారాయణ, ధర్మకర్తల మండలి సభ్యులు రోషన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం శాసనసభ్యుడికి స్వామి వారి శాలువా కప్పి, చిత్రపటం, ప్రసాదాలను అందించి ఘనంగా సన్మానించారు. ఈ నెల 30 (శనివారం) ఉదయం 11:02 గంటలకు దేవస్థాన ప్రాంగణంలో జరగనున్న ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయాల్సిందిగా రోషన్ కుమార్‌ను చైర్మన్, కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, నూతన పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## కొయ్యలగూడెంలో జనరల్ బాడీ మీటింగ్
### వేసవిపై ఎంపీపీ సమీక్ష



**కోయిలగూడెం రూరల్ మే 23 ప్రభాతవార్త** కొయ్యలగూడెం ఎండిఓ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్‌కు ఎంపీపీ గంజి మాల రామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీ సెక్రెటరీలు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలను ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, నీరు సరఫరా చేయాలని, ఫోటో స్కాన్ సమస్యలను పరిష్కరించి, ఎండ ముదరకముందే ఉదయమే ఫోటోలు తీసి కూలీలను పంపించాలని ఏపీఓకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు, అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు ఇప్పు గంట శ్రీను, చింత శ్రీదేవి, జాన్ డేవిడ్ కింగ్, నారా అన్నపురం, తాతారావు మరియు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి
### ముసునూరు ఎస్సై చిరంజీవి



**ముసునూరు మే 23 ప్రభాతవార్త=** వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి , సురక్షితంగా వారి గృహాలకు చేరాలని ముసునూరు ఎస్సై ఎం. చిరంజీవి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ముసునూరు బోర్డు బల్ల సెంటర్ వద్ద ద్విచక్ర, ఆటో వివిధ వాహనదారులకు రోడ్డు భద్రత పలు అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు డ్రైవింగ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్, కార్ల లో సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతుందని పేర్కొన్నారు. వారి కుటుంబాల్లో చీకటి రాజ్యమేలుతుందన్నారు.

# చాట్రాయి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించండి!

- వైద్యులు ఉన్నా సదుపాయాలు సున్నా
- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం అగచాట్లు
- మంత్రివర్యా దృష్టి సారించండి!



**ప్రభాతవార్త, చాట్రాయి** అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అనే తీరున చాట్రాయి ప్రాథమిక ఆసుపత్రి తయారైంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరిపడ సిబ్బంది తో పాటు సేవాభావంతో పనిచేసే నలుగురు వైద్యులు కూడా ఉన్నారు. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలంటే 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నూజివీడు ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సింది పరిస్థితి ఏర్పడింది. చాట్రాయి ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ నియంత్ర ఆపరేషన్లు నిర్వహించక సుమారు ఆరేళ్లు పూర్తి అవుతోంది. ఆపరేషన్ థియేటర్ మూతపడి ఉండటంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కోసం నూజివీడు ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాట్రాయి మండలంలో సుమారు 60వేల మందికి పైగా జనాభా ఉండగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయకపోవడంతో బాలింతల ఇబ్బందులు ఇన్నిన్ని కావని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో ఆపరేషన్ చేయక పోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంత ప్రజలు నిన్ను మార్లు మొరపెట్టుకున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు కానీ ఉన్నతాధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రభుత్వం ప్రచారం చేస్తున్నప్పటికీ ఆపరేషన్లు చేయటంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారో చెప్పాలని ప్రజలు డిమాండ్ చేశారు. ఆపరేషన్ థియేటర్ మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉందని అధికారులు చెప్తున్నారు అని ఎప్పటికీ ఆపరేషన్ థియేటర్ మరమ్మతులు చేయిస్తారో చెప్పాలని పలువురు కోరుతున్నారు. దీనిపై మంత్రి పార్థసారథి జోక్యం చేసుకొని నిధులు మంజూరు చేయించి ఆపరేషన్ థియేటర్ పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



### కొయ్యలగూడెంలో
## టెన్త్ విజేతలకు సన్మానం

**కొయ్యలగూడెం మే 23 ప్రభాతవార్త** కొయ్యలగూడెం పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూల్ విద్యార్థులకు కొయ్యలగూడెంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఎండిఓ కిరణ్ కుమార్, ఎంఈఓ సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో.. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ముగ్గురు ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపీపీ గంజిమాల రామారావు శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు గంట శ్రీను, నారా అన్నపురం, చింతా శ్రీదేవి, జాన్ డేవిడ్ కింగ్ మరియు స్కూల్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### జంగారెడ్డిగూడెంలో విద్యుత్ సమస్యల
## పరిష్కారానికి తక్షణ చర్యలు



**జంగారెడ్డిగూడెం మే 23 ప్రభాతవార్త** వేసవి ఉష్ణోగ్రతలు, అధిక వినియోగం కారణంగా జంగారెడ్డిగూడెంలో ఏర్పడిన విద్యుత్ అంతరాయాలను అధిగమించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపెరింటెండెండింగ్ ఇంజనీర్ పి. సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో సమస్యల పరిష్కారానికి కొత్తగా ఆరు 100 కె వి ఏ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన పోస్టాఫీస్ పేరంపేట రోడ్, సుబ్బంపేట ఎంపీపీ పాఠశాల రోడ్ ప్రాంతాల్లోని ట్రాన్స్ఫార్మర్లపై లోడ్ పెరగడంతో సరఫరాకు అంతరాయం కలిగిందని, తక్షణమే అక్కడ 100 కె వి ఏ స్థానంలో 160 కె వి ఏ ట్రాన్స్ఫార్మర్‌ను అమర్చి, లోడ్ సర్దుబాటు చేసి సరఫరాను పునరుద్ధరించామని వివరించారు. వినియోగదారులకు ఏవైనా విద్యుత్ సమస్యలు ఉంటే ఎస్ఈ (9440812702), ఈఈ (9491049797), ఏఈఈ (9440812722) నంబర్లకు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు సంప్రదించాలని కోరారు.

### భరతనాట్యం చేస్తూ కొండపైకి
## వెళ్లిన విద్యార్థిని





**జంగారెడ్డిగూడెం మే 23 ప్రభాతవార్త** జంగారెడ్డిగూడెం స్థానిక పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పూజలు వైభవంగా జరిగాయి. వేకువజామున సుప్రభాత సేవ, తోమల సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ఉదయం జరిగిన గిరిప్రదక్షిణలో జంగారెడ్డిగూడెంకు చెందిన 10వ తరగతి విద్యార్థిని జ్యోషిత సాయిప్రియ గోవింద నామస్మరణతో, 2.5 కిలోమీటర్ల మేర ఏకధాటిగా భరతనాట్యం చేస్తూ కొండపైకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అల్లూరి రామకృష్ణ, ఈవో కలగల శ్రీనివాస్, అర్చకులు కలిసి ఆమెను స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలతో ఘనంగా సన్మానించారు. ?శనివారం కావడంతో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు. దీనికి పరిమి రాంబాబు-సుజాత (రామానుజపురం), సత్రం సుధీర్ కుమార్ (చల్లవారిగూడెం) దాతలుగా వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమంలో కొప్పుల నాగ సురేంద్ర, ముప్పిడి భానువిష్ణు తదితరులు పాల్గొన్నారు. కాగా, టికెట్లు, విరాళాలు, ప్రసాదాల ద్వారా ఆలయానికి ?1,29,000 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

### స్వర్ణాంధ్రలో చిప్ డిజైనింగ్ ఎంటర్ప్రెన్యూర్ పై
## అవగాహన సదస్సు



**నరసాపురం రూరల్ మే 23 ప్రభాత వార్త** స్థానిక సీతారాంపురంలో గల స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో చిప్ డిజైనింగ్ మరియు ఎంటర్ప్రెన్యూర్ పై ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చినిమిల్లి ,కో - ఫౌండర్ అండ్ సి. ఈ. వో. - టెస్సాల్వ్ పాల్గొన్నారు. ఆయన సెమీ కండక్టర్స్, చిప్ డిజైనింగ్, ఎంటర్ప్రెన్యూర్ మరియు సిలికాన్ వ్యాలీ అంశాల పై కళాశాల అధ్యాపకులకు అవగాహన కల్పించారు. నేటి రోజుల్లో టెక్నాలజీలో విద్యార్థులు ముందు ఉండాలి అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి శ్రీమతి చినిమిల్లి అంజనీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండవీటి వెంకట సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, డైరెక్టర్ ప్రవీణ్ జైన్, డైరెక్టర్ కైలాస్ , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీచంద్ , వివిధ విభాగాధిపతులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### సచివాలయంలో
## దివ్యాంగుల హక్కుల చట్టంపై సదస్సు



**జంగారెడ్డిగూడెం రూరల్ మే 23 ప్రభాతవార్త** జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట గ్రామ సచివాలయంలో శనివారం దివ్యాంగుల హక్కుల చట్టం-2016 పై అవగాహన సదస్సు జరిగింది. గిడియన్ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షురాలు ఎస్కే సుభాషిని మాట్లాడుతూ, చట్టం ప్రకారం దివ్యాంగులకు విద్య, ఉపాధి రంగాల్లో 4 శాతం రిజర్వేషన్లు, ప్రభుత్వ పథకాల్లో ప్రాధాన్యత ఉంటాయన్నారు. అర్హులైన వారంతా 'సదరం' సర్టిఫికెట్, 'యుడిఐడి' కార్డులు పొందాలని సూచించారు. ?నిర్వాహకులు గిడియన్ కిషోర్ మాట్లాడుతూ, దివ్యాంగులకు ఆర్టీసీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితం, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో 50 శాతం ప్రయాణ రాయితీ సౌకర్యం ఉందన్నారు. మరో వక్త బోసు మాట్లాడుతూ, వ్యాంగుల పిల్లల కోసం ప్రభుత్వం 10వ తరగతి వరకు ఉచిత విద్యా వసతులు, ప్రత్యేక హాస్టళ్లు కల్పిస్తోందని తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా ఇలాంటి సదస్సులు నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ మండల నాయకురాలు ఎం. జ్యోతి, సచివాలయ సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికులకు
## రెండో పూట సెలవు ఇవ్వాలి: ఐ.ఎఫ్.టి.యు.



**జంగారెడ్డిగూడెం మే 23 ప్రభాత వార్త** జంగారెడ్డిగూడెం ఎండలు 50 డిగ్రీలకు చేరుతున్నందున మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఉదయం పూట మాత్రమే విధులు కేటాయించి, రెండో పూట సెలవు ఇవ్వాలని ఐ.ఎఫ్.టి.యు. డిమాండ్ చేసింది. శనివారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె.వి. రమణకు యూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ?ఐ.ఎఫ్.టి.యు. జిల్లా అధ్యక్షుడు కె.వి. రమణ మాట్లాడుతూ, రోహిణి కార్తె ముగిసే వరకు రెండో పూట పనులు పెట్టవద్దని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం మధ్యాహ్నం సెలవు ఇవ్వాలని కోరారు. కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ అందించాలన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, ఇప్పటికే మస్తర్ సమయాన్ని మధ్యాహ్నం 3 గంటలకు మార్చామని, ఉన్నతాధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రేలంగి నాగరాజు, కొత్తూరు శ్రీను, ముల్లేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ నర్సాపురం లక్ష్యంగా 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'

### పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత
### జాయింట్ కలెక్టర్ మరియు నరసాపురం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి.

**నరసాపురం మే 23 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో భాగంగా నర్సాపురం పట్టణంలో శనివారం విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా పాల్గొని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. స్టీమర్ రోడ్డులో నిర్వహించిన ప్రత్యేక శుభ్రత కార్యక్రమంలో వీరిరువురు స్వయంగా చీపురు పట్టి రోడ్లను శుభ్రపరిచారు. చెత్త తొలగింపు కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశుధ్య కార్మికులతో కలిసి పాల్గొని ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమానికి జెండా ఊపి అధికారికంగా



ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ నర్సాపురం పట్టణాన్ని స్వచ్ఛమైన, అందమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రజాప్రతినిధులు లేదా అధికారులతో మాత్రమే సాధ్యంకాదని, ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద చెత్తను సక్రమంగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు నరసాపురం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మే 22 నుండి జూన్ 20, 2026 వరకు నాలుగు వారాల పాటు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరుతో ముమ్మర పారిశుధ్య డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి వారంలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త తొలగింపు, ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. రెండవ వారంలో ప్రధాన, ఉప డ్రైన్లలో పూడికతీత పనులు, ఇరుకు సందుల్లో శుభ్రత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మూడవ వారంలో నివాస మరియు వాణిజ్య సముదాయాలలో 100 శాతం తడి-పొడి చెత్త వర్గీకరణపై అవగాహన కల్పించడంతో పాటు బల్క్ వేస్ట్ ఉత్పత్తిదారులచే



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనల అమలుపై చర్యలు తీసుకుంటామని వివరించారు. నాలుగో వారంలో అన్ని పబ్లిక్ మరియు కమ్యూనిటీ మరుగుదొడ్ల సంపూర్ణ శానిటైజేషన్, చెత్త వేయబడే సమస్యాత్మక ప్రాంతాల నిర్మూలన, ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాబోయే 45 రోజులలో నర్సాపురం పట్టణాన్ని సమస్యలేని, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పదవులు కంటే జనసేన పార్టీ గొప్పది
### జనసేన ఇంచార్జ్ బర్మా ఫణి బాబు



**నూజివీడు, మే 23 ప్రభాతవార్త** పదవులు కంటే పార్టీ గొప్పదని నూజివీడు జనసేన ఇంచార్జ్ బర్మా ఫణిబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నాయకత్వం అనేది ప్రజల మధ్య నడిచిన అడుగులతో, కార్యకర్తల గుండెల్లో సంపాదించుకున్న నమ్మకంతో ఉంటుందన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బాధ్యతల విషయంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రచారం, ఎప్పుడూ పదవుల కోసం రాజకీయాలు చేయలేదు. 2009లో ప్రజారాజ్యం పార్టీతో ప్రారంభమైన తమ రాజకీయ ప్రస్థానం నుంచి నేటి వరకు తాను విశ్వసించింది ఒక్కటే అన్నారు. అది వ్యక్తుల కంటే సిద్ధాంతాలు గొప్పవి, పదవుల కంటే పార్టీ గొప్పది.జనసేన పార్టీ లకు అన్నీ ఇచ్చింది. ఆ పార్టీ జెండా కింద పనిచేసే అవకాశం కల్పించింది. అందుకే నేడు ఇన్‌చార్జ్ పదవి వస్తుందా లేదా అనే దానికంటే, నూజివీడులో జనసేన బలపడుతుందా లేదా అన్నదే తమకు ముఖ్యం అన్నారు. కొంతమంది వ్యక్తిగత విమర్శలు చేస్తుంటారు. అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ నేను వాటికి సమాధానం మాటలతో ఇవ్వను. ప్రజల కోసం చేసిన పనులతో, కార్యకర్తల కోసం చేసిన సేవతోనే సమాధానం చెబుతాను. ఎందుకంటే రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు. ప్రజల విశ్వాసమే శాశ్వతం. పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా దానిని గౌరవిస్తాను. ఎందుకంటే జనసేనలో వ్యక్తిగత ఆశల కంటే పార్టీ క్రమశిక్షణ ముఖ్యమని తాను నమ్ముతానన్నారు. బాధ్యత నాకు వస్తే మరింత అంకితభావంతో పనిచేస్తాను. మరెవరికి అవకాశం వచ్చినా అదే ఉత్సాహంతో పార్టీ విజయానికి కృషి చేస్తాను. తనను అభిమానించే ప్రతి కార్యకర్తకు నా విజ్ఞప్తి ఒక్కటే .వ్యక్తుల కోసం కాదు, పవన్ కళ్యాణ్ కలలుగన్న సమాజం కోసం పనిచేద్దాం. విభేదాల కంటే ఐక్యతను, విమర్శల కంటే సేవను, ప్రచారాల కంటే ప్రజా సమస్యల పరిష్కారాన్ని ముందుకు తీసుకెళ్దాం అన్నారు.

### వేండ్ర కాలువలో
## కారు ప్రమాదంపై విచారణ



**భీమవరం టౌన్, మే 23 : ప్రభాతవార్త** పాల కోడేరు మండలం వేంద్ర గ్రామం సమీపంలో గురువారం రాత్రి కాలువలోకి దూసుకు వెళ్లిన కారుపై విచారణ జరుగు తున్నట్లు భీమవరం సబ్ డివిజనల్ ఆఫీసర్ రఘువీర్ విష్ణుతెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో శనివారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కాలువలోనికి దూసుకు వెళ్లిన కారుపై ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదని, కారు యజమాని క్రేన్ సహాయంతో బయటకు తీసి ఒక ప్రైవేటు వాహనంలో విజయవాడ తరలించినట్లు తెలిసిందని డీఎస్పీ తెలిపారు. దీని వివ రాలను లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు, అనుమానం వస్తే కేసు నమోదు చేస్తామని ఇది ఒక హోంగార్డు కు చెందిన కారుగా అనుమానిస్తున్నట్లు ఆయన తెలిపారు. మరింత సమాచారాన్ని త్వరలోనే తెలి యజేస్తామని వెల్లడిం చారు .ఈ సమా వేశంలో రూరల్ సీఐ శ్రీనివాసరావు భీమ వరం వన్ టౌన్ సిఐ ఎ రమేష్ పాల్గొన్నారు.

## సాగిపాడులో విషాదం: ఇంట్లో ఉరివేసుకున్న వివాహిత



**కామవరపుకోట,మే 23 (ప్రభాతవార్త):** భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థలు, క్షణికావేశంలో ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సాగిపాడు గ్రామానికి చెందిన ప్రకాష్ భార్య కలపర్తి.రమ్య (35) శనివారం మధ్యాహ్నం ఇంట్లో తీవ్ర మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. రమ్య ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తల్లి ఇలా అనంత లోకాలకు వెళ్లిపోవడంతో, ఆమె ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు తల్లి మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది..సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎమ్.వి. సుభాష్, తడికలపూడి సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వల్లిపద్మ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. మృతురాలు రమ్య గతంలో ఐకేపీ 'వెలుగు' విభాగంలో గ్రామ వీఓఏగా పనిచేసినట్లు సమాచారం. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను రోడ్డున పడేస్తాయని ఈ ఘటన మరోసారి నిరూపించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తడికలపూడి పోలీసులు తెలిపారు.

## పంట బోదెలో గుర్తుతెలియని మృతదేహం



**కాళ్ళ మే 23 (ప్రభాతవార్త)** పంట బోధిలో వ్యక్తి మృతదేహం ఉందని విఆర్ఓ ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు కాళ్ళ ఎస్సై తెలిపారు. దీనికి సంబంధించి కాల్ ఎస్సై ఏ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోపల్లె మెయిన్ రోడ్డులో ఆనుకుని ఉన్న ముదునూరి శర్మ ఖాళీ స్థలానికి ఆనుకుని ఉన్న పంటబోదెలో సుమారు 40-45 సంవత్సరాల వయసుగల వ్యక్తి శవం పడి ఉంది. గుర్తులు:తెలుపు, ఇటుక రంగు గల నైక్ రౌండ్ నెక్ టీ షర్ట్ , నీలం రంగు పై తెలుపు చార గల షార్ట్ ధరించి ఉన్నాడు, కుడి చేతికి రోల్డ్ గోల్డ్ కడియం పక్కనే తెలుపు ఎరుపు రంగు గల టవలు ఉందన్నారు. కుడి చేతికి రోల్డ్ గోల్డ్ కడియం టీ షార్ట్ మీద ఇంగ్లీష్ జస్ట్ డూయిట్ అని అక్షరాలు వ్రాసి ఉన్నది.కోపల్లి వీఆర్వో షేక్ హుస్సేన్ లాల్ రిపోర్ట్ పై కేసు నమోదు చేసామన్నారు.ఎవరికైనా వివరాలు తెలిసినచో కాళ్ళ పోలీసుస్టేషన్ 9440796649 నెంబర్ కి తెలియపరచాలని కోరారు.

## జనసైనికుడు రమణ సేవలు
### అమూల్యం :ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం: మే 23 (ప్రభాతవార్త)** బలుసులమ్మ సేవకుడు,పాతూరు యూత్ సభ్యుడు,జనసైనికుడు చవ్వాకుల రమణ సమాజానికి అమూల్యమైన సేవలు అందించారని శాసన సభ్యులు,రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. చిన్న వయసులోనే ఆయన ఆకస్మిక మరణం చెందటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాతూరులో రమణ కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే పరామర్శించారు. తన వ్యక్తి గత సహాయంగా రూ.3లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతూరు యూత్ సభ్యుని గా,బలుసులమ్మ సేవకుడిగా మరువలేని సేవలు అందించారని కొనియాడారు. బలుసులమ్మ జాతర సందర్భంగా అహర్నిశలు భక్తులకు సేవలు అందించారని అన్నారు.జనసేన కార్యకర్తగా పార్టీ కార్యక్రమాలలో చురుగ్గాపాల్గొనే రమణ లేకపోవడం పార్టీకి తీరనిలోటని అన్నారు. రమణ ఇద్దరు కుమారుల విద్యాభ్యాసానికి సహకరిస్తానని తెలియజేశారు. రమణ కుటుంబానికి సహకరించిన ఎమ్మెల్యే బొలిశెట్టికి పాతూరు యూత్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. జనసేన నాయకులకు ఈ కార్యక్రమంలో పైబోయిన వెంకటరామయ్య, పాలూరి వెంకటేశ్వరరావు చాపల రమేష్, మద్దాల మణికుమార్, కాళ్ల గోపికృష్ణ, శ్రీరంగం అంజి, పట్నాల రాంపండు, గుండుమొగుల సురేష్, నల్లగంచి రాంబాబు, దాట్ల జగన్నాథ రాజు, బైన పాలపు ముఖేష్,తదితరులు రమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# నూజివీడు రైతు బజారులో.. దళారీల రాజ్యం



- అధికారుల పర్యవేక్షణ ఎక్కడ
- ఇష్టాను సారంగా ధరలు.. గాడి తప్పిన రైతు బజార్
- రైతు బజార్లో మచ్చుకైనా కనిపించని రైతులు

నూజివీడు రైతు బజార్ అక్రమార్కులకు అడ్డాగా మారింది. నేతి బీరకాయ లో నెయ్యి ఉండటం ఎంత నిజమో రైతు బజార్లో రైతులే స్వయంగా తమ ఉత్పత్తులను విక్రయించడం అంత నిజంగా ఉంది. రైతు బజార్ల స్థాపన ముఖ్య ఉద్దేశం కూరగాయలు కష్టపడి పండించిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు మరోవైపు వినియోగదారులకు తాజా కూరగాయలను అందించటం. కానీ ఇక్కడ కొంతమంది దళారీలు పట్టీలలో రేట్ల కన్నా అధిక రేట్లకు కూరగాయలు విక్రయిస్తున్నారు. రైతులు లేకపోవడం వలన దళారుల రాజ్యం కొనసాగుతుంది. అధిక ధరలకు విక్రయించడం వలన వినియోగదారులు అక్రమార్కులపై మండిపడుతున్నారు.

**నూజివీడు, మే 23 ప్రభాతవార్త**

ఈ రైతు బజార్ కు నూజివీడు పట్టణంతోపాటు ముసునూరు, ఆగిరిపల్లి, నూజివీడు రూరల్ గ్రామాల ప్రజలు ఎక్కువగా వస్తున్నారు. కూరగాయల ధరల పట్టిక స్పష్టంగా కనిపించకుండా ధరలు నమోదు చేస్తున్నారు. వాస్తవంగా ఉన్న ధరలకంటే కేజీకి రూ 10 రూపాయలు నుంచి రూ 20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. నిత్యము రైతు బజార్లో వినియోగదారులతో దళారులు గొడవలకు దిగుతున్నారు. పట్టిల రేట్లు కన్నా ఎక్కువ రేట్లకు కూరగాయలు ఎందుకు అమ్ముతున్నారని వినియోగదారులను దళారులు ప్రశ్నిస్తే మేము మా ఇష్టం వచ్చినట్లు అమ్ముతాము మమ్మల్ని అడిగే నాధుడు ఎవరు లేరు అని, మీ ఇష్టమైతే కూరగాయలు కొనుగోలు చేయండి లేకపోతే లేదని ఖరా కండి గా రైతులకు చెబుతున్నారు. రెవెన్యూ , మున్సిపల్ అధికారులు గానీ ఈ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. రైతు బజార్లో ఎస్టేట్ ఆఫీసర్ జాడ కనబడటం లేదు. సిబ్బంది కూడా అక్కడ రూమ్ లో లేరు. పట్టీలో ఉన్న ధర ల కన్నా ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. ఉదాహరణకు కిలో టమాటాలు 40 లో ఉంటే 60 రూపాయలకు విక్ర ఇస్తున్నారు. అదే విధంగా పలు రకాల కూరగాయలు కూడా ఇదేవిధంగా అధిక ధరలకు విక్రయించడం జరుగుతుంది నూజివీడు రైతు బజార్లో పట్టించుకునే అధికారులు లేరు. దోపిడీ ఎక్కువగా జరుగుతుంది. రైతు బజార్లో కన్నా బయట షాపులలో తక్కువ రేటుకు కూరగాయలు విక్రయించడం జరుగుతుంది. పలువురు వినియోగదారులు రైతు బజార్ పరిస్థితి బాగోలేదని పట్టించుకునే నాధుడే కరువయ్యారని బహిరంగంగా విమర్శిస్తున్నారు. అక్కడ నిజమైన రైతులకు బదులు దళారులు కూరగాయలను కొనుగోలుకు చేసుకొని రైతు బజార్లో అమ్మడం జరుగుతుంది. రైతులకు రైతు బజార్లో అవకాశం లేకుండా పోతుంది. దళారుల వ్యవస్థ కొనసాగుతుంది. నూజివీడు రైతు బజార్ ను నూజివీడు సబ్ కలెక్టర్ ఒకసారి తనకి చేస్తే నిజ నిజాలు బయటపడతాయని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. నూజివీడు రైతు బజార్లో ఎస్టేట్ ఆఫీసర్ జాడ లేకుండా పోయింది. అధికారుల పర్యవేక్షణ లోపించడంతో నూజివీడు రైతు బజార్ ఇష్టా రాజ్యంగా నడుస్తుంది. పట్టించుకునే నాధుడే కరువయ్యారు. గాడి తప్పిన రైతు బజార్ ను ఒక గాడిలోకి తీసుకురావాలని అధికారులకు పలువురు వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. నూజివీడు రైతు బజార్ లో కూరగాయలు విక్రయించి కవర్లకు ఐదు రూపాయలు వసూలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు లబోదిబో అంటున్నారు. నూజివీడు రైతు బజార్లో ఉన్న దళారులు తెలిపిన ప్రకారం తాము విజయవాడలో కూరగాయలు ఖరీదు చేసుకునినూజివీడు రైతు బజార్ కు తీసుకొని వచ్చి విక్రయిస్తుంటామని మేము ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కూరగాయలు విక్రయించలేమని నూజివీడు రైతు బజార్లో ఉన్న దళారులు నిర్భయముగా వినియోగదారులకు తెలుపుతున్నారు. ఏది ఏమైనా నూజివీడు రైతు బజార్లో నెలకొన్న పరిస్థితిని అధికారులు పర్యవేక్షించి గాడి తప్పిన రైతు బజార్ లో దళారుల వ్యవస్థ లేకుండా రైతులతో విక్రయాలు జరిపించాలని అధికారులు పర్యవేక్షణలో నూజివీడు రైతు బజార్ కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.





పశ్చిమగోదావరి, ఏలూరు
వార్త



## క్లీన్ ఏలూరు జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి

### జిల్లాలో సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమానికి 4 వారాలపాటు స్పెషల్ డ్రైవ్




**ఏలూరు, మే, 23 : ప్రభాతవార్త** రోడ్లపై పరిశుభ్రత స్పష్టంగా కనిపించేలా క్లీన్ ఏలూరు జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఏలూరులోని 1వ డివిజన్లలోని కోడెల రోడ్డులో కమ్యూనిటీ హాలు వద్ద సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత గురించి కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజలకు అవగాహన కలిగించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆపరేషన్ కార్యక్రమాన్ని ఈనెల 22వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు నాలుగు వారాలు పాటు జిల్లాలో చేపట్టడం జరుగుతుందన్నారు. స్వర్ణఆంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో నాలుగు వారాలు పాటు ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా ఈనెల 22వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు నాలుగు వారాలపాటు పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో పారిశుద్ధ్య పరిస్థితులను ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో మరింత మెరుగు పరిచేందుకు పరిసరాల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మొదటి వారం మే 22వ తేదీ నుండి 28వ తేదీ వరకు వారం రోజులు పాటు రెడ్/ యెల్లో స్పాట్లు ఉ రోడ్ల శుభ్రత కార్యక్రమం, 2వ వారంలో భాగంగా మే 29వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు వర్షపు నీటి కాలువలు, నల్లాలు పూడిక తీసి శుభ్రం చేయడం, వెనుక సందులు శుభ్రం, 3వవారంలో భాగంగా జూన్ 5వ తేదీ నుండి జూన్ 11వ తేదీ వరకు నివాస, వ్యాపార ప్రాంతాలలో భారీ వ్యర్థాలు తొలగించడం , 4వ వారంలో భాగంగా జూన్ 12వ తేదీ నుండి జూన్ 20వ తేదీ వరకు పబ్లిక్ టాయిలెట్లు ఉ చెత్త హాట్ స్పాట్లు శుభ్రం చేసే కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రతీ నెల 3వ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవన్నారు. ఏలూరు నగరంలోని విలీన గ్రామాలలో సైతం సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమాలతోపాటు డ్రైన్లలో పూడికతీత చేపట్టి రోడ్లపై చెత్త లేకుండా చేస్తామన్నారు. రోడ్లపై చెత్త పేరుకుపోతే అపారిశుద్ధ్యం, దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. ఇంటికి వచ్చే పారిశుద్ధ్య కార్మికులను పొడి చెత్త, తడి చెత్తలను విడివిడిగా అందించాలని, ప్రజలు రోడ్లపై చెత్త వేయకుండా తమ ఇంటికి వచ్చే చెత్తసేకరణ వాహనానికి అందించాలని, తమ ఇంటి పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని బడేటి చంటి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏలూరు ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్. పెదబాబు, ఆర్డీఓ కిషోర్, గృహ నిర్మాణ శాఖ పిడి సత్యనారాయణ, ఎస్సి కార్పొరేషన్ ఈడి ముక్కంటి, తహసీల్దార్ గాయత్రీదేవి, ఏపీ ఎస్సీ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, జె.బాలాజీ, బోదాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# స్టార్ ప్రైవేట్ ఆసుపత్రికి అనుమతి లేదు..

## యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.జి.గీతాబాయ్



**తణుకు, మే 23 ( ప్రభాత వార్త)** బాలింత మృతి సంఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రైవేట్ ఆసుపత్రిపై ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు డిఎంహెచ్వో తెలిపారు.తనిఖీలో భాగంగా ఆసుపత్రి రికార్డులు, చికిత్స విధానం, విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది నుండి వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక విచారణలో మృతి చెందిన బాలింత బీహార్ రాష్ట్రానికి చెందిన యువతిగా గుర్తించినట్లు తెలిపారు. గర్భిణీ స్త్రీ మే 9, 2026న హైదరాబాద్‌లో స్కానింగ్ చేయించుకున్నట్లు, అనంతరం రాజమండ్రిలోని ఒక హోటల్‌లో ఉన్నట్లు సమాచారం లభించినట్లు చెప్పారు. అక్కడి నుండి పూర్తిస్థాయి గర్భధారణ కాలం నిండకముందే ఒక ఆర్.ఎం.పి డాక్టర్ సహకారంతో మే 16 రాత్రి తణుకులోని స్టార్ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు తెలిసిందన్నారు. ఆసుపత్రికి వచ్చిన గంట వ్యవధిలోనే శస్త్రచికిత్స నిర్వహించి శిశువును బయటికి తీసిన అనంతరం, మే 17 ఉదయం బాలింత మృతి చెందినట్లు వెల్లడించారు. తదుపరి బంధువులు లేదా కుటుంబ సభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల బృందంతో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహ అవశేషాలను భద్రపరిచినట్లు తెలిపారు. అలాగే నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. ప్రాథమిక విచారణలో వైద్య ఆరోగ్య శాఖ రికార్డుల ప్రకారం స్టార్ ఆసుపత్రి గత మూడు సంవత్సరాలుగా మూసివేయబడినట్లుగా నమోదై ఉన్నప్పటికీ, అనధికారికంగా కొంతమంది ఆర్.ఎం.పి డాక్టర్ల సహకారంతో కేసులు స్వీకరించి వైద్య సేవలు అందిస్తున్నట్లు సమాచారం లభించినట్లు చెప్పారు. అయితే దీనికి సంబంధించిన పూర్తి ఆధారాల సేకరణ కొనసాగుతోందని పేర్కొన్నారు. వైద్య నిబంధనలు మరియు ప్రభుత్వ మార్గదర్శకాలు ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా గుర్తించినందున స్టార్ ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జి. గీతాబాయ్ తెలిపారు.

## పట్టణ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు



**తాడేపల్లిగూడెం మే 23 (ప్రభాతవార్త)** పట్టణ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. ఏరియా హాస్పిటల్ వద్ద రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను కమిషనర్ స్వయంగా చీపురు పట్టి శుభ్రం చేశారు. అధికారులు, సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయించి, పూడిక తీయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్, మలేరియా ఆయిల్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజారోగ్యం బాగుంటుందని అధికారులు చెప్పడమే కాకుండా చేసి చూపించాలన్నారు.. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు, పలువురు రాజకీయ నాయకులు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులుపాల్గొన్నారు.

వై.సి.పి.పాలనలో మోసపోయాం

## అప్పారావుపేట గ్రామస్తుల ఆవేదన

### న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం,మే 23 (ప్రభాతవార్త)** ఇల్లులేని ప్రతి నీరుపేద కుటుంబానికి సొంత ఇల్లు సమాకుర్చటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. వైసిపి హయాంలో మోసపోయిన బాధితులందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామానికి చెందిన సుమారు 40 మంది లబ్ధిదారులు శనివారం స్థానిక జనసేన కార్యాలయంలోఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత వైసిపి హయాంలో ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేశారని, కానీ అవి ఎక్కడ ఉన్నాయో తెలియటంలేదని వాపోయారు. ఈ విషయంలో తమను వైసిపి నేతలు మోసం చేశారని బాధితులు ఆరోపించారు. ఈ విషయాన్ని అప్పారావుపేట జనసేన నాయకుల సహకారంతో శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లామని, తమకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని బాధితులు వివరించారు.

# గోదావరి డెల్టాకు.. 31 నుంచే నీరు...

- చివరి ఎకరం వరకు సాగునీరు లక్ష్యం-
- కాలువ మరమ్మత్తు పనులు తక్షణం పూర్తి చేయాలి : మంత్రి నిమ్మల



**నరసాపురం మే 23 ప్రభాతవార్త**

పంట కాలువలపై కోట్లాది రూపాయితో జరుగుతున్న పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా నాణ్యత ప్రమాణాలతో నిర్దేశించిన గడువు లోగా పూర్తి చేయాలని రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం జిల్లాలో సాగునీటి పరిస్థితులపై ఇరిగేషన్ అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఓఅండ్ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలిస్తూ, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో మొత్తం 492 పనులకు రూ. 27.34 కోట్లు మంజూరు కాగా, ప్రస్తుతం 241 పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. కాలువల్లో పూడికతీత, అత్యవసర మరమ్మత్తులు, తూడు మరియు గుర్రపుడెక్క తొలగింపు పనులను వెంటనే పూర్తి చేసి, చివరి ఎకరం వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. గోదావరి డెల్టాకు ఈ నెల 31 నుంచే సాగునీరు విడుదల చేయనున్నట్లు ప్రకటించిన మంత్రి, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి విమర్శించారు. సకాలంలో సాగునీరు అందక గోదావరి డెల్టా రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గోదావరి డెల్టా ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, రూ.14 కోట్లతో లైడార్ సర్వే నిర్వహించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఆధునీకరణ పనులను త్వరలో ప్రారంభించి, 2028 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. సమావేశంలో ఎస్ఇ దేవ ప్రకాష్, ఈ ఈ రమేష్ , డి ఈ ఈ లు వెంకటనారాయణ, ధర్మజ్యోతి, ఏఈలు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు పరిశీలన**

పాలకొల్లు పట్టణంలో కోట్ల రూపాయలతో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు పరిశీలించారు. 27వ వార్డులో క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, ఎన్టీఆర్ కళాక్షేత్రం, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో సుందరీకరణ పనులను పరిశీలించి అధికారులు ఏజెన్సీలకు పలు సూచనలు ఇచ్చారు.

## చట్టాల గురించి బాలికలకు అవగాహన అవసరం

### న్యాయమూర్తి ఏ వాసంతి



**ప్రభాతవార్త మే 23 నరసాపురం** పాఠశాలల్లోనూ కళాశాలలో బాలికలు విద్యార్థులు ప్రస్తుతం ఉన్న చట్టాలపై ముఖ్యంగా మహిళలకు రక్షణ కల్పించే చట్టాల మీద తగిన అవగాహన కలిగి ఉండాలని అలాంటప్పుడు వారికి ఏదైనా అన్యాయం జరిగితే తగిన రక్షణ పొందడానికి అవకాశం ఉంటుందని కిరాతకుల భరతం పట్టవచ్చు అని ఇందులో భాగంగా ఫోక్సో చట్టం పట్ల ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నరసాపురం పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షులు ఏ వాసంతి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు ముఖ్యంగా బాలికలు యువకులు ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న నేర ప్రవృత్తి పట్ల అత్యంత జాగరూకులై ఉండాలని కోరారు. ఎప్పుడు ఎవరికీ ఎలాంటి అన్యాయం జరిగినా చట్టం వారికి తోడుగా ఉంటుందని ఇందుకోసం న్యాయవ్యవస్థ అనేక విధాలుగా చట్టాలను రూపొందించడమే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన వారికి అండగా నిలిచేందుకు న్యాయవాదులను సైతం నియమిస్తోందని అందువల్ల ఎవరు వెనుకడుగు వేయవలసిన అవసరం లేదన్నారు. అన్యాయం జరిగినప్పుడు ముందుకు వచ్చినప్పుడే ప్రగతి మార్గం వైపు నడవగలమని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి రావడం అలవాటు చేసుకోవాలని బుక్ రీడింగ్ అనేది ఎంతో మంచి అలవాటే కాకుండా బంగారు భవితకు అండగా నిలుస్తుందని వివరించారు. న్యాయమూర్తి గంగరాజు డీఎస్పీ సుధాకర్ మ్యాజిస్ట్రేట్ రంగనీడి సుబ్బారావు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎర్రంశెట్టి ఫణికర్ లైబ్రేరియన్ కుమారి ఏ అమ్మాజీ ఎస్ రాజ్యలక్ష్మి సిహెచ్ రెడ్డప్ప దేవిజి ఎం సుధీర్ మోహన్ పలువురు న్యాయవాదులు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శనను న్యాయమూర్తి ప్రారంభించారు.



## దొరసానిపాడులో వికసిత్ భారత్



**ద్వారకాతిరుమల,మే23 ప్రభాతవార్త** : ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడు గ్రామంలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంట్ సభ్యురాలు దగ్గుపాటి పురందేశ్వరి ఆశీస్సులతో ద్వారకాతిరుమల మండల బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు రాయపాటి ఎన్వి శివరాజు చౌదరి ఆధ్వర్యంలో విబిజి రాంజీ ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలను కలిసి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో ఉన్న సమస్యలను కూలీలను అడిగి తెలుసుకుని, వాటిని ఎంపీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు చేరేలా బీజేపీ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. అలాగే అక్కడ ఉన్న కూలీలకు చల్లని మజ్జిగ, బిస్కెట్లు, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, మోదీ పాలనలో సంక్షేమం ప్రతి ఇంటికీ చేరుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిడమర్తి సత్యకుమార్,మైలు శ్రీనివాస్,గంజి రామారావు,మిడత నాగేశ్వరరావు, మెట్టపల్లి మాణిక్యాలరావు, అబ్బ దాసరి నాగు,ముల్లంగి ఈశ్వర్‌రెడ్డి,అప్పలరాజు, మణిమాల చింతయ్య, బాణం వినోద్, సొంగ వీరాంజనేయులు, మల్లవరపు సూర్య, కోట రాము, మద్రాస్ బేబీ, ప్రధాన కార్యదర్శులు పల్లవ రాజు,కనుమూరు యామిని పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ యువమోర్చా మండల అధ్యక్షుడు రాయపాటి ఎన్వి శివరాజు చౌదరి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గ్రంథాలయంలో పుస్తక సమీక్ష



**పెనుమంట్ర, మే-23, (ప్రభాతవార్త)** పెనుమంట్ర శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరములో విద్యార్థులతో కథలు చెప్పించడం, ఇంగ్లీష్ పదాలు పూరించడం, పుస్తక సమీక్ష నిర్వహించడం జరిగిందని గ్రంథ పాలకుడు కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ కే దుర్గాప్రసాద్ భగవద్గీత శ్లోకాలు అవగాహన, వ్యక్తిత్వ వికాసము పుస్తక పఠనంతోనే సాధ్యమవుతుందని అన్నారు. రీసెర్చ్ పర్సన్ కె వెంకటరావు విద్యార్థులు ఖాళీ సమయాన్ని వృధా చేయకుండా సమ్మర్ క్యాంపు తర్వాత కూడా గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానవంతులు కావాలన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయంలో సభ్యత్వం పొందాలన్నారు. ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కార్మికులు నిరసన



**పెనుమంట్ర, మే-23, (ప్రభాతవార్త)** మండలంలోని సత్యవరం సచివాలయం వద్ద ఉపాధి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి పని దినాలు పెంచాలని, రోజుకు రూ. 700/-, వేతనం ఇవ్వాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని, తదితరులు డిమాండ్లతో సచివాలయంలో వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో కడల నాగమణి, దొంగ పద్మావతి, ఎల్లమిల్లి నాగసూరిబాబు, కడలి శ్రీనివాసు, కట్టా దుర్గారావు, కట్టా శ్రీనివాస్, గుడాల రాంబాబు, కడలి నారాయణరావు, బొక్క రామకృష్ణ తదితరి ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఈనెల 24, 25 తేదీలలో పశ్చిమలో మంత్రి గొట్టిపాటి పర్యటన



**పెనుమంట్ర, మే-23, (ప్రభాతవార్త)** రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ నెల 24, 25 తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లాలో విస్తృత పర్యటన నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. 24వ తేదీ ఆదివారం సాయంత్రం 7.00 గంటలకు తాడేపల్లి నివాసం నుండి బయలుదేరి రాత్రి 9.00 గంటలకు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు చేరుకొని ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లో రాత్రి బస చేస్తారు. 25వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు తణుకు నుండి బయలుదేరి 10.00 గంటలకు పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం గ్రామానికి చేరుకుంటారు. అక్కడ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. తదుపరి 10.35 గంటలకు గరువు గ్రామానికి చేరుకొని రహదారుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం 11.00 గంటలకు నౌదూరు సెంటర్ కు చేరుకొని, అక్కడ నుండి అక్కడ నుండి బ్రహ్మణ చెరువు వరకు నిర్మించిన రహదారిని ప్రారంభిస్తారు. 11.25 గంటలకు మార్టేరు గ్రామానికి చేరుకొని అచంట రోడ్డులోని ఎస్సీ/ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టును ప్రారంభిస్తారు. తర్వాత 11.50 గంటలకు పెనుగొండ గ్రామం మరియు మండలానికి చేరుకొని 132/33 కెవి సబ్‌స్టేషన్‌లో నూతన 50 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.20 గంటలకు వడలి గ్రామానికి చేరుకొని సుబ్బారాయుడు పుంత వద్ద నిర్మించిన డబ్ల్యూబీఎం రహదారిని ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్న భోజన విరామం కోసం కొమ్ముచిక్కల గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నివాసానికి వెళ్తారు. మధ్యాహ్నం 2.00 గంటలకు అక్కడి నుండి బయలుదేరి సాయంత్రం 5.00 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారని జిల్లా సమాచార శాఖ ఆ ప్రకటనలో తెలిపింది.

## కరెంటు వోల్టేజ్ సమస్య పరిష్కరించాలి- గ్రామస్తులు వినతి



**మొగల్తూరు మే 23(ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామపంచాయతీ పరిధి కుక్కలవారి తోట గ్రామంలో తీవ్ర వోల్టేజ్ సమస్య వేసవి సందర్భంగా అధిక ఉష్ణోగ్రతలు నేపథ్యంలో నెలకొనడంతో గ్రామస్తులు శనివారం విద్యుత్ శాఖ అధికారులను ఆశ్రయించారు. గ్రామంలో తరచూ తక్కువ వోల్టేజ్ సమస్య రావడంతో గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని, రాత్రివేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు సంబంధిత అధికారి ఎ డి ఈ రాజీవ్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఓల్టేజి సమస్య వడియార్ వీధిలో కూడా తాండవం చేస్తుంది. డిమాండ్ కు తగినంత ట్రాన్స్ఫారం సామర్థ్యం సరిపోకపోవడం తో అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## పారిశుధ్య నిర్వహణ ద్వారానే ప్రజారోగ్య పరిరక్షణ : ఆర్డీవో దాసిరాజు



**భీమవరం టౌన్, మే 23 : ప్రభాతవార్త** పట్టణంలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలంటే తప్పనిసరిగా ప్రజల భాగస్వామ్యం, సహకారం అవసరమని, అదే ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర వహించనున్నదని ప్రత్యేక అధికారి మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు వెల్లడించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్ర మంలో భాగంగా శనివారం ఉదయం 5:30 గంటలకు స్థానిక ప్రకాశం చౌక్ నందు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశు ధ్య నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, పట్టణంలోని అన్ని వార్డులలో పారిశుధ్య నిర్వహణ నిరంతరం కొనసాగాలని అన్నారు. పరిశు భ్రమైన పట్టణ నిర్మాణంలోనూ, ప్రజారోగ్య పరిరక్షణ లోనూ ప్రతి పౌరుడు తప్పక భాగస్వామ్యం వహించాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారుల స్వీపింగ్, కాలువలలో పేరుకుపోయిన చెత్త, మురుగు మరియు వ్యర్థ పదార్థాల తొలగింపు చేపట్టడంతో పాటు రోడ్ల పక్కన పేరుకు పోయిన చెత్తను తొలగించి పరిస రాలను పారిశుధ్య సిబ్బంది శుభ్రప రిచారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగా హన కల్పిస్తూ, పట్టణాన్ని పరిశు భ్రంగా మరియు ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తిం చాలని అధికారులు సూచించారు. ప్రతి దుకాణా దారులు డస్ట్ బిన్ నిర్వహిం చాలని, రోడ్లపై చెత్త వేయరాదని, అతిక్ర మించిన వారికి జరిమానా విధించడంలో వెనుకాడరాదని, ప్లాస్టిక్ వినియోగాన్ని, అమ్మ కాలను నిషేధించి ప్లాస్టిక్ రహిత పట్ట ణంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, ఇతర అధికారులు పారిశు ధ్య సిబ్బందితో కలిసి రోడ్లను శుభ్రపరి చారు. యనమదుర్రు డ్రెన్ లోని చెత్తను తొలగిం చారు.ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామ రాజు యువజన సమితి అధ్యక్షులు కంతేటి వెంకట రాజు , జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు రంగసాయి , చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతిని ధులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు మరియు సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజారోగ్య అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని వారు తెలిపారు. ఆర్డీవో దాసిరాజు, పలు శాఖల జిల్లా అధికారులు ,డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ ఆర్ సోమశేఖర్, పారిశుధ్య సిబ్బంది, ఇంజినీ రింగ్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు మరియు ఇతర శాఖల సిబ్బంది సమన్వ యంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. భీమవరం పట్టణాన్ని స్వచ్ఛమైన, అంద మైన మరియు ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిది ద్దేందుకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్య క్రమం నిరంతరంగా కొనసాగుతుందని అధికా రులు తెలిపారు.

## సచివాలయం ఆకస్మిక తనిఖీ



**మొగల్తూరుమే 23 (ప్రభాతవార్త )** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం జగన్నాధపురం గ్రామ సచివాలయాన్ని జి ఎస్ డబ్ల్యు ఎస్ పరిధి డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందిస్తున్న ప్రజా సేవలు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందుతున్నాయా లేదా అనే అంశంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కార్యాలయంలో పరిశుభ్రత, ఫైళ్ల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వాట్సాప్ గ్రీవెన్స్ పై ప్రజలకు అవగాహన పై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటించాలని హెచ్చరించినట్లు సమాచారం. తనిఖీల్లో సచివాలయ సిబ్బంది విధులు, పని పట్ల సంతృప్తి చెందారు. ఈ తనిఖీలో జగన్నాధపురం స్వర్ణ గ్రామ అభివృద్ధి అధికారి పొన్నమండ సత్యనారాయణ, కోమటి తిప్ప స్వర్ణ గ్రామ అభివృద్ధి అధికారి ఎం నాగమణి మరియు సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరాల వెంకన్న ను దర్శించుకున్న భక్తులు



**అత్తిలి, మే 23( ప్రభాత వార్త )**: అత్తిలి మండలం ఈడూరు గ్రామం లో గల వరాల వేంకటేశ్వరస్వామిని శనివారం వైశాఖమాసం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, తోమాల సేవ , విశేష అర్చనలు జరిపారు. భక్తుల సహకారంతో రాగయుక్తంగా గోవింద నామాలను పఠించారు. దేవాలయ కమిటీ సహకారం తో అన్నదానం జరిపారు.అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్డులో గల బాలాజీ వేంకటేశ్వరస్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు , వల్లి వెంకటేష్ , సూర్య తేజ ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు.

## ఆర్థిక నిర్వహణపై అవగాహన



**అత్తిలి, మే 23( ప్రభాత వార్త )** అత్తిలి మండలం ఉ ర దా ళ్ల పాలెం గ్రామంలో ఐసిడిఎస్ఆధ్వర్యంలో కిశోర్ వికాసం కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాన్ని పర్యవేక్షకురాలు ఎం శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్థిక నిర్వహణ అంశంపై అవగాహన కలిగించారు. అంగన్వాడీ కార్యకర్తలు సి హెచ్ ఆర్ కే కుమారి, జి నాగజ్యోతి, ఎం వి లక్ష్మి, ఆశా కార్యకర్తలు డి కుమారి, కే వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శిథిలంగా మారిన ప్రాథమిక పాఠశాల పట్టించుకోని అధికారులు



**మొగల్తూరుమే 23 (ప్రభాతవార్త)**: పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం జగన్నాధపురం గ్రామపంచాయతీ పరిధిలో సచివాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని స్థానిక గ్రామస్తులు శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పాఠశాల గోడలు పగుళ్లు ఏర్పడి, పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో భవనం మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని, చిన్నారులు భయాందోళనల మధ్య విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పలుమార్లు దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. ప్రమాదకరంగా మారిన పాఠశాల భవనాన్ని వెంటనే పరిశీలించి, కొత్త భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## పొగాకు వ్యతిరేక పోస్టు కార్డు ఉద్యమం



**ఆగిరిపల్లి మే23 ప్రభాతవార్త** నవజీవన్ బాల భవన్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ నందు ప్రపంచ పొగాకు వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా “పోస్ట్ కార్డ్స్ ఉద్యమం” కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అగిరిపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ సలాం మాట్లాడుతూ, పొగాకు వినియోగం ఆరోగ్యానికి అత్యంత హానికరమని తెలిపారు. పొగాకు కారణంగా క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు వంటి అనేక ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత పొగాకు బారిన పడకుండా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచాయత్ సెక్రటరీ వరలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల్లో పొగాకు వ్యతిరేక అవగాహన పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రతి కుటుంబం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అనంతరం నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎన్. దేవమణి మాట్లాడుతూ, ప్రపంచ పొగాకు వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న “పోస్ట్ కార్డ్స్ ఉద్యమం” ద్వారా ప్రజలు తమ సందేశాలను ప్రభుత్వానికి మరియు సమాజానికి చేరవేస్తున్నారని తెలిపారు. పొగాకు రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలోనవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి. వెంకటేశ్వరావు ముఖ్య అతిథులు “పోస్ట్ కార్డ్స్ ఉద్యమం”లో పాల్గొని, పొగాకు వ్యతిరేక సందేశంతో మొదటి పోస్టు కార్డును పూర్తి చేసి అందజేశారు. అనంతరం ప్రత్యేక పొగాకు వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ఆఫీస్ జూనియర్ అసిస్టెంట్ జోసెఫ్ విజయ్, మహిళా సంరక్షణ కార్యదర్శి.పార్వతి, సిబ్బంది, ప్రయాణికులు పెద్ద ఎత్తున పాల్గొని పొగాకు వ్యతిరేక సందేశాలను పోస్ట్ కార్డుల ద్వారా తెలియజేశారు.

## మండవల్లి జాతీయ రహదారిపై వీధిలైట్లు ఏర్పాటు



**మండవల్లి మే 23 (ప్రభాతవార్త)** మండవల్లిలోని 165వ జాతీయ రహదారిపై ఎట్టకేలకు అధికారులు వీధిలైట్ల ఏర్పాటు పనులు శనివారంప్రారంభించారు. జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల గత 2 ఏళ్లుగా రహదారిపై వీధిలైట్లు లేక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై బిజెపి నాయకులు వై. శ్రీనివాసరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులు అప్పారావు, శ్రీనివాసరావు, జనసేన నాయకులు రవితేజ పిజిఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్ కు, నేషనల్ హైవే అధికారులకు పలుదఫాలుగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపిడివో కె.రమణ బాబు, తహసీల్దార్, మండవల్లి ప్రత్యేక అధికారి గోపాల్ స్పందించి నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి పనులు త్వరితంగా చేసేలా చర్యలు తీసుకున్నారు. జాతీయ రహదారిపై 49 వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నారని, నెల రోజుల్లో పనులు పూర్తవుతాయని ఎంపీడీవో రమణబాబు తెలిపారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన బిజెపి నాయకులు ఐక్యవేద నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పారక్వాట్ కలుపు మందుపై 60 రోజులు నిషేధం: కామవరపుకోట ఏఓ



**కామవరపుకోట, మే 23(ప్రభాతవార్త)**: ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిన ‘పారక్వాట్ డైక్లోరైడ్ 24% ఎస్ ఎల్’ కలుపు మందు అమ్మకాలు, నిల్వలు మరియు వినియోగంపై కామవరపుకోట మండలంలో 60 రోజుల పాటు తాత్కాలిక నిషేధం విధిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి డి. ముత్యాలరావు శనివారం తెలిపారు. పురుగుమందుల చట్టం 1968 లోని సెక్షన్ 3 ప్రకారం ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయన్నారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ వంటి వ్యవసాయ, ఉద్యానవన పంటలతో పాటు ఖాళీ ప్రదేశాలలో కలుపు నివారణకు వాడే ఈ మందు అత్యంత ప్రమాదకరమైనదని, గ్రామీణ ప్రాంతాలలో దీని కారణంగా మరణాల రేటు ఎక్కువగా నమోదవుతోందని ఆయన తెలిపారు.ఈ నేపథ్యంలో మండలంలోని రిటైల్ డీలర్లు, రైతులు మరియు వినియోగదారులు ఎవరూ కూడా ఈ కలుపు మందును విక్రయించకూడదని, వినియోగించకూడదని స్పష్టం చేశారు. ఈ నిబంధనలను అతిక్రమించి మందును నిల్వ చేసినా లేదా విక్రయించినా సదరు రిటైల్ డీలర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి హెచ్చరించారు.

## ప్రపంచ తాబేళ్ల దినోత్సవం కార్యక్రమం



**మొగల్తూరు, మే 23 (ప్రభాతవార్త)**: సముద్ర జీవ వైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అరుదైన ఆలివ్ రిడ్లీ తాబేళ్ల సంరక్షణకు ప్రజలు ముందుకు రావాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ తాబేళ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పేరుపాలెం బీచ్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 55 ఆలివ్ రిడ్లీ తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఎ. కిరణ్, తహసీల్దార్ కె. రాజ్‌కిషోర్ పాల్గొన్నారు. సముద్ర అలలను అనుసరిస్తూ తాబేళ్ల పిల్లలు సురక్షితంగా సముద్రంలోకి చేరుకోవడం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ఆలివ్ రిడ్లీ తాబేళ్లు అత్యంత అరుదైన జాతులలో ఒకటని, వాటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. సముద్ర తాబేళ్ల ఆవాసాలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కె.పీ పాలెం, పేరుపాలెం బీచ్‌లను అభివృద్ధి చేసి నరసాపురాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. టూరిజం అభివృద్ధితో గ్రామాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బియ్యపుతిప్ప నుంచి మొల్లపర్రు వరకు 18 కిలోమీటర్ల తీరప్రాంతంలో 78 తాబేళ్లు 8,620 గుడ్లు పెట్టాయని తెలిపారు. కంపాస్ స్కీం కింద పేరుపాలెం, పెదమైనవారిలంక ప్రాంతాల్లో తాబేళ్ల గుడ్ల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటివరకు 5,164 తాబేళ్ల పిల్లలను సముద్రంలోకి విడుదల చేసినట్లు ...ల్లడించారు. గుడ్లను సంరక్షించి సముద్రంలో విడిచిపెట్టడం వల్ల తాబేళ్ల సంతతి 60 శాతం వరకు పెరిగిందని అన్నారు. ప్రతి శనివారం విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం ద్వారా సముద్ర జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎం. కరుణాకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె. రాంప్రసాద్, స్పెస్ ఎన్జీవో కోఆర్డినేటర్ జీఎం కృష్ణారావు, టిడిపి నాయకులు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

### డప్పు కళాకారులకు చర్మకారులకు
## పింఛన్లు వెంటనే ఇవ్వాలి

**ఆగిరిపల్లి మే 23 ప్రభాకర్ ప్రభాత వార్త**

రాష్ట్రంలో డప్పు చెప్పు కార్మిక కళాకారుల సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యస్ సి సెల్ నాయకులు కంబాల ప్రదీప్ విమర్శించారు. ప్రభుత్వ ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ డప్పు కళాకారులకు,చర్మకారులకు ఒక కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడం బాధాకరం. అన్నారు ప్రస్తుతం మాత్రం ఈ వర్గం పూర్తిగా నిర్లక్ష్యం పాలవుతోంది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తిగా దళితులు, చర్మకారులు, డప్పు కళాకారులపై వివక్షత కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు ఎస్సీ/ఎస్టి నిధులు ఉన్నప్పటికీ వాటిని ఈ వర్గాల సంక్షేమానికి ఉపయోగించకుండా ప్రభుత్వ వైఖరి అన్యాయమని, డప్పు మరియు చర్మకారులు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేలా తక్షణ చర్యలు తీసుకోవాలంటే డిమాండ్ చేశారు డప్పు మరియు చర్మకారులకు అందరికీ గుర్తింపు కార్డులు జారీ చేయాలని “ కొత్త పింఛన్ల నమోదు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. పింఛన్ మొత్తాన్ని 7000/– పెంచాలి. పింఛన్ వయసు 40 సంవత్సరాలకు తగ్గించాలి. ప్రభుత్వ పథకాల ప్రచారంలో డప్పు మరియు చర్మకారులకు ఉపాధి కల్పించాలి ప్రతి జిల్లాలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. రాష్ట్రస్థాయిలో “డప్పు మరియు చర్మకారుల పండుగ “ నిర్వహించాలనీ కోరారు.దేవాలయ కమిటీలలో సభ్యత్వం కల్పించాలి. ఇల్లు లేని వారికి గృహాలు ఏర్పాటు చేయాలి రవాణాచార్జీలలో రాయితీలు ఇవ్వాలి. ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలనీ ఈ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డప్పు మరియు చర్మకారులు ఐక్యం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు.

## పచ్చి రొట్ట ఎరువులు శ్రేయస్కరం
### మండల తెదేపా అధ్యక్షుడు ఇజ్జిగాని



**చాట్రాయి, మే 23 ప్రభాతవార్త** భూమిని సారవంతంగా మార్చేందుకు వచ్చినట్ల ఎరువులు ఎంతగానో దోహద పడతాయని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జి గాని వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఆరుగొలనుపేట గ్రామంలో ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ, పిల్లి పెసర తదితర దయతర పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంబించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పచ్చిరొట్ట ఎరువులు భూమికి ఎంతో శ్రేయస్కరమని అధిక దిగుబడి సాధించేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందాలని వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు రసాయనక ఎరువులను తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనేక రకాలైన రసాయనిక ఎరువులు వాడి దిగుబడి పెంచడం కంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే మార్గాన్ని రైతులు ఎంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం ఏఈఓ సత్యవాణి, ఆరుగొలను పేట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పానుగళ్ళ కోటేశ్వరరావు, రైతులు పుచ్చకాయల సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

### పారిశుధ్యం ద్వారానే
## పరిపూర్ణ ఆరోగ్యం
### వ్యాపారస్తులు సహకరిస్తేనే ప్లాస్టిక్ అంతం : ప్రభుత్వ విప్ నాయకర్



**నరసాపురం మే 23 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్‌ను అత్యంత పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “ఆపరేషన్ క్లీన్ స్వీప్” కార్యక్రమంలో భాగంగా శనివారం నరసాపురం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ చిరు వ్యాపారస్తులతో మాట్లాడి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సూచించారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి స్వయంగా రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగిస్తూ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ప్రతి ఇంటి వద్ద నుంచి ప్రతి వీధి వరకు పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే నాయకర్ పేర్కొన్నారు. “మన ఊరు -- మన బాధ్యత” అనే భావనతో ప్రజలందరూ ముందుకు వచ్చి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి .రాహుల్ కుమార్ రెడ్డి, డీఎస్పీ సుధాకర్ రావు , టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు , నరసాపురం మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి , రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ మరియు మున్సిపల్ సిబ్బంది, జనసేన పార్టీ, టీడీపీ , బీజేపీ నాయకులు జనసైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

## మూడు ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎస్ఐ



**అత్తిలి, మే 23 (ప్రభాతవార్త)** అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు అత్తిలి ఎస్ఐ కేవెన్ విశ్వనాథ్ తెలిపారు. సీజ్ చేసిన ట్రాక్టర్లను తాసిల్దార్ కోర్టులో హాజరుపర్చ గా తాసిల్దార్ వంశీ ట్రాక్టర్ ల నిర్వహకులకు జరిమానా విధించినట్లు తెలిపారు.

## ట్రాక్టర్ పల్టీ ఇరువురికి గాయాలు



**చాట్రాయి, మే 23, ప్రభాతవార్త** మొక్కజొన్న లోడ్ తో ఉన్న ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ఇరువురికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం తుమ్మ గూడెం శివారు జయపురం గ్రామం నుండి మొక్కజొన్న లోడుతో వస్తుండగా రోడ్డు అద్వానంగా ఉండడంతో గోతులో పడి పల్టీ కొట్టింది. ట్రాక్టర్లో కూలీల ఐదుగురు ఉండగా ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు ఎన్నిసార్లు కోరినా అధికారులు పాలకులు పట్టించుకోకపోవడంతో ఈ రోడ్డులో ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయి. గతంలో ద్విచక్ర వాహనాల మీద కూడా పలువురు గోతుల్లో పడగా తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.